


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 23-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 248 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ. 1.43 తదుపరి త్రయోదశి; నక్షత్రం: విశాఖ సా. 5.40 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 9.33-11.06; దుర్ముహూర్తం: మ. 12.36-1.20, మ. 2.48-3.32; అమృతఘడియలు: ఉ. 9.13-10.45; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 5.42 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai




# అయ్యో.. ఇప్పుడెలా?

## ఐఏఎస్, ఐపీఎస్‌ల గుండెల్లో రైళ్లు

**అమరావతిలో 350 మంది అధికారులకు ఇళ్ల స్థలాలు**

- 500 గజాలకు 25 లక్షల చెల్లింపు
- ఫిబ్రవరిలోనే భూముల రిజిస్ట్రేషన్
- తాజా పరిణామాలతో దిగాలు
- మధ్య, దిగువ శ్రేణి ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణం
- ఇళ్లు, భూములు కొనుక్కున్న సిబ్బంది
- ఉన్నదంతా అమ్ముకుని కొందరు.. రుణాలు తీసుకుని మరికొందరు
- రాజధాని తరలితే ఈఎంఐ భారం
- కొత్త చోట ఇంటి అద్దెల భయం
- విలవిలలాడుతున్న వేతన జీవులు



ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన స్థలిలో మహిళలు, విద్యార్థుల ధర్నా

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధానిపై నమ్మకంతో అమరావతి ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వారిని చూసి ఇంటి స్థలాలు, ఇళ్లు/ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్య, దిగువ తరగతి ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పైకి ఎవరూ చెప్పుకోవడం లేదు కానీ.. వారిలో తీవ్రమైన అలజడి రాజుకుంది. ఏ ఇద్దరు కలిసినా.. జీవిత కాలం కష్టపడి సంపాదించిన సొమ్మును పోగేసి కొంటే.. ఇప్పుడవి మట్టిపాలేనా అని ఆందోళన, ఆవేదన చెందుతున్నారు. కొందరైతే హాహాకారాలు చేస్తున్నారు. రాజధాని మార్పుతో వేతనంలో

మిగతా 12వ పేజీలో...

### మాకు భవిష్యత్ వద్దా?

**కదం తొక్కిన విద్యార్థులు**

- రైతులకు మద్దతుగా పోరుబాట
- మద్దతు తెలిపిన గుంటూరు వైద్యులు 9
- రాజధానిలో ఐదోరోజూ తీవ్ర ఆందోళన
- జీవితాలు నాశనమవుతాయని ఆవేదన
- టెంట్‌హౌస్‌లకు పోలీసుల నోటీసులు
- రైతులపై మరో రెండు కేసుల నమోదు
- నేటి నుంచి విధుల బహిష్కరణ
- హైకోర్టు తరలింపుపై లాయర్ల నిరసన



**రాజధాని రగడ అమిత్ షా దృష్టికి!**

రెండ్రోజుల్లో భేటీ కానున్న సుజనా, రైతులు

అమరావతిపై వైఖరి తెలుసుకునే యత్నం 9



**అమరావతి కాదది.. రాజస్థాన్ ఎడారి!**

స్పీకర్ తమ్మినేని వ్యాఖ్యలు






11

## దస్ కా దమ్!

**చివరి వన్డేలో భారత్ ఉత్కంఠ విజయం**

- శార్దూల్, జడేజా మెరుపులు
- కోహ్లీ, రాహుల్, రోహిత్ హాఫ్ సెంచరీలు
- భారత్ ఖాతాలో పదో ద్వైపాక్షిక సిరీస్
- ఏడాదికి ఘనంగా వీడ్కోలు

# ఎన్నార్సీపై వెనక్కి?

**దేశవ్యాప్త ఎన్నార్సీపై చర్చే లేదన్న ప్రధాని మోదీ**

- 2014 నుంచి ఇప్పటిదాకా పార్లమెంటులోగానీ కేబినెట్‌లోగానీ దానిపై మేం చర్చించలేదు
- భారత ముస్లింలారా ఆందోళన వద్దు
- ఎన్నార్సీ, పౌరసత్వ చట్టం మీకు వర్తించవు
- ముస్లింలందరినీ నిర్బంధ శిబిరాలకు పంపేస్తారన్న వదంతులు నమ్మొద్దు
- అర్బన్ నక్సల్స్, కాంగ్రెస్ వదంతులవి
- దేశ యువత సీఏఏ చట్టాన్ని చదవాలి: మోదీ
- ఎన్నార్సీపై షా వ్యాఖ్యలకు విరుద్ధ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, డిసెంబరు 22: దేశవ్యాప్తంగా ఎన్నార్సీ అమలు చేస్తామంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు విరుద్ధ వ్యాఖ్యలు ప్రధాని మోదీ చేశారు. ఎన్నార్సీ, సీఏఏపై నిరసన స్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో 'దేశవ్యాప్త ఎన్నార్సీపై వెనుకడుగు వేశారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఎన్నార్సీని తెస్తామంటూ బీజేపీ తన 2019 ఎన్నికల మేనిఫెస్టోలో కూడా చేర్చగా.. దాని గురించి పార్లమెంటులోగానీ, కేబినెట్‌లోగానీ తామసలు చర్చించనే లేదని పేర్కొన్నారు. నిజానికి ఎన్నార్సీ ప్రతిపాదన గత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని వివరించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభతో ఎన్నికల ప్రచారానికి తెర తీసిన ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "2014లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ఎన్నార్సీని ఎక్కడ అమలు చేయాలనేదానిపై మేమెప్పుడూ చర్చించుకోలేదనే విషయాన్ని 130 కోట్ల మంది భారతీయులకు

మిగతా 10వ పేజీలో...

## అమ్మో అంత అప్పా!

- అంచనాలకు ఐదు రెట్లు ఎక్కువ!
- అంత వ్యత్యాసం ఎందుకొచ్చింది? 2
- 'ప్రజా ఖాతా' నిధుల బదిలీపై కేంద్రం ఆరా
- కారణాలు చెప్పాల్సిందేనని రాష్ట్రానికి ఆదేశం
- స్పష్టత ఇచ్చాకే తదుపరి రుణానికి అనుమతి
- రాష్ట్ర ఆర్థిక శాఖకు కేంద్రం లేఖ

## యూపీ హింసలో బెంగాల్ బీభత్సం!

- మాల్డాకు చెందిన ఆరుగురి అరెస్టు.. వారికి పీఎఫ్ఐ, సిమితో సంబంధాలున్నాయి
- 500 ఖాళీ క్యాట్రిడ్జ్‌లు స్వాధీనం.. నాటు తుపాకులతో కాల్పులు జరిపారు 10
- యూపీ డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు.. కొనసాగుతున్న నిషేధాజ్ఞలు.. ప్రశాంతం









జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు జరుగుతున్న ఏర్పాట్లు

## కడప స్టీల్‌కు శంకుస్థాపన నేడే

2

- 3 రోజులపాటు సొంత జిల్లాలో జగన్ పర్యటన
- కడప జిల్లాకు నిధుల వరద.. వారంలో 30 జీవోలు
- 1500 కోట్లు విడుదల.. గంపగుత్తగా పనులకు ఓకే

# ఆత్మవిశ్వాసమే హనుమంతుడి బలం



పరంజ్యోతి

*దాసోహం కోసలేంద్రస్య! రామస్యాక్లిష్టకర్మణః*
*హనుమాన్ శత్రుసైన్యానాం! నిహంతా మారుతాత్మజః*
*నరావణ సహస్రంమే యుద్ధే ప్రతిబలంభవేత్*
*శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః*

"నేను శ్రీరామచంద్రుని దాసుడను. వాయుపుత్రుడను. నాపేరు హనుమంతుడు. శత్రు సైన్యములను రూపుమాపగలవాడను. వేయి మంది రావణాసురులైనా యుద్ధరంగంలో నన్నెదిరించి నిలువజాలరు. వేల శిలలతో, వృక్ష సంచయాలతో.. సమస్త రాక్షస సమూహాలను, లంకా నగరాలన్ని సర్వనాశనం చేయగలను" అని హనుమంతుడు అశోకవనంలో అనుకున్న మాటలు అతనిలోని ఆత్మవిశ్వాసాన్ని తెలుపుతున్నాయి. అనేకమైన అవరోధాలను అధిగమించి.. లంకానగరంలో అడుగుపెట్టి.. అన్ని చోట్లా అన్వేషించి.. చివరికి అశోకవనంలో సీతమ్మను చూశారాయన. ఆ తల్లి వేదనను తగ్గించి.. ఆమెకు అమితానందాన్ని కలిగించిన హనుమంతుడి రాకను తెలుసుకున్న రావణుడు వేలాది రాక్షస సైన్యాన్ని అతడిపైకి పంపినప్పుడు.. తనను సంహరించాడానికి వచ్చిన ప్రహస్తుడి పుత్రుడు జంబుమాలిని, అక్షకుమారుడిని కూడా అంతమొందించి.. అశోకవనంలోని ద్వారబంధంపైకి లంఘించి కూర్చున్న హనుమంతుడనుకున్న ఈ మాటల్లో ఆయన ఆత్మవిశ్వాసం ప్రతి అక్షరంలోనూ కనిపిస్తుంది.



ఏ వ్యక్తికైనా కష్టాలను, కడగండ్లను దాటి, విజయం సాధించాలనుకున్నప్పుడు ముఖ్యంగా కావాల్సింది ఆత్మవిశ్వాసం. సీతాన్వేషణకు బయల్దేరిన వానరులంతా దక్షిణ సముద్ర తీరానికి చేరుకుని, "ఈ సముద్రాన్ని దాటడం ఎలా?" అన్న విచికిత్సకులోనై.. తుదకు అంతటి శక్తిమంతుడు హనుమంతుడేనన్న నిర్ణయంతో వారధిని లఘించి.. లంకకు వెళ్ళి.. సీతమ్మజాడ కనుగొనే బాధ్యతను ఆంజయేయుడికే అప్పగించారు. అంతటి మహత్కార్యంలో.. హనుమ ఎదుర్కొన్న అవరోధాలు అనేకం. మైనాకుడి ప్రార్ధన, సురస పెట్టిన పరీక్ష, సింహిక అవరోధం, లంకిని అడ్డగింపు.. వీటన్నింటినీ దాటాకే హనుమంతుడికి సీతాదర్శనమైంది. ఆమెను చూసిన వెంటనే వేగిరపడకుండా.. అక్కడ జరుగుతున్న అన్ని సంఘటనలను, సీతమ్మపై రావణుడి ఛీంకరింపును ప్రత్యక్షంగా చూసి.. మిక్కిలి సందర్భోచితంగా సీతమ్మ ముందుకు వెళ్లాడు. రాముని గురించి వివరించి, తన వాక్‌శక్తితో ఆ తల్లిని నమ్మించగలిగాడు. శ్రీరామచంద్రుడు ఆనవాళ్లుగా ఇచ్చిన ఉంగరాన్ని అందించి.. ఆమె విశ్వాసాన్ని పాదుకొల్పాడు. రామ-రావణ యుద్ధానికి ముందు రాక్షస బలాన్ని పరీక్షించదలిచి.. అశోకవన విధ్వంసానికి పాల్పడ్డాడు. రాక్షస సంహారం చేశాడు. ఇంద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రానికీ బెదరకుండా.. బ్రహ్మదేవుడిని గౌరవిస్తూ.. ఆ బంధనానికి కట్టుబడ్డట్లు నటించాడు. రావణుడితో సంవాదం చేశాడు. లంకను దహించాడు. ఈ ఘట్టాలన్నింటిలో హనుమంతుడి ఆత్మవిశ్వాసం అడుగడుగునా కనిపిస్తుంది. అందుకే.. వాల్మీకి మహర్షి.. సుందరకాండలో హనుమంతుడినే నాయకుడిని చేశారు. సుందరకాండ ప్రారంభంలోనే "నమోస్తు రామాయ సలక్ష్మణాయ, దేవ్యైచతస్యై జనకాత్మజాయైః" అని హనుమ ప్రార్ధనలో లక్ష్మణ సమేత సీతారాములను, ఇతర దేవతలను స్తుతించడం, తను ప్రారంభించిన రామకార్యం విజయవంతమౌతుందన్న నమ్మకం, సమస్త దేవతల ఆశీస్సులున్నాయన్న విశ్వాసం కనిపిస్తుంది. సమస్త విజయాలకు బలమైన భూమిక ఆత్మవిశ్వాసమేనన్నది మహర్షి అంతరంగమే తప్ప మరొకటి కాదనేది సత్యము.

- గన్నమరాజు గిరిజామనోహరబాబు

# అమ్మో అంత అప్పా!

- అంచనాలకు ఐదు రెట్లు ఎక్కువ!
- అంత వ్యత్యాసం ఎందుకొచ్చింది?
- 'ప్రజా ఖాతా' నిధుల బదిలీపై కేంద్రం ఆరా
- కారణాలు చెప్పాల్సిందేనని రాష్ట్రానికి ఆదేశం
- స్పష్టత ఇచ్చాకే తదుపరి రుణానికి అనుమతి
- రాష్ట్ర ఆర్థిక శాఖకు కేంద్రం లేఖ



అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాఖాతాల నుంచి నిధుల బదిలీ ద్వారా పెరుగుతున్న అప్పుపై కేంద్రం స్పష్టత కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాసింది. జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.15,000 కోట్ల ప్రజారుణం సేకరించేందుకు అనుమతి కావాలని ఆర్థిక శాఖ డిసెంబరు మొదటి వారంలో కేంద్ర ఆర్థిక శాఖకు లేఖ రాసింది. దీనిపై స్పందించిన కేంద్రం ప్రజాఖాతాల నుంచి నిధుల బదిలీ ద్వారా పెరుగుతున్న అప్పు గురించి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. ఆ వివరాలు తమకు అందిన తర్వాతే ఏపీ అప్పు అభ్యర్థనపై కసరత్తు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరం నాటికే ఏపీ రుణాల సేకరణ రూ.2,100 కోట్ల మేర అధికంగా వినియోగించుకున్నారని కేంద్రం ఆ లేఖలో తెలిపింది. ప్రజా ఖాతాల పరిధిలోకి వచ్చే స్మాల్ సేవింగ్స్, ప్రావిడెంట్ ఫండ్స్, రిజర్వ్ ఫండ్స్, డిపాజిట్ల పద్దుల కింద ఉండే నిధులు వినియోగించుకోవడం వల్ల 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో పెరిగే మొత్తం అప్పులను అంచనా వేయడంలో విఫలమవడం వల్ల ఇలా జరిగిందని కేంద్రం ఆ లేఖలో స్పష్టతనిచ్చింది. దీనికి సంబంధించిన బడ్జెట్ అంచనా, వాస్తవిక గణాంకాలను కేంద్రం ఆ లేఖలో వివరించింది. 2016-17లో ప్రజా ఖాతాల నుంచి నిధుల బదిలీ ద్వారా పెరిగిన వాస్తవిక రుణాలు 6,709 కోట్లు కాగా, 2019-20 బడ్జెట్‌లో ఆ పద్దు కింద అంచనాను కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే చూపించడాన్ని కేంద్రం ప్రశ్నించింది. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం భారీగా ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో ప్రజా ఖాతాల నుంచి నిధుల బదిలీ ద్వారా పెరిగే అప్పులను అంచనా వేయడంలో ఎందుకు విఫలయ్యారో కారణాలు వివరిస్తూ, అందుకు అవసరమైన పత్రాలు సమర్పించాలని కేంద్రం ఆ లేఖలో ఆదేశించింది. అలాగే, 2018-19, 2019-20 బడ్జెట్ అంచనాల్లో ప్రజా ఖాతాల నుంచి నిధుల బదిలీ ద్వారా పెరిగే అప్పులను రూ.1,818 కోట్లు, రూ.1,500 కోట్లుగా ఎందుకు పేర్కొన్నారో కారణాలు వివరించాలని కోరింది. ఈ వివరాలు తమకు అందిన వెంటనే రూ.15,000 కోట్ల ప్రజారుణం సమీకరించేందుకు ఏపీ పంపిన అభ్యర్థన లేఖపై కసరత్తు ప్రారంభిస్తామని కేంద్రం ఆ లేఖలో స్పష్టం చేసింది. కాగా, రుణం సమీకరించుకునేందుకు కేంద్రం నుంచి అనుమతులు వస్తాయని ఆర్థిక శాఖ ఎదురుచూస్తోంది.

నిబంధనల ప్రకారం రూ.3,300 కోట్లకు అవకాశం ఉందని భావిస్తోంది. కానీ, ఇది 14వ ఆర్థిక సంఘానికి సంబంధించి చివరి ఏడాది కావడంతో, గడచిన ఐదేళ్లకు సంబంధించి రాష్ట్రం జీఎస్‌డీపీ ఎంత, అందులో 3 శాతం మొత్తం ఎంత, ఈ ఐదేళ్లలో ఏపీ అప్పులు 3 శాతాన్ని మించాయా, 3 శాతం లోపే ఉన్నాయా అనేది కేంద్రం పరిశీలిస్తుంది. ఒకవేళ 3 శాతం దాటితే తదుపరి త్రైమాసికానికి అప్పు తెచ్చుకునేందుకు కేంద్రం అనుమతివ్వదు. 3 శాతం లోపు ఉంటే ఆ మొత్తం అప్పుగా తెచ్చుకునేందుకు రాష్ట్రానికి అనుమతి లభిస్తుంది.

**కేంద్రం తన లేఖలో పేర్కొన్న ప్రజా ఖాతాల నిధుల బదిలీ గణాంకాలు** (రూ.కోట్లలో)

| ఆర్థిక సంవత్సరం | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 |
|---|---|---|---|---|
| బడ్జెట్/సవరించిన అంచనాలు | 1229 | 1302 | 1818 | 1500 |
| వాస్తవ గణాంకాలు | 6709 | 6082 | | |
| వ్యత్యాసం | 5480 | 4780 | | |

## నేటి నుంచి విధుల బహిష్కరణ

- హైకోర్టు తరలింపుపై న్యాయవాదుల నిరసన
- రేపు 'చలో హైకోర్టు': అడ్వొకేట్స్ జేఏసీ
- 27 వరకు ప్రతిరోజూ ఆందోళన కార్యక్రమాలు

విజయవాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలపాలని అడ్వొకేట్స్ జేఏసీ తీర్మానించింది. ప్రతిరోజూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని, ఈనెల 24న 'చలో హైకోర్టు' చేపట్టాలని నిర్ణయించింది. ఆదివారం విజయవాడలో నిర్వహించిన బెజవాడ బార్ అసోసియేషన్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు పోపూరి లక్ష్మీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఫెడరేషన్ వివిధ జిల్లాల అధ్యక్షులు నరేంద్రబాబు(గుంటూరు), విజయకుమార్(పశ్చిమ గోదావరి), బొడ్డు భాస్కరరావు(ప్రకాశం), మణిరత్నం(నెల్లూరు), రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు హాజరయ్యారు. లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్, లెజిస్లేటివ్, జ్యుడీషియరీ విభాగాలు మూడూ అమరావతిలోనే కొనసాగించాలని.. ప్రభుత్వం నుంచి విస్పష్ట ప్రకటన వచ్చే దాకా ఉద్యమం తీవ్రతరం చేయాలని తీర్మానించినట్లు చెప్పారు.

### సీమకు ఒరిగేదేమీ లేదు: కేఈ

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా ఎదురైన పరిపాలనా వైఫల్యాలతోపాటు స్థానికంగా ప్రజల్లో, ఇతర రాష్ట్రాల్లో చెడ్డపేరు రావడంతో వాటిని కప్పిపుచ్చుకునేందుకు, జనం దృష్టి మళ్లించేందుకే ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు వైసీపీ ప్రభుత్వం తెరదీసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి మండిపడ్డారు. కర్నూలుకు హైకోర్టు, విశాఖకు పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ చేసిన ప్రకటన ప్రాంతాల పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రేమ ఉండి కాదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13 జిల్లాల వారికీ అందుబాటులో ఉండేలా రాజధాని నిర్మాణాన్ని చంద్రబాబు చేపట్టారని, అందుకే అమరావతిపై ఏ ప్రాంతంలోనూ వ్యతిరేకత రాలేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు జగన్ ప్రకటన, జీఎన్ రావు కమిటీ నివేదిక వల్ల సీమకు ఒరిగేదేమీ లేదని అన్నారు. సీమ ప్రజలు విశాఖకు వెళ్లాలంటే 900 కిలోమీటర్లు ప్రయాణించడం ఏరకంగానూ సమర్థనీయం కాదన్నారు. సీమలో నీటి పారుదల ప్రాజెక్టులపై టీడీపీ ప్రభుత్వం ముందుచూపుతో వెళ్తే, వైసీపీ ప్రభుత్వానికి ఆ ఆలోచనే లేకపోయిందని మండిపడ్డారు. కర్నూలులో మెగా సీడ్‌పార్కును ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

## లోకం తీరు



మీకు ఎన్నిసార్లు చెప్పాలి..
ఆఫీసు ఒత్తిడి ఇంట్లో చూపించొద్దని...

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| కడప | 18.0 | 32.0 |
| హైదరాబాద్ | 18.9 | 28.8 |
| అనంతపురం | 18.2 | 29.1 |
| గుంటూరు | 18.4 | 31.4 |
| శ్రీకాకుళం | 20.0 | 30.0 |
| ఒంగోలు | 22.3 | 30.1 |

### పొడి వాతావరణం

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపైకి తూర్పు, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. తూర్పుగాలుల్లో తేమశాతం ఉండడంతో పలుచోట్ల మేఘాలు ఆవరించాయి. దీంతో పలుచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పొడివాతావరణం నెలకొంటుంది. మేఘాలు ఆవరించడంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం... లేదా ఒక డిగ్రీ అటు ఇటుగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీలంక సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నప్పటికీ డిసెంబరు నెల మూడో వారం ముగియడంతో వర్షాల జోరు తగ్గుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా ఆగ్నేయ, దానికి ఆనుకుని నైరుతి అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం ఏపీపై ఉండదని స్పష్టంచేశారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమలలో ఆదివారం రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 80 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 12గంటలు పడుతోంది. మంగళవారం ఆర్జితసేవలకు సంబంధించి విజయాబ్యాంకులో సోమవారం లక్కీడిప్ ద్వారా జారీచేసే టిక్కెట్లు కల్యాణోత్సవం:80 అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.



### నాజీ జర్మనీ బాటలో భారత్

హిట్లర్ ఏలిన నాజీ జర్మనీ బాటలో మన దేశం పయనిస్తోంది. సీఏఏపై వెంటనే ప్రజలు మేల్కొనకుంటే.. భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మా పార్టీ నాయకులూ ఈవిషయంలో అసోం ప్రజలను దారుణంగా వంచించారు. అక్కసుతో నాకు కల్పిస్తున్న ఎన్‌ఎస్‌జీ భద్రతను ఉపసంహరించారు.

- ప్రఫుల్ల కుమార్, అసోం మాజీ సీఎం(ఏజీపీ)



### కంప్యూటర్ చిప్‌పై కేన్సర్ కణితి

**చికిత్సకు యోగ్యమైన ఔషధం గుర్తింపు**

క్యోటో(జపాన్), డిసెంబరు 22 : కేన్సర్ కణితుల(ట్యూమర్ల) స్వరూప, స్వభావాలు ఎలా ఉన్నాయి? ఏ ఔషధాలకు అవి లొంగుతాయి? అనేది 3డీ పరిజ్ఞానంతో గుర్తించగల అత్యాధునిక పరికరాన్ని జపాన్‌లోని టొహొకు వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దానికి 'ట్యూమర్ ఆన్ ఎ చిప్' అని పేరు పెట్టారు. ప్రయోగశాల స్థాయిలో దీన్ని వినియోగించవచ్చు. నాణెం సైజులో ఉండే ఈ పరికరంలో ఇమిడిపోయేలా కణితి కణజాలం శాంపిల్‌ను ఉంచుతారు. రోగి తీసుకునే ఆహారం ద్వారా ట్యూమర్లకు పోషకాలు, ఔషధాలు అందుతుంటాయి. ల్యాబ్‌లో కూడా అదేవిధంగా 'ట్యూమర్ ఆన్ ఎ చిప్' పర్యవేక్షణలో ఉన్న కణితికి పోషకాలు, ఔషధాలను అందిస్తారు. వాటి ప్రభావంతో దానిలో వస్తున్న మార్పుల ఆధారంగా సదరు కేన్సర్ కణితి చికిత్సకు ఏ ఔషధమైతే సరైందనేది నిర్ధారిస్తారు.

### పెయిన్‌కిల్లర్లు పిల్లలకు విషం

న్యూయార్క్, డిసెంబరు 22: అధిక మోతాదులో, శక్తిమంతమైన పెయిన్‌కిల్లర్లు తీసుకున్న చిన్నారుల్లో అవి విషపూరితంగా మారుతున్నాయి. దీంతో వారు ఆస్పత్రుల్లో చేరుతున్న ఘటనలు అమెరికాలో పెరిగాయి. అమెరికాలోని ఎమోరీ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. పెయిన్‌కిల్లర్లను అధిక మోతాదులో తీసుకోవడం, అదేపనిగా వాడటం వంటి కారణాల వల్ల అవి విషపూరితంగా మారుతాయని గుర్తించారు. చిన్నారులపై ఓపియాడ్ మహమ్మారి తీవ్రంగా ప్రభావం చూపుతుందని వెల్లడైంది.



కడపలో సీఎం ప్రారంభించనున్న ఆర్వోబీ

## కడప స్టీల్‌కు నేడు శంకుస్థాపన

- 3 రోజులపాటు సొంత జిల్లాలో జగన్ పర్యటన
- రూ.3650 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- 25న పులివెందులలో క్రిస్మస్ ప్రార్థనలకు హాజరు

కడప, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు పరిశ్రమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సొంత జిల్లాకు వెళ్తున్న జగన్... దాదాపు రూ.3650 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కడప జిల్లావాసుల దశాబ్దాల స్వప్నంగా ఉన్న ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్న మూడో ముఖ్యమంత్రి వైఎస్ జగన్! 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అదే ఏడాది జూన్ 10న బ్రహ్మణీ స్టీల్స్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఆ పరిశ్రమకు 10,670 ఎకరాలు కేటాయించారు. పనులు జరుగుతుండగా సీబీఐ కేసుల కారణంగా అవి అసంపూర్తిగానే నిలిచిపోయాయి. అనంతరం రాష్ట్ర విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమను చేర్చారు. ఈ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం దీనిని నిర్మించాల్సి ఉంది. అయితే కేంద్రం ముందుకు రాకపోవడంతో 2018 డిసెంబరు 27న అప్పటి సీఎం చంద్రబాబు రెండోసారి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వమే ఈ స్టీల్ పరిశ్రమను నిర్మించే విధంగా రాయలసీమ స్టీల్ అథారిటీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మైలవరం మండలంలో 3892 ఎకరాలు కేటాయించారు. రూ.33వేల కోట్లతో 25వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలన్నది నాటి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. పరిశ్రమ నిర్మాణమూ మొదలు కాలేదు. దీంతో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పించారు. ఈ క్రమంలోనే ఏపీ హైగ్రేడ్ స్టీల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు గ్రామాల మధ్య, బ్రహ్మణీ స్టీల్ పరిశ్రమను ఆనుకుని నిర్మించబోయే ఈ ఫ్యాక్టరీకి మూడో ముఖ్యమంత్రిగా జగన్ పునాది రాయి వేయనున్నారు. ఆ రెండు గ్రామాల మధ్య 3148 ఎకరాలు కేటాయించారు. ఏడాదికి మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టే ఈ పరిశ్రమకు కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ముడి ఇనుమును సరఫరా చేసేందుకు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) ఇటీవల ఏపీ హైగ్రేడ్ స్టీల్ కార్పొరేషన్ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంది. ఈ పరిశ్రమకు శంకుస్థాపనతోపాటు కడప, రాయచోటి, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల్లో దాదాపు రూ.3650 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టులకు జగన్ శంకుస్థాపన చేయనున్నారు. ఒక్క పులివెందులలోనే రూ.931 కోట్లతో చేపట్టే పనులకు శ్రీకారం చుడతారు. కడపలో నిర్మించిన ఆర్వోబీని ప్రారంభించడంతోపాటు రిమ్స్‌లో రూ.110 కోట్లతో వైఎస్ఆర్ కేన్సర్ కేర్ యూనిట్ నిర్మాణం, పులివెందులలో రూ.347 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణాలకు భూమి పూజ చేస్తారు. 24వ తేదీ ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్‌ను సందర్శించి అనంతరం చర్చిలో జరిగే ప్రార్థనలు, 25న పులివెందులలో సీఎస్ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకలు, ప్రార్థనల్లో సీఎం జగన్, కుటుంబ సభ్యులు పాల్గొంటారని జిల్లా అధికారులు పేర్కొన్నారు.

## సీఎం జిల్లాకు నిధుల వరద

- కడప, పులివెందులకు భారీగా..
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ సహా చిన్నాచితకా బిల్లులూ విడుదల
- కోట్ల కొద్దీ పనుల మంజూరు
- వారంలోపు 30 వరకు జీవోలు
- రూ.1,500 కోట్ల కేటాయింపులు
- రాష్ట్రమంతటా బిల్లులు బంద్
- జగన్ జిల్లాకు నిధుల వెల్లువ
- అధికారుల స్వామిభక్తి

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవ లేదన్నది సామెత. సాక్షాత్తు ముఖ్యమంత్రి తలచుకుంటే నిధుల కేటాయింపులకు కొరత ఏముంటుంది..? ఉద్యోగులు నెలనెలా జీతాల కోసం వెతలు పడుతున్నా.. పేదల ఆరోగ్యం కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల్లో కోత పెడుతున్నా.. గ్రామ సచివాలయ ఉద్యోగుల జీతాల రెండు నెలలు ఆపేసినా.. నిధుల కొరత కారణంగానేనని చెబుతున్న అధికార యంత్రాంగం.. ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా, సొంత నియోజకవర్గంపై నిధుల వర్షం కురిపిస్తున్నారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, ఉపాధి హామీ పథకం కింద చేసిన చిన్న చిన్న పనుల బిల్లులను పోటీపడి మరీ విడుదల చేస్తున్నారు. వారంలోపు పులివెందుల, కడపలకు సుమారు రూ.1,500 కోట్లు కేటాయించి అధికారులు స్వామిభక్తి చాటుకున్నారు. అందుకోసం సుమారు 30 ఉత్తర్వులు జారీచేశారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఇరిగేషన్ శాఖలకు సంబంధించి గంపగుత్తగా పనులను మంజూరుచేశారు. అవినీతి, అక్రమాల సాకుతో ఇవే పద్దుల కింద రాష్ట్రవ్యాప్తంగా నిధుల విడుదలను ఆపేయడంతో ప్రజలు, పనులు చేసిన వారు ఇప్పటికే హాహాకారాలు చేస్తున్నారు. పులివెందుల, పంచాయతీరాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గమైన పుంగనూరు, ఆయన సోదరుడు ద్వారకానాథరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తంబళ్లపల్లెకు మాత్రమే నిధులు విడుదల చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సీఎం సొంత జిల్లా కడపకు చేతికి ఎముక లేకుండా నిధులు కేటాయించడం గమనార్హం.

### ఎన్నెన్నో పనులు, నిధులు..

కడప మెడికల్ కళాశాలలో రూ.125 కోట్లతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీచేశారు. కడపలో మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు రూ.40 కోట్లు, అక్కడే ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి మంజూరు, పులివెందులలోని డాక్టర్ వైఎస్ఆర్ మెడికల్ కళాశాలలోని ఏరియా ఆస్పత్రిని 300 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.347 కోట్లు మంజూరుచేశారు. కడపలో వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్‌ను 100 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ఆదేశాలిచ్చారు. హోంశాఖ ఆధ్వర్యంలో రూ.20.95 కోట్లతో ఐదు భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. కడప పట్టణంలోని గూడూరులో మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా ప్రీమెట్రిక్ అండ్ పోస్టు మెట్రిక్ బాలుర కోసం హాస్టల్ భవనాల ఏర్పాటుకు రూ.5.20 కోట్లు మంజూరుచేశారు. కడప కార్పొరేషన్ పరిధిలోని బ్యూటిఫికేషన్ కింద రూ.55 కోట్లతో పనులు చేసేందుకు పరిపాలనా ఆమోదం లభించింది. కడపలో రాజీవ్ మార్గ్ రోడ్డును రూ.3.85 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ఉత్తర్వులు జారీచేశారు. వాటితో పాటు తాగునీటి కోసం ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ నిధులను కడప, కర్నూలుకు కలిపి రూ.13.15 కోట్లు కేటాయించారు. పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లిలో భూగర్భ డ్రైనేజీ పనులకు రూ.63 కోట్ల నిధులను సీఎండీఎఫ్ కింద మంజూరుచేశారు. వేంపల్లిలో ఉర్దూ మీడియంలో కొత్త జూనియర్ కళాశాల ఏర్పాటు, పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద మూడు పనులను మంజూరుచేశారు. పులివెందుల మండలంలో జలవనరుల శాఖకు సంబంధించి రూ.1.82 కోట్లతో 19 పనులను, మరో రూ.1.46 కోట్లతో మరో 11 పనులను వేరు వేరు ఉత్తర్వుల ద్వారా మంజూరుచేశారు. వెలిగల్లు రిజర్వాయర్ నుంచి గాలివీడు మండలానికి 0.4 టీఎంసీల తాగునీరు సరఫరాకు ఎల్1 పథకం, జెర్రికొండ రిజర్వాయర్ నుంచి పెద్ద చెరువుతో పాటు సంబేపల్లి మండలంలోని చెరువుముందరిపల్లి లిఫ్ట్ ద్వారా నీరు సరఫరా చేసేందుకు అనుమతించారు. గాలివీడు మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతులకు పనులు మంజూరుచేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి సున్నపురాళ్లపల్లి స్టీల్‌ప్లాంట్‌కు 2 టీఎంసీలు నీటి సరఫరా కోసం ఆదేశాలిచ్చారు. పులివెందులలో రూ.17.50 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆదేశాలిచ్చారు. వాటితో పాటు పశుసంవర్ధకశాఖ ద్వారా పులివెందుల మండలం వెంకటంపల్లిలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన వర్సిటీ కింద అరటి పరిశోధనా కేంద్రం కోసం 70 ఎకరాల భూమిని కేటాయించారు. పులివెందుల జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రూ.10 కోట్లతో భవనాల నిర్మాణాలు, పులివెందుల మున్సిపాలిటీలో నీటి సరఫరా మౌలికవసతుల పనులు, రూ.100 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు మున్సిపల్ ప్రత్యేక నిధులతో చేపట్టనున్నారు. 2019-20లో పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ ఏజెన్సీకు రూ.29 కోట్లు కేటాయించారు. ఇదే ఏజెన్సీ కింద పులివెందులలో జూనియర్ కళాశాలలో అదనపు వసతుల కోసం పనులు మంజూరుచేశారు. రూ.1,500 కోట్ల మేర పనులు వారం రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన మంజూరయ్యాయంటే.. ముఖ్యమంత్రా.. మజాకా..! రాష్ట్రంలో గత ప్రభుత్వం మంజూరుచేసిన పనులన్నీ రద్దు చేసిన సీఎం.. తన నియోజకవర్గం, సొంత జిల్లాకు ఒకేసారి భారీగా కుమ్మరించారని అధికార వర్గాలు చర్చించుకుంటున్నాయి.

**అయ్యన్నపై పోలీసు కేసుతో**

## టీడీపీలో కలకలం

- అరెస్టు చేస్తారని ఊహాగానాలు



విశాఖపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిపై నర్సీపట్నం పోలీసులు కేసు నమోదు చేయడం టీడీపీ వర్గాల్లో కలకలం రేపింది. ఆయన ప్రస్తుతం సొంత పని మీద కుటుంబంతో వేరే ప్రాంతానికి వెళ్లారు. ఆయన లేని సమయంలో కేసు నమోదు చేయడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది. పైగా ఆయన్ను అరెస్టు చేస్తారంటూ శనివారం రాత్రి నుంచి జోరుగా ప్రచారం జరుగుతోంది. నర్సీపట్నంలో అయ్యన్నపాత్రుడు, అతని సోదరుడు సన్యాసిపాత్రుడు ఒకే భవనంలో నివాసం ఉంటున్నారు. సన్యాసిపాత్రుడు ఇటీవల వైసీపీలో చేరడంతో ఇరు కుటుంబాల మధ్య దూరం పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీన సన్యాసిపాత్రుడు తాను ఉంటున్న భవనంపై వైసీపీ జెండా కట్టడంతో వివాదం ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లారు. అనుమతి లేకుండా పోలీసులు ఎలా వస్తారంటూ అయ్యన్న నిలదీశారు. అయితే అయ్యన్నపాత్రుడు తమ విధులకు ఆటంకం కలిగించారని, తమను దూషించారని నర్సీపట్నం పోలీసులు కేసు నమోదుచేశారు. తొలుత దర్యాప్తు చేసి నివేదిక రూపొందించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. ఒకవేళ అరెస్టు చేస్తే ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. పోలీసువర్గాల సమాచారం మేరకు ప్రస్తుతానికి అయ్యన్నపాత్రుడిని అరెస్టు చేయడం లేదని, దర్యాప్తు అనంతరం నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. అయ్యన్నపై కేసు నమోదు అయినట్టు తెలియడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం అయ్యన్న ఇంటికి వెళ్లి, ఆయన కుమారుడు విజయ్‌తో సమావేశమయ్యారు.

**జాతీయ కవితా**

## సార్వభౌముడు గరిమెళ్ల

- 'మాకొద్దీ తెల్లదొరతనం' పాటతో స్వాతంత్ర్య స్ఫూర్తి
- సాహితీవేత్త, పరిశోధకుడు కె.ముత్యం వెల్లడి

పాతశ్రీకాకుళం, డిసెంబరు 22: స్వాతంత్ర్య పోరాటంలో తన గీతాల తూటాలతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన గరిమెళ్ల సత్యనారాయణ ఎందరికో స్ఫూర్తి ప్రదాత అని హైదరాబాద్‌కు చెందిన సాహితీవేత్త, పరిశోధకుడు కె.ముత్యం అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో గరిమెళ్ల సత్యనారాయణ సంస్మరణోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి కె.ముత్యం మాట్లాడుతూ.. 'మాకొద్దీ తెల్లదొరతనం' పాటతో గరిమెళ్ల.. అందరిలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించారన్నారు. ఆయన జాతీయ కవితా సార్వభౌముడని, స్వాతంత్ర్య పోరాటంలో అక్షరాలనే ఆయుధాలుగా మార్చి ప్రజల్లో చైతన్యం నింపారని చెప్పారు. నల్లగొండకు చెందిన రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ జాతీయోద్యమంలో గరిమెళ్ల తన విప్లవ పాటలతోనే ఆంగ్లేయుల పాలనను ఎద్దేవా చేశారని, జానపద కవిగా స్ఫూర్తిని కలిగించారన్నారు. అనంతరం 'నాటి స్వాతంత్ర్య పోరాటం- నేటి సామాజిక స్థితిగతులు'పై రూపొందించిన కవితా సంకలనాన్ని ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహితీ అకాడమీ సభ్యులు అట్టాడ అప్పలనాయుడు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు నీలం సాహ్నికి అందిస్తున్న ఈవో లీలాకుమార్

## సుబ్బారాయుడి సేవలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

మోపిదేవి/అవనిగడ్డ టౌన్, డిసెంబరు 22: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని కృష్ణాజిల్లా మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించుకున్నారు.ఈవో లీలాకుమార్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సీఎస్‌కు అందించారు. ఆ తర్వాత ఆమె కృష్ణా సాగర సంగమ ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం సముద్రతీరంలో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన చిత్రాలను పరిశీలించారు. హంసలదీవిలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారిని ఆమె దర్శించుకున్నారు.

## జనాభా రిజిస్టర్లను నిలిపివేయాలి

▸▸ ఎన్‌ఆర్‌సీపై వ్యతిరేకతతో సీఎంకు సీపీఎం లేఖ

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జనాభా రిజిస్టరు నిర్వహణ ప్రక్రియను ఆంధ్రాలోనూ చేపట్టేది లేదని కేంద్రానికి స్పష్టం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలోనూ ఎన్‌ఆర్‌సీపై మైనార్టీల్లో వ్యక్తమవుతున్న భయాందోళనలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎన్‌ఆర్‌సీ ప్రక్రియను, దానిలోని భాగమైన జనాభా రిజిస్టరు ప్రక్రియను చేపట్టేదిలేదని ప్రకటించాలని మధు కోరారు.

## అక్రెడిటేషన్ సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

కదిరి అర్బన్, డిసెంబరు 22: అక్రెడిటేషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రెస్ అకాడమీ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారులు జోక్యం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు డిమాండు చేశారు. అనంతపురం జిల్లా కదిరిలో ఆదివారం జరిగిన యూనియన్ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. సమాచారశాఖ తాజా నిబంధనలతో అత్యధిక జర్నలిస్టులు అక్రెడిటేషన్లు పొందే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఆన్‌లైన్ విధానం కఠినతరంగా ఉండడం, తక్కువ గడువు, సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడం, విద్యార్హతలకు సంబంధించిన నిబంధనలు, చిన్నపత్రికలకు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిటర్నుల దాఖలు వంటి నిబంధనలు తొలిసారిగా ప్రవేశపెట్టారన్నారు. దీనివల్ల సగానికిపైగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు లభించే అవకాశం ఉండదన్నారు. దీనిపై ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులైన జర్నలిస్టు ప్రతినిధులు సజ్జల రామకృష్ణారెడ్డి, కె.రామచంద్రమూర్తి, దేవులపల్లి అమర్, జీవీడీ కృష్ణమోహన్‌లాంటి వారు జోక్యం చేసుకోవాల్సి ఉందన్నారు. అవసరమైతే సీఎంను కలిసి పరిస్థితి వివరించి, కొన్ని నిబంధనలు సడలించి జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు అందేవిధంగా చూడాలని కోరారు.

# మీరే కట్టుకోండి!

కొత్త వైద్య కాలేజీలపై కేంద్రం.. డీఎంఈకి ముందస్తు సమాచారం

▸▸ ఒక్క కాలేజీకీ నిధులివ్వలేమని వెల్లడి

▸▸ మూడు కాలేజీల ప్రతిపాదనలు వెనక్కి

▸▸ రాష్ట్రంపైనే రూ.1020 కోట్ల భారం

▸▸ పరిశీలించండి ప్లీజ్: ఆరోగ్యశాఖ మరో విన్నపం

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్త మెడికల్ కాలేజీల విషయంలో రాష్ట్రానికి కేంద్రం షాకిచ్చింది! ఏపీకి కొత్తగా మెడికల్ కాలేజీలు కేటాయించబోమని, అవసరమనుకుంటే మీరే కట్టుకోండని స్పష్టం చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోనూ జిల్లాకు ఒక కొత్త మెడికల్ కాలేజీని కేటాయించేందుకు సిద్ధమైంది. రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు కోరింది. దీంతో రాష్ట్రాలు తమ అవసరాలు తెలుపుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించిన కేంద్రం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే కొత్త కాలేజీలను కేటాయించింది. ఏపీకి మాత్రం ఒక్క కాలేజీ కూడా ఇవ్వలేదు. అయితే, దీనికి కారణాలను పేర్కొంది. ఏపీలోని 13 జిల్లాల్లో ఇప్పటికే మెడికల్ కాలేజీలున్నాయని, విజయనగరం, పశ్చిమగోదావరి మినహా అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయని తెలిపింది. ఆ రెండు జిల్లాల్లో కూడా ప్రైవేటు కాలేజీలు నడుస్తున్నాయని, ఈ లెక్కన రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాలేజీలు ఉన్నట్లేనని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఏపీకి కొత్త మెడికల్ కాలేజీ కేటాయింపు దాదాపు లేనట్లేనని రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులకు కేంద్రం నుంచి సమాచారం అందింది.

### రూ.1020 కోట్లకు ప్రతిపాదనలు

కొత్త మెడికల్ కాలేజీలకు ప్రతిపాదనలు పంపించాలని కేంద్రం కోరగానే, డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) అధికారులు సీఎం సూచనల మేరకు మూడు కాలేజీలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించారు. వీటిలో విజయనగరం, పాడేరు, ఏలూరు మెడికల్ కాలేజీల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరారు. ఒక్కొక్క కాలేజీకి రూ.340 కోట్లు చొప్పున, మూడు కాలేజీలకి కలిపి రూ.1020 కోట్లు కేటాయించాలని విన్నవించారు. ఇప్పటికే సీఎం జగన్ ఏలూరు మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మిగిలిన రెండు కాలేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు సిద్ధం అవుతున్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవచ్చునన్న ఉద్దేశంతో ప్రభుత్వం శంకుస్థాపనలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఇచ్చిన సమాచారంతో డీఎంఈ అధికారులు హతాశులయ్యారు.

### మరోసారి.. ప్లీజ్!

కొత్త మెడికల్ కాలేజీలు కేటాయించాలని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలు కేంద్రం ఇప్పటికే పరిశీలించింది. దీనిపై రాష్ట్రాల నుంచి పూర్తిస్థాయి సమాచారం తీసుకునేందుకు జనవరి 2న ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తున్నారు. దీనికి రాష్ట్రం తరపున ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. ఏపీ నుంచి పంపించిన ప్రతిపాదనలు మరోసారి పరిశీలించాలని ఆయన విన్నవించనున్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన కొత్త కాలేజీలకు అనుమతివ్వాలని కోరనున్నారు. తమిళనాడులో 25 జిల్లాలు ఉన్నప్పటికీ, జిల్లాకు కేవలం 20 లక్షల మంది జనాభా మాత్రమే ఉన్నారు. ఏపీలో 13 జిల్లాలే ఉన్నప్పటికీ, జిల్లాకు 40 లక్షల మంది జనాభా ఉన్నారు. కాబట్టి జనాభా ప్రాతిపదికన ఏపీకి కొత్త మెడికల్ కాలేజీలు కేటాయించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

### ప్రభుత్వంపైనే 2450 కోట్ల భారం

కేంద్రం ఇచ్చే నిధులతో మూడు కాలేజీలు నిర్మించాలని ప్రభుత్వం భావించింది. కానీ ప్రస్తుతం కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఆ నిధులపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. ఈ మూడు కాలేజీలతో పాటు పులివెందుల, మచిలీపట్నం, గురజాల, మార్కాపురంలో కూడా కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏడు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. వీటి కోసం విడతల వారీగా కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవాలని అధికారులు భావించారు. కానీ కేంద్రం షాక్ ఇచ్చింది. దీంతో ఈ కాలేజీల నిర్మాణానికి నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ప్రతి కాలేజీకి సుమారు రూ.350 కోట్లు చొప్పున 7 కాలేజీలకు రూ.2,450 కోట్లు అవసరం అవుతాయి. ఇంత మొత్తంలో మెడికల్ కాలేజీల కోసం నిధులు కేటాయించే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదు.



రావులపాలెంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

## ప్రాంతాల అభివృద్ధికే మూడు రాజధానులు

▸▸ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

రావులపాలెం రూరల్, డిసెంబరు 22: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకే మూడు రాజధానుల ప్రతిపాదనలు ముఖ్యమంత్రి ప్రకటించినట్టు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తూర్పుగోదావరిజిల్లా రావులపాలెంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన అనంతరం నష్టపోయిన రాష్ట్రాన్ని పూర్తి స్థాయిలో సమగ్రాభివృద్ధి చేసేందుకు అమరావతి, కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాలలో రాజధానులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతిలో రాజధాని ఏర్పాటు చేసినప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని, వేల కోట్లు టీడీపీ పెద్ద జేబుల్లోకి వెళ్లాయని ఆయన ఆరోపించారు. జగన్ పాదయాత్ర సమయంలో గుర్తించిన సమస్యలను ఆరు నెలల పాలనలోనే 80 శాతం పరిష్కరించారన్నారు. అనంతరంమూడు రాజధానుల నిర్ణయానికి మద్దతుగా చేపట్టిన ర్యాలీలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య

అనంతసాగరం/జుజ్జూరు (వీరులపాడు), డిసెంబరు 22: చేసిన అప్పులు తీర్చలేక, రుణదాతల ఒత్తిడి భరించలేక రాష్ట్రంలో ఇద్దరు రైతులు బలవనర్మరణానికి పాల్పడ్డారు. నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం బి.అగ్రహారానికి చెందిన కాసా యల్లారెడ్డికి రెండెకరాల పొలం ఉంది. గడిచిన నాలుగేళ్లలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పొలంలోని బోర్లు వట్టిపోయాయి. ఈ క్రమంలో జీవనోపాధి కోసం యల్లారెడ్డి ఏడాది క్రితం సంసారాన్ని మర్రిపాడుకు మార్చాడు. ఇక్కడ రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి సాగుచేశాడు. ఇక్కడా నష్టాలు రావడంతో చేసిన అప్పులు గుదిబండగా మారాయి. రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో శనివారం అగ్రహారానికి వచ్చిన యల్లారెడ్డి ఆదివారం తెల్లవారుజామున పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మకూరు డీఎస్పీ మక్బూల్, సీఐ పాపారావు, అనంతసాగరం ఎస్ఐ ప్రభాకర్ మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. కృష్ణాజిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన చంద్రాల విజయ్ (45) మూడేళ్లుగా జగన్నాథపురం, జుజ్జూరు శివారుల్లో సుమారు ఏడెకరాల మేర భూమి కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాడు. సాగుకు రూ.4 లక్షల మేర అప్పులు చేశాడు. రెండేళ్ల నుంచి నష్టాలు రావటంతో పాటు ఈ ఏడాది కూడా అప్పులు తీరే అవకాశం లేకపోవటంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

# జగనన్నా.. ఇది తగునా?

▸▸ అన్నలా ఆదరిస్తే.. అమ్మలాంటి ఆర్టీపీపీని అమ్మేస్తావా?!

▸▸ కుటుంబ సమేతంగా ఆర్టీపీపీ ఉద్యోగుల నిరసన ర్యాలీ

▸▸ నేడు ప్రకటన చేయకపోతే.. చలో అమరావతి



ఆర్టీపీపీ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన ఉద్యోగ, కార్మిక కుటుంబాలు

ఎర్రగుంట్ల, డిసెంబరు 22: జిల్లా వాడివని అన్నలా ఆదరిస్తే... మాకు అన్నం పెట్టే అమ్మలాంటి ఆర్టీపీపీని అమ్మేస్తావా అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై కడప జిల్లా ఆర్టీపీపీలో మహిళాలోకం నిప్పులు చెరిగింది. కేవలం వందల రూపాయల జీతానికి పనిచేశాం. ఆర్టీపీపీని నమ్ముకుని జీవిస్తున్నాం. మా పిల్లల భవిష్యత్తు ఏం కావాలంటూ నినదించారు. ఆర్టీపీపీని ఎన్‌టీపీసీకి అమ్మేస్తారన్న ప్రకటనల నేపథ్యంలో.. ఉద్యోగ కార్మికుల కుటుంబాలు ఆదివారం సాయంత్రం ఓసీసీ క్రీడా మైదానం నుంచి ఫౌంటేన్, కాలనీ గేట్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్టీపీపీలో చీకటిని నింపి.. కొత్తగా ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారా అంటూ మహిళలు తీవ్ర స్వరంతో జగన్‌పై ఆక్రోశం వెళ్లగక్కారు. నేడు జమ్మలమడుగు సభలో ఆర్టీపీపీ భవిష్యత్తుపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయకపోతే.. ఆర్టీపీపీ నుంచి అమరావతికి వస్తామని హెచ్చరించారు. ఆర్టీపీపీకి బొగ్గు ధరను బూచిగా చూపించి ఉద్యోగులను రోడ్డున పడేస్తారా అని జేఏసీ నాయకులు ప్రశ్నించారు. కేవలం ఐఏఎస్‌లు చెప్పిన మాట రాజకీయ నాయకులు, నాయకులు చెప్పిన మాట ఐఏఎస్‌లు విన్నారని, చేసిందంతా వారేనని ధ్వజమెత్తారు. నష్టాలకు బాధ్యత వారిదేనని వారు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉద్యోగుల భవిష్యత్తుపై స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు తమ ఆందోళన ఆగదని హెచ్చరించారు. జమ్మలమడుగు సభలో గత ముఖ్యమంత్రి చంద్రబాబుతో.. ఆర్టీపీపీని ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టమైన ప్రకటన చేయించామని, అలాగే నేటి సీఎం జగన్‌తో అదే జమ్మలమడుగు సభలో ఇక్కడి ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, జేఏసీ, ఉద్యోగ కార్మికులు కలిసి స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

**VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)**

**INVITATION FOR REQUEST FOR PROPOSAL (RFP)**

Rc.CE-PMU-140708/2019-08 Dt.21-12-2019

VMC invites Request for Proposal for "Appointment of 3rd Party Quality Control Agency for all Engineering works in Vijayawada Municipal Corporation".

Interested agencies/companies who are having experience in the similar nature of work including financial capability, having latest technical competency to perform this assignment can obtain the details and the Request For Proposal (RFP) documents from the office of the Chief Engineer, VMC, Vijayawada by paying Rs.20,000/- (Rupees Twenty Thousand only) Non-refundable in the form of D.D. drawn in favour of the Commissioner, Municipal Corporation, Vijayawada payable at any Nationalized Bank in Vijayawada and Rs.3600/- in favour of Commercial Tax Officer Vijayawada. The RFP can also be downloaded from the VMC web site i.e., https://www.ourvmc.org/engg/gentenders.asp and payment of Rs. 20,000/- can be made through DD while submission of RFP.

- Available / Issue of Tender Schedules .. 23.12.2019 at 3.00 P.M
- Last date for Receipt of Bids .. 06.01.2020 at 3.00 P.M
- Opening of Technical Bids .. 06.01.2020 at 5.00 P.M
- Opening of Financial Bids .. After Technical Bid Evaluation.

If the office happens to be closed on the date of receipt of the bids as specified, the bids will be received and opened on the next working day at the same time and venue.

Commissioner, VMC reserves the right to reject or cancel any or all the bids without assigning any reason thereof.

Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No spare press notification shall be issued.

**Address for Correspondence:**
Chief Engineer, Municipal Corporation, Jawaharlal Nehru Buildings, Canal Road, Vijayawada-520 001, Andhra Pradesh. Phone No.0866-2422400 / 2421001, Cell No.: 9866897639, 9866514141.

Sd/- COMMISSIONER



అప్పన్న సన్నిధిలో

కప్పస్తంభం వద్ద జస్టిస్ రామసుబ్రమణియన్, పక్కన జస్టిస్ ఏవీ శేషసాయి

## సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు

సింహాచలం, డిసెంబరు 22: సింహగిరిపై కొలువుదీరిన వరాహ లక్ష్మీ నృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారులు పులి రామారావు, తులారాముడు స్వాగతం పలికారు. న్యాయమూర్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హిందూ ధర్మాన్ని అమ్మేశారు

▸▸ శారదా పీఠాన్ని జగన్ పీఠంగా మార్చడం సిగ్గుచేటు

▸▸ స్వరూపానందేంద్రపై శ్రీనివాసానంద మండిపాటు



నెల్లిమర్ల, డిసెంబరు 22: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. ఆదివారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో క్రైస్తవ మతవ్యాప్తికి, జెరూసలేం యాత్రికులకు దేవాలయాల సొమ్మును సీఎం జగన్ ఖర్చు చేస్తున్న విషయం ఆయనకు కనబడలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి అమ్ముడుపోయి శారదా పీఠాన్ని జగన్ పీఠంగా మార్చడం సిగ్గు చేటన్నారు. తిరుపతిలో అన్ని పనులు సవ్యంగా జరుగుతున్నాయని స్వరూపానందేంద్ర చెప్పడం దారుణమన్నారు. టీటీడీ వెబ్‌సైట్‌లో యేసయ్య అనే పదం కనిపించడమేంటని ప్రశ్నించారు.

## మంత్రులు అబద్ధాలు మాట్లాడుతున్నారు: వర్ల

విజయవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధానిపై అవగాహన లేకుండా రాష్ట్ర మంత్రులు అబద్ధాలు మాట్లాడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనను తాను మేధావిలాగా ఊహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం వర్ల రామయ్య విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి మండలి మొత్తం ఫ్యాక్షన్ ధోరణిలో నడుస్తోందని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో దాదాపు 4వేల ఎకరాలు టీడీపీ నాయకులు భూములు కొనుగోలు చేసినట్లు, ఆ భూముల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగినట్లు నిరూపిస్తే మంత్రికి తలవంచి నమస్కారం చేస్తానని చెప్పారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ను నిరూపించలేకపోతే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రాజధాని ప్రాంత రైతులకు, ఆయన చదివిన జాబితాలో ఉన్న నాయకులందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి ఎడారిలా ఉందంటూ స్పీకర్ మాట్లాడటాన్ని తప్పుబట్టారు.

## జన్మభూమి రుణం తీర్చుకునేందుకే వైద్య శిబిరం

▸▸ కెనడా మంత్రి శివలింగప్రసాద్

తెనాలి, డిసెంబరు 22: జన్మభూమి రుణం తీర్చుకునేందుకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు కెనడా మౌలిక వసతుల కల్పనశాఖ మంత్రి పండా శివలింగప్రసాద్ చెప్పారు. తన స్వగ్రామమైన గుంటూరు జిల్లా సంగం జాగర్లమూడిలో ఆదివారం ఇండో అమెరికన్ బసవతారకం కేన్సర్ ఇనిస్టిట్యూట్ వైద్యులతో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తన తల్లి, ఇద్దరు మేనమామలు కేన్సర్ బారిన పడటంతో తన సతీమణి శాంతిశ్రీ సూచనతో స్వగ్రామంలో కేన్సర్ పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

## సాగుదారులందరికీ ఉచిత పంటల బీమా

▸▸ 100% రాష్ట్ర ప్రభుత్వ పథకంగా అమలు

▸▸ ఉత్తర్వులు సవరించిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన శాఖలు నోటిఫై చేసిన ప్రాంతాల్లో 2019-20 రబీ సీజన్‌లో సాగుదారులందరికీ ఉచిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గతంలో జారీ చేసిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల ఉత్తర్వులను సవరించి, 100% రాష్ట్ర ప్రభుత్వ పథకంగా బీమా అమలు చేసేలా ఆదివారం తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతి ఎకరాన్ని పంటల బీమా కిందకు తెచ్చేలా ఈ ఉత్తర్వులు ఇచ్చింది. రూ.101 కోట్ల అధీకృత మూలధనంతో పూర్తిగా ప్రభుత్వ యాజమాన్యంలోని జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆదేశాలిచ్చింది. ప్రతి రైతుకు బీమా వర్తింపజేసేందుకు పంటల కోత ముందు బీమా వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. పంట నష్టాన్ని నిర్ణయించడానికి, దీనిపై అభ్యంతరాల పరిష్కారానికి ప్రస్తుతం ఉన్న విధానం (ముటాటిస్-ముటాండిస్)ను అనుసరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్లెయిమ్‌ల మొత్తాన్ని సాగుదారుల ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలకు పంపనున్నారు. కాగా ఏ ఏజెన్సీకి సాగుదారుల ప్రీమియం రాయితీని ప్రభుత్వం చెల్లించదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

▸▸ మండలి కొనసాగాల్సిందే: ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

ఉప్పలగుప్తం, డిసెంబరు 22: రాష్ట్రంలో శాసనమండలి ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా గొల్లవిల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలి రద్దుపై వస్తున్న వార్తలను ప్రస్తావించగా.. ప్రభుత్వ నిర్ణయాలపై అర్థవంతమైన చర్చల ద్వారా ప్రజా ప్రయోజనాల పరిరక్షణ మండలి బాధ్యత అన్నారు. చట్టాల రూపకల్పనలో కీలకపాత్ర నిర్వహించే పెద్దల సభను రద్దు చేసే ఆలోచన తగదన్నారు.

# ప్లంజ్ పూల్‌ను బాగుచేయాల్సిందే

▸▸ శ్రీశైలం డ్యాంకు ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదు

▸▸ సీఎం జగన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం లేఖ

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం దిగువ భాగాన ప్లంజ్ పూల్‌లో ఏర్పడ్డ గొయ్యితో ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చే ప్రమాదమేమీ లేనప్పటికీ, తక్షణమే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని సీఎం జగన్‌కు జల వనరుల శాఖ రిటైర్డ్ ఇంజనీర్లు సూచించారు. ప్లంజ్ పూల్ పరిస్థితిపై నవ్యాంధ్ర జల వనరుల శాఖ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం సమగ్ర అధ్యయనం చేసింది. తాము పరిశీలించిన అంశాలను వివరిస్తూ సంఘం అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.శివారెడ్డి తదితరులు ఈనెల 13న సీఎంకు లేఖ రాశారు. శ్రీశైలం జలాశయానికి మరమ్మతులు నిర్వహించేందుకు కేంద్ర జలసంఘం నిపుణులు, రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. జలాశయం భద్రత విషయంలో నెలకొన్న సందేహాలకు పరిష్కారం చూపేలా మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. జలాశయం దిగువ ఏర్పడిన గొయ్యిని మూసివేస్తూ ప్రమాద నివారణ కోసం శాశ్వత చర్యలు చేపట్టాలని, కేంద్ర జలసంఘం పర్యవేక్షణలో ఈ మరమ్మతు పనులు జరగాలని స్పష్టం చేసింది. జలాశయం పునాదులకు ప్రమాదం లేనప్పటికీ తాత్కాలిక మరమ్మతులు తక్షణమే చేయాల్సిన అవసరం ఉందని, ఆప్రాన్‌పై ఒత్తిడి పెరగకుండా నివారించాలని సంఘం సూచించింది. భారీరాళ్లతో గొయ్యిని మూసివేయాలని, దెబ్బతిన్న కాఫర్‌డ్యామ్‌ను కూడా తక్షణమే మరమ్మతు చేయాలని తెలిపింది. తర్వాత కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలోని 'డ్యామ్ సేఫ్టీ' విభాగం పర్యవేక్షణలో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సంఘం వెల్లడించింది.

## హర్షకుమార్ అరెస్టుపై దళిత సంఘాల మండిపాటు

కవాడిగూడ/హైదరాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దళితులు, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించి బాధితులకు అండగా ఉండటాన్ని జీర్ణించుకోలేని వైఎస్ జగన్ ప్రభుత్వం మాజీ ఎంపీ, దళిత నేత హర్షకుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం తగదని పలు దళిత సంఘాల నేతలు పేర్కొన్నారు. హర్షకుమార్ అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హర్షకుమార్‌పై కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని, లేకపోతే హైదరాబాద్‌లోని జగన్ నివాసం లోటస్‌పాంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలి

▸▸ విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటరెడ్డి

ఒంగోలు (విద్య), డిసెంబరు 22 : విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటరెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఈ సభలో వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దక్షిణ భారత స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులు ఏర్పాటు చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించనున్న దక్షిణభారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు 50 ఎగ్జిబిట్లను ఎంపిక చేశారు.

## టీడీపీ సెమీ క్రిస్మస్ వేడుకల వేదిక మార్పు

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన సెమీ క్రిస్మస్ వేడుకల వేదికను ఎన్‌హెచ్‌హైవేలోని ఆత్మకూరులో ఉన్న పార్టీ జాతీయ కార్యాలయానికి మార్పు చేసినట్టు ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మద్దిరాల జోసఫ్ ఇమ్మానియల్(మ్యానీ) ఆదివారం తెలిపారు.

## బీసీ గురుకులాల్లో ఉపాధ్యాయ నియామకాలు

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకులాల్లో పోస్టు గ్రాడ్యుయేట్, ట్రైనీ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుల నియామకానికి సంబంధించి ఆదివారం విజయవాడలో కౌన్సిలింగ్ జరిగింది. 2018 డీఎస్సీలో ఉత్తీర్ణులైన 2645 మందికి టీచర్ పోస్టులు ప్రకటిస్తూ శుక్రవారం విద్యాశాఖ ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీసీ గురుకులాల్లో 323 మందికి, ఆదర్శ పాఠశాలలకు 645 మంది, ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో 142 పోస్టుల భర్తీకి అధికారులు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కాగా, కానూరు బీసీ గురుకుల సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ ఆసాంతం అస్తవ్యస్తంగా సాగిందని అభ్యర్థులు ఆరోపించారు. నియామకపత్రాలు తీసుకున్న అభ్యర్థులు సోమవారమే విధుల్లో చేరాల్సి ఉండటం.. ధ్రువీకరణ పత్రాల పరిశీలన సాయంత్రం 7 గంటలకు కూడా పూర్తి కాకపోవడంతో తీవ్ర ఉత్కంఠకు గురయ్యారు. ఆ తర్వాత రాత్రికి రాత్రే తమ తమ ప్రాంతాలకు హడావుడిగా బయలుదేరి వెళ్లారు.

## ఏపీసీపీడీసీ చైర్మన్‌గా పద్మజనార్దన్‌రెడ్డి

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా జె.పద్మజనార్దన్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఎనర్జీ సెక్రటరీ శ్రీకాంత్ నాగులపల్లి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.



# వివిధ

సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

# "స్థలైక్యం, కాలైక్యం సాహిత్యానికి మౌలిక ధర్మాలు"

**- బండి నారాయణ స్వామి**



**సాహిత్యంలో 'స్వామి'గా వ్యవహరించబడే బండి నారాయణ స్వామి రాయలసీమ బహుజన సమూహానికి చెందిన కథకుడు, నవలాకారుడు. నడకలో నడతలో నిఖార్సైన పల్లెటూళ్లకు చెందిన 'పాతమనిషి'. ఇటీవల కాలంలో రచయిత స్థితి నుంచి కార్యకర్త గానూ మారి, తన ప్రాంతం కోసం పనిచేస్తున్న వాడు. ఇప్పుడు ఆయన 'శప్తభూమి' నవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఆయన ఆలోచనలు యెలా వున్నాయో తెలుసుకుందామని చేసిన ముఖాముఖి యిది. స్వామి నిర్మొహమాటంగా యిచ్చిన సమాధానాలు ఆయన బోళాతనానికి నిదర్శనం.**

■ **జి. వెంకటకృష్ణ**

**ఈ అవార్డు వస్తుందని మీరు అనుకున్నారా?**

కన్నడలో వచ్చిన 'చిక్కవీర రాజేంద్ర' నవలకు అవార్డు వచ్చిన విషయం నాకు తెలుసు. 'శప్తభూమి' చారిత్రక నవల రాస్తున్నపుడు సహజంగనే ఆ విషయం నాకు గుర్తుకు వచ్చింది. నిజానికి అవార్డుల పట్ల నాకు స్పృహ లేదు. 'శప్త భూమి' చదివిన పాఠకులు పదేపదే, ఈ నవలకు ఏదో ఒక అవార్డు తప్పనిసరిగా వస్తుందనేవాళ్లు. అవార్డు వచ్చినపుడు 'శప్తభూమి' రచయిత కంటే, 'శప్తభూమి' పాఠకులే ఎక్కువ ఉద్వేగానికి లోనైనారేమో అనిపిస్తుంది.

**కథకుడిగా కూడా గొప్ప కృషి చేశారు. ఇప్పుడు నవలకు బహుమతి అందుకుంటున్నారు. నిజానికి మిమ్మల్ని మీరు ఏమనుకుంటారు? మీకేది సంతృప్తినిస్తుంది?**

నా మిత్రుడు, గురువు చిలకూరి దేవపుత్ర ఒకమాట అనేవాడు-- "కథ తాడు మీద నడవడం లాంటిది, నవల.. విశాలమైన మైదానంలో అరబ్బీ గుర్రం మీద దౌడు తీయడం లాంటిది."

కథ, నవలలకు దేని శిల్పం దానికుంది. దేని లోతు, దేని విస్తృతి దానికుంది. నేను కథకుడినో, నవలాకారుడినో ఒక ప్రక్రియకు కుదించుకోలేను. కథ శిల్పపరంగా సంతృప్తినిస్తే, నవల... భావజాల ప్రకటన వల్ల ఎక్కువ సంతృప్తినిస్తుంది.

**ఈ అవార్డుల ద్వారా, నిర్లక్ష్యానికి గురైన నేలలు, ఆ నేలపుత్రులు గుర్తింపు పొందినట్లు అనుకుంటున్నారా?**

2014కు ముందు ఒక రచయిత కథకో నవలకో అవార్డు వచ్చినపుడు 'ఫలానా వ్యక్తికి వచ్చింది, లేక మా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది' అనుకునేవారు పాఠకులు. కానీ 'శప్తభూమి' నవలకు అవార్డు వచ్చినపుడు, 'ఈ అవార్డు మా రాయలసీమకు వచ్చింది' అనుకున్న పాఠకులే రాయలసీమలో ఎక్కువ. మరి ఈ ప్రాంతం, ఈ ప్రాంతపు ప్రజలు నవల ద్వారా గుర్తింపు పొందినారా లేదా అన్నది విమర్శకులు చెప్పవలసిన విషయం. కానీ నాకు తెలిసీ, అవార్డుల ద్వారా రచనకు పాఠకుల సంఖ్య పెరుగుతుంది అన్న మాట మాత్రం వాస్తవం.

**'శప్తభూమి' నవల ఎందుకు రాయాల్సి వచ్చింది?**

తెలంగాణ ఉద్యమ క్రమంలో తెలంగాణ ప్రాంతం చారిత్ర కంగా, సాంస్కృతికంగా దాదాపు పునరుజ్జీవం పొందింది. కానీ తెలంగాణ విడిపోయిన క్రమంలో రాయలసీమ అస్తిత్వం ప్రశ్నార్థకమైంది. రాయలసీమ ప్రాంత మూలాలను సామా జికంగా, రాజకీయంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా పరిచయం చేయాలనే ఉద్దేశమే ఈ నవలను రాయించింది.

**మెకంజీ కైఫీయత్‌ల ఆధారంగా, బ్రౌన్ పరిష్కరించగా, గురజాడ అప్పారావు ఎడిట్ చేసిన 'ది వార్స్ ఆఫ్ రాజాస్' పుస్తకంలోంచి 'శప్తభూమి' మూలకథను, చాలా పాత్రల్ని తీసుకున్నట్టున్నారు?**

గురజాడ ఎడిట్ చేసిన 'ద వార్స్ ఆఫ్ రాజాస్' కైఫీయత్ నుంచి మూలకథను తీసుకోలేదు. కథా వాతావరణాన్ని మాత్రమే తీసుకున్నాను. అప్పటి రాజులు, ఆస్థానాలు, కుట్రలు, యుద్ధాలు... అదీ రాచరిక వాతావరణం. ఈ రాచరిక వాతా వరణంలో అణచివేతలను అనుభవించిన దళిత బహుజనులే ఈ నవలకు మూలకథ అయినారు. ఈ నవలలో వీర మంటపం, కురవల పరస, గులిగానప్ప పరస, సతీసహ గమనం... ఈ సందర్భాలన్నీ వాస్తవమైనవి. ప్రజల పాత్రలు కాల్పనికమైనవి. సిద్దరామప్పనాయుడు, కరిహుళ బసవప్ప, బళ్లారి రామప్పనాయుడు, అనంతపురం రామప్పనాయుడు, సిద్దప్పనాయుడు... ఇటువంటి రాచరిక పాత్రలు మాత్రం కైఫీయత్ నుంచి తీసుకున్నాను. బిల్లే ఎల్లప్ప, కోడె నీలడు, ఇమ్మడమ్మ, హరియక్క, నాగప్ప ప్రెగడ, నిడుమామిడి స్వామి, వీరనారాయణ రెడ్డి, కంబళి శరభడు, నల్ల నాగిరెడ్డి, ఎర్ర నాగిరెడ్డి, బయన్నగారి అనంతయ్య శ్రేష్ఠి, కోమటి పడుచు, పద్మసాని, నాగసాని, తిక్కస్వామి, గొల్లపడుచు, మన్నారు దాసు... ఈ పాత్రలన్నీ కల్పితపాత్రలు. కానీ, చరిత్రలో జరిగిన వాస్తవ సంఘటనలకు ప్రాతినిధ్యం వహించే పాత్రలు. మంగలి గైరమ్మ, విలియం బ్రౌను, మాడల కందప్ప, జక్కుల ఉమాదేవి... వీరంతా చరిత్రలో జీవించిన నిజమైన పాత్రలు.

**ఈ నవలలో ఊహకు వాస్తవాన్ని జోడించడంలో మీ కృషి ఏమిటి?**

ఊహకు వాస్తవాన్ని జోడించడం కాదు. ఒక చారిత్రక వాస్త వాన్ని పాత్రలుగా ఊహించి రాసిన నవల ఇది. ఇంతవరకు నేను చేసిన రచనాక్రమం ఒకటైతే, 'శప్తభూమి' రచనాక్రమం ఇంకొకటి. ఇదివరకు నేను రాసిన, చిత్రించిన పాత్రలకు సమా జంలో మోడల్స్ ఉన్నారు. కానీ ఈ నవలలోని చారిత్రక పాత్ర లకు మోడల్స్ లేరు. కేవలం రికార్డ్ అయిన చారిత్రక సంద ర్భాలు మాత్రమే ఉన్నాయి. సామాజిక మోడల్స్ లేకుండా ఒక పాత్రను సృష్టించడం ఎక్కువ మేధోశ్రమతో కూడుకున్నది. ఈ నవలలో ఈ స్థితిని అనుభవించవలసివచ్చింది. ఉదాహ రణకు కంబళి శరభుడి పాత్ర. కంబళి శరభడు 18వ శతాబ్దం లోని దళిత వాస్తవికత. ఇది చారిత్రక వాస్తవికత. ఈ చారిత్రక వాస్తవికతను ఒక పాత్రగా ఊహించడమే కంబళి శరభడు.

**నవల చదువుతుంటే మీరు మాట్లాడుతున్నట్లు అని పిస్తుంది. ఈ మాండలిక గొంతుకను ఎలా సాధించారు?**

సమాజంలో రెండు రకాల మనుషులున్నారు. ఒకరు, భాష ద్వారా ఆధిపత్యం చెలాయించాలని అనుకుంటారు. మరొకరు, ప్రజల భాషనే మాట్లాడి, ప్రజలతో కలసిపోవాలని అనుకుంటారు. నేను పల్లెల్లో పనిచేసినాను. పల్లెటూరి ప్రజలతో కలిసి తిన్నాను, తిరిగినాను. వారి భాషే మాట్లాడినాను. నా చదువును, ఉద్యోగాన్ని, పట్టణ భాషను పక్కకు నెట్టి, వారితో పంచుకునే ప్రయత్నం చేసినాను. ఈ క్రమంలో వారి గొంతే నా గొంతుగా మారింది. నా కథకుడి గొంతులో ప్రజల సామూహికతను అనుభవించగలిగినాను.



**తెలంగాణ ఉద్యమక్రమంలో తెలంగాణ ప్రాంతం చారిత్రకంగా, సాంస్కృతికంగా దాదాపు పునరుజ్జీవం పొందింది. కానీ తెలంగాణ విడిపోయిన క్రమంలో రాయలసీమ అస్తిత్వం ప్రశ్నార్థక మైంది. రాయలసీమ ప్రాంత మూలాలను సామాజికంగా, రాజకీయంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా పరిచయం చేయాలనే ఉద్దేశమే ఈ 'శప్తభూమి' నవలను రాయించింది.**

**'మీరాజ్యం మీరేలండి' నవలలో 'పండమేరు' అనే ఏటి చుట్టూ మార్మికంగా కథ నడుస్తుంది. 'శప్తభూమి' నవలలో కూడా స్థానిక చరిత్రలో నుంచి కథను రాబట్టు కున్నారు. వీటి వెనుక ఏమైనా వ్యూహం ఉందా?**

దాన్ని వ్యూహం అనడం కంటే, సాహిత్యంలో మౌలికమైన అంశం అనవచ్చు. 'కలాన్ని జీవితంలో అద్ది రాయాలి' అంటాడు చలం. ఏ భాషా సాహిత్యాన్ని అయినా ఈ వాక్యం నిర్వచిస్తుంది అనుకుంటాను. జీవితం అంటే ఏమిటి? జీవితం అంటే భాష. జీవితం అంటే కులం. జీవితం అంటే వర్గం. జీవితం అంటే జెండర్. జీవితం అంటే ప్రాంతం.

ఇవన్నీ భాగమైన జీవితంలోకి కలం అద్ది రాయడమేకదా సాహిత్యం! ఇక్కడే, నేను సృష్టించిన సాహిత్యానికి, ప్రాంతానికి మధ్య అనివార్యమైన సంబంధం ఏర్పడింది. ఈ సంబంధమే పండమేరు అయి, బుక్కరాయ సముద్రం చెరువు అయి, పాత ఊరు అయి, కల్యాణదుర్గం, రాయదుర్గం వంటి వివిధ ఊళ్లయి, నా రచనల్లో ప్రతిఫలించాయి. ఏ సాహిత్యంలోనైనా, కథ, నవల, ఒక నిర్దిష్ట ప్రాంతానికి, స్థానికతకు దూరంగా ఉండడానికి అవకాశమే లేదు. దీనినే సాహిత్యంలో 'స్థలైక్యం' అంటారు. స్థలైక్యం, కాలైక్యం సాహిత్యానికి మౌలిక ధర్మాలు.

**ఇదే అకాడమీ అవార్డుకై మీరు నిర్ణయించాల్సివస్తే ఎవరిని ఎంపిక చేసేవారు?**

నవలకు రాసాని రాసిన 'ముద్ర'. కవిత్వానికి విజయ భాస్కర్ రాసిన 'మహాశూన్యం', పాటకు గోరటి వెంకన్న, కథకు నామిని, ఆత్మకథకు సడ్లపల్లి చిదంబర రెడ్డి రాసిన 'బతుకు వెతుకులాట'.

**రాయలసీమ ఉద్యమానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. మీరు ఈ అవార్డు అందు కోవడాన్ని మీ మిత్రులు అంగీకరిస్తారా?**

పదిహేనేళ్ల క్రితమైతే ప్రభుత్వ అవార్డులు స్వీకరించేవాడిని కాదు. అప్పట్లో వామపక్ష భావజాలం బలంగా ఉండేది. శ్రీశ్రీ సాహిత్య అకాడమీ అవార్డును స్వీకరించడానికి సిద్ధ పడటమూ, ఆయనను ఆ ఆకాంక్ష నుంచి మళ్లించడమూ... ఈ వృత్తాంతాన్ని చాలా నవ్వుటాలుగా చెప్పుకునేవాళ్లం. చెప్పొ చ్చేదేమిటంటే, ప్రభుత్వ అవార్డులు స్వీకరిం చడానికి అప్పట్లో మేం పచ్చి వ్యతిరేకం. కానీ, వామపక్ష భావజాలం నుండీ దళిత బహుజన కాన్సెప్ట్‌లోకి ప్రయాణించిన తర్వాత, ఈ రచయితలో మార్పు వచ్చింది. దూరంగా కనిపించే ఉన్నత లక్ష్యం (కమ్యూనిజం) కంటే, తక్షణ సమస్య అయిన బహుజనవాదం కోసం పనిచేయాల్సిన అవసరం కనిపించింది. ఈ క్రమంలో ఉన్న వ్యవస్థలోనే సమస్యలకోసం పోరాడటం, కొన్ని పరిష్కారాలు సాధించటం, కొన్ని విజయాలు సాధించటం కూడా అవసరమనే తత్వం బోధపడింది. 'ప్రభుత్వం ఇచ్చే అవార్డులు ప్రజల సొమ్మే!' అంటాడు కొడవటిగంటి కుటుంబ రావు గారు ఒకచోట.

విషయం ఏమంటే, తాను ప్రేమించే రాయలసీమను చారిత్రకంగా, సాంస్కృతికంగా, ఇతర ప్రాంతాలవారికి, ఇతర రాష్ట్రాలవారికి తెలియజేసే అవకాశాన్ని ఈ అవార్డు ఇస్తూవుందని ఈ రచయిత నమ్ముతున్నాడు.



**పదిహేనేళ్ల క్రితమైతే ప్రభుత్వ అవార్డులు స్వీకరించే వాడిని కాదు. కానీ, వామపక్ష భావజాలం నుండీ దళితబహుజన కాన్సెప్ట్‌లోకి ప్రయాణించిన తర్వాత, ఈ రచయితలో మార్పు వచ్చింది. దూరంగా కనిపించే ఉన్నత లక్ష్యం (కమ్యూనిజం) కంటే, తక్షణ సమస్య అయిన బహుజనవాదం కోసం పనిచేయాల్సిన అవసరం కనిపించింది. ఈ క్రమంలో ఉన్న వ్యవస్థలోనే సమస్యల కోసం పోరాడటం, కొన్ని పరిష్కారాలు సాధించటం, కొన్ని విజయాలు సాధించటం కూడా అవసరమనే తత్వం బోధపడింది.**

**ఇది కేంద్ర ప్రభుత్వం అవార్డు, కేంద్ర ప్రభుత్వమే ఎన్ఆర్‌సీ, క్యాబ్ తెచ్చింది. స్వంత ప్రజలనే ఇబ్బందు లపాలు చేస్తోందని సర్వత్రా విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ సందర్భంలో మీరు అవార్డు అందుకోవడం...?**

శప్తభూమి రాయలసీమ స్థానికతకు సంబంధించిన నవల. స్థానిక ప్రయోజనాలకు గండికొట్టిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అవార్డును గతంలో తిరస్కరించ వలసి వచ్చింది. ఎన్ఆర్‌సీ, క్యాబ్‌లను వ్యతిరేకించే సందర్భంలో రాయలసీమ సమస్యను నిర్లక్ష్యం చేయాల్సిన అవసరం లేదు కదా. అవార్డు తీసుకోవడం అంటే కేంద్ర ప్రభుత్వంతో ఏకీభవించడం కూడా కాదు...

అదే విధంగా, రాయలసీమ ఆసక్తులకు కేంద్రప్రభుత్వం భంగకరంగా ప్రవర్తించే పక్షంలో ఈ అవార్డు గురించి పునరాలోచించుకోవడానికి కూడా ఈ రచయిత సిద్ధంగా ఉంటాడు. 'రచయిత ఎప్పటికీ ప్రతిపక్షమే' అన్న సూత్రాన్ని ఎప్పటికీ నమ్ముతాడు రచయిత. దేశంలో నూటికి నూరుశాతం న్యాయపరమైన, ధర్మపరమైన ప్రభుత్వాలు ఉండటానికి వీలు లేదు. అట్లని, ఎప్పుడు ఏ అవార్డును తీసుకున్నా, దానికి సమాంతరంగా ప్రభుత్వపు దుర్మార్గం ఉండనే వుంటుంది. అంటే, ప్రభుత్వానికి సాహిత్యం పట్ల బాధ్యత ఉండకూడదని మనం తీర్మానించినట్లు అవుతుంది. ఎన్ఆర్‌సీ, క్యాబ్ సమస్యల కంటే రాయలసీమ అస్తిత్వ సమస్య తక్కువ అని ఈ రచయిత అనుకోవడం లేదు.

**ఇప్పటికే మీరు ప్రసిద్ధమైన రచయిత. ఈ అవార్డు అందుకోవడం వల్ల కొత్తగా ఏమొస్తుందని అనుకుం టున్నారు?**

డబ్బొస్తుంది కదా, పేరొస్తుంది కదా, నవల పలు భారతీయ భాషల్లోకి అనువాదం అవుతుంది కదా, నవలకు పాఠకుల సంఖ్య పెరుగుతుంది కదా, ఈ దేశంలో 'రాయల సీమ' అంటూ ఒకటుందని మన మహానుభావులకు ఇప్పటికైనా తెలుస్తుంది కదా! ■

---

**'దుర్గాపురం రోడ్' కవితా సంపుటి పరిచయ సభ**

ఛాయా ఆధ్వర్యంలో దేశరాజు కవితాసంపుటి 'దుర్గాపురం రోడ్' పరిచయ సభ డిసెంబర్ 25 సా.6గం.లకు హైదరాబాద్ స్టడీసర్కిల్‌లో జరుగుతుంది. సభలో కె.శివారెడ్డి, దర్భశయనం శ్రీనివాసాచార్య, సిద్ధార్థ, శ్రీరామ్ మాట్లాడతారు.

**ఛాయా రిసోర్స్ సెంటర్**

**పాలమూరు సాహితి అవార్డులు**

పాలమూరు సాహితి అవార్డులు 2017కిగాను చిత్తలూరి సత్య నారాయణ కవితా సంపుటి 'నల్లచామంతి'కి, 2018కిగాను ఏనుగు నరసింహారెడ్డి కవితా సంపుటి 'మూలమలుపు'కి ఇవ్వనున్నారు. పురస్కార ప్రదానం డిసెంబర్ 25 ఉ.10గం.లకు మహబూబ్ నగర్‌లోని వాగ్దేవి జూనియర్ కాలేజ్‌లో జరుగు తుంది.

**భీంపల్లి శ్రీకాంత్**

**కథా రచన కార్యశాల**

తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కథారచన కార్యశాల డిసెం బర్ 25, 26తేదీల్లో కరీంనగర్‌లో జరుగు తుంది. అంపశయ్య నవీన్, అల్లం రాజయ్య, రామాచంద్ర మౌళి, నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం, నగు నూరిశేఖర్ పాల్గొంటారు. కథా రచనపై పలు అంశాలలో సంగిశెట్టి శ్రీనివాస్, పెద్దింటిఅశోక్‌కుమార్, బి.వి.ఎన్. స్వామి, వెల్దండి శ్రీధర్, వసంతరావు దేశ్‌పాండే, తుమ్మేటి రఘోత్తమరెడ్డి ప్రసంగిస్తారు.

**కూకట్ల తిరుపతి**

**'వెంట వచ్చునది' కథా సంపుటికి అరసం పురస్కారం**

వాసిరెడ్డి భాస్కరావు పేరిట వరంగల్లు అరసం ఇచ్చే సాహితీ పురస్కారానికి 2019కి గాను ఎమ్వీ రామిరెడ్డి రాసిన 'వెంట వచ్చునది' కథా సంపుటి ఎంపికైంది. డిసెంబర్ 29న హన్మకొండలో జరిగే కార్యక్రమంలో పురస్కార ప్రదానం జరుగుతుంది.

**పల్లేరు వీరస్వామి**

**'అంబర్‌పేట: ఆకాశానికి పూచిన మందారం'**

కోడం పవన్‌కుమార్, ఎస్.జి.ఎస్. ధనుంజయ, చింతల శ్రీనివాస్ ముది రాజ్ సంపాదకత్వంలో 'అంబర్‌పేట: ఆకాశానికిపూచిన మందారం' పుస్తకా విష్కరణ సభ డిసెంబర్ 29 ఉ.10గం.లకు అశోక్ ఫంక్షన్‌హాల్, జిందా తిలస్మాత్ రోడ్, అంబర్‌పేటలో జరుగుతుంది. జి. కిషన్ రెడ్డి, వి.హను మంతరావు ఆవిష్కరిస్తారు.

**కోడం పవన్ కుమార్**

---

## రెండు క్షణాలు



చతుర్దశిరాత్రి
మడుగుమీద మత్తుగా తచ్చాడుతూ
చందమామ
నీళ్ళన్నీ పాలుగా మార్చేసి
మాయమైపోయాడు.

నిటారుగా నిలబడ్డ చెట్లు
వంగిన కొమ్మలు, నల్లగా.

అలవోకగా నడుస్తూ
అతను ఠక్కున ఆగిపోయాడు,
ఒక్క క్షణం.

ఆగామిక స్మృతి:

తన ఇంట్లో అపరిచిత ఎవరో
తన పక్కమీద తాపీగా
పడుకొని పద్యం రాస్తూన్నది,
పక్కనే కూచుని పొంచి చూస్తున్న
చందమామకేసి చూస్తూ.

దూరంగా చెట్లకింద
వంగిన కొమ్మలకింద
అపరిచితుడు ఎవరో
వడివడిగా నడుస్తూ
ఆవిడ గురించే ఆలోచిస్తాడు,
ఒక్క క్షణం.

రివ్వున గాలి వీచింది
చందమామ
పైకెగిసిపోయాడు.

ఇప్పుడు
నల్లగా కాగితం.

■ **వేలూరి వేంకటేశ్వరరావు**

---



**పుస్తకం కంటే కూడా కవర్ పేజీ బాగుందనో, లోపల మంచి బొమ్మలున్నాయనో కూడా నేను పుస్తకాలు కొంటుంటాను. బహుశా ఈ అభిరుచి నన్ను బాలసాహిత్యం వైపు నెట్టిందనుకుంటాను.**

**అనిల్ బత్తుల** ◆ **పలకరింపు**

# "ఈ తరం చిన్నారులను దృష్టిలో పెట్టుకుని సరళంగా ఉండేట్లు పంచతంత్రం తేవాలని అనుకున్నాను."

**ఇటీవల మీ 'పంచతంత్రం' పుస్తకం వచ్చింది. ఇప్పటి దాకా తెలుగులో ఎన్నో పంచతంత్రాలు ఉండగా దీని ప్రత్యేకత ఏమిటి?**




ఈ పుస్తకాన్ని తెచ్చే ముందు తెలుగులో ఇరవై పైచిలుకు పంచతంత్రాలను పరిశీలించాను. మూలం సంగతి అలా ఉంచితే పంచతంత్రానికి చిన్నయ సూరి వంటివారు వాడే వచనంలో ప్రత్యేకమైన లయ, భాష ఉంది. అందు లోని జంతువుల పేర్లకు ఎంత విశిష్టత ఉందో అటువంటి కథనానికి కూడా ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఒరవడిని పోగొట్టకుండా ఈ తరం చిన్నారులను దృష్టిలో పెట్టుకుని సరళంగా ఉండేట్లు పంచతంత్రం తేవాలని అనుకున్నాను. దానికితోడు తెలుగులో బాపు బొమ్మలతో పంచ తంత్ర కథలు లేవు. బాపు పంచతంత్రం గేయ కథలకు వేసిన బొమ్మలను ఈ పుస్తకానికి వాడుకోడానికి ఆయన కుటుంబ సభ్యులు అనుమతి ఇవ్వడంతో ఈ పుస్తకం వేయగలిగాను.

**బాలసాహిత్యంపై మీ ఆసక్తి గురించి చెప్పండి?**

నిజానికి నాకు బొమ్మలంటే ఇష్టం. కొన్నివేల ఇంగిలీషు, తెలుగు బొమ్మల పుస్తకాలు దేశవిదేశాల నుంచి సేకరించాను. పుస్తకం కంటే కూడా కవర్ పేజీ బాగుందనో, లోపల మంచి బొమ్మలున్నాయనో కూడా నేను పుస్తకాలు కొంటుం టాను. బహుశా ఈ అభిరుచి నన్ను బాలసాహిత్యం వైపు నెట్టిందనుకుంటాను. దానికితోడు చిన్నపిల్లల కోసం రాదుగ ప్రచురించిన రష్యన్ అనువాదాలు విపరీతంగా ఆకర్షించాయి. అన్ని పుస్తకాలు రాసిన టాల్‌స్టాయ్ వంటి మహా రచయిత చివర్లో చిన్న పిల్లలకోసం కథలు రాయడం నన్ను అబ్బుర పరిచింది. ఈ రష్యన్ పుస్తకాలను సేకరించే క్రమంలో అన్ని ప్రపంచ భాషల బాల సాహిత్యాన్ని, జానపద కథలను తెలుసుకుని చదువుతుండటంతో నా అభిరుచి, ఆసక్తి బాలసాహిత్యమేనని నాకూ అర్థమైంది.

**మీ పాత పుస్తకాల సేకరణ గురించి చెప్పండి?**

రాదుగ రష్యన్ అనువాద పుస్తకాలు సేకరించే క్రమంలో కళలకు కేంద్రమైన ఫ్రాన్సు రచయితల తెలుగు అనువాదాలు ఏమైనా ఉన్నాయా అని వెతకడం మొదలు పెట్టాను. ఎప్పుడో ప్రచురించిన 'బీదలపాట్లు', 'నీలికళ్లు', 'నేలను పిండిన ఉద్దండులు' వంటి పుస్తకాలు దొరికాయి. ఇప్పటికీ అనేక పుస్తకాల ఆచూకీ లేదు. ఒక పాతపుస్తకాల విక్రేత ద్వారా ఎక్కువ పుస్తకాలు రాజమండ్రి పేపర్ మిల్లుకు వెళ్తుంటాయని తెలుసుకుని చాలా బాధ పడ్డాను. గతంలో ప్రచురించిన మంచి పుస్తకాలను అందరి దృష్టిలోకి తేవడం మొదలు పెట్టాను. వాటిని యాంటిక్స్‌లా భద్రపరచాల్సిన అవసరం ఎంతో ఉంది.

✆ 81792 73971

---

# "యీ నేలకు నేను ఆస్థాన లేఖకుడ్ని"

**సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి**

నా కాళ్ల కింది నేల, నా చుట్టూ వున్న జీవితాలు కలిసి నా చేత రాయించిన మరో నవల యీ 'కొండపొలం'.

సగిలేటి నుంచి నల్లమలల దాకా వున్న బరక పొలాలూ, మెరక నేలలూ, వంకలూ వాగులూ, మిట్టలూ గుట్టలూ, చెట్లూ చేమలూ, రకరకాల జీవరాశులతో కూడిన యీ నేలకు నేను ఆస్థాన లేఖకుడ్ని. నిరంతరం వాటి ముందు కూచుని అవి చెప్పే విషయాల్ని శ్రద్ధగా వింటూ రాసి ప్రకటించటం నా పని. ఆ పరంపరలో ఇప్పుడు నల్లమల కొండల వంతు వచ్చింది.

పొలము దున్ని, విత్తనాలు విత్తి కరువు కాలానికి చింత పడుతూ, మంచి కాలానికి వంత పాడుతూ పంటను ఇంటికి చేర్చుకొనే వ్యవసాయం వేరు. తానే విత్తనమయి మట్టి పొత్తిళ్లలోంచి మొలకెత్తి, ఆశగా ఆకసానికి చూసే రైతుదనం వేరు. పెద్దంబలి పొద్దున దొడ్ల తడికలు తీసి గొర్లను బైటకు తోలి ఎండల్లో వానల్లో వాటి వెనక కాపలాకర్రలా తిరుగుతూ పొద్దుగుంకే సమయాన తిరిగి గొర్లను దొడ్లల్లోకి చేర్చే గొర్ల కాపరితనం వేరు. తానే ఆకలికి మరో రూపమైన గొర్రెగా మారి బతుకంతా మేతకోసం వెంపర్లాడే గొల్లదనం వేరు.

**"...ఈ దుర్గమారణ్యాల్లోనే మా వూరి గొర్లకాపరులు నెల, నెలన్నరపాటు గొర్రెల్ని మేపుకొంటూ కొండపొలం చేస్తూ బతుకుతారనే విషయం తెలిసి ఆశ్చర్యం కలిగేది. అదొక మార్మిక జీవనం. దాన్ని గురించి వాళ్ల నోళ్లలోంచి వింటూ దిగ్భ్రాంతికి గురయ్యేవాన్ని. ఆ జీవితాన్ని గురించి దశాబ్దాలుగా వింటూ, వాళ్లు తిరిగిన ప్రాంతాలు నేను చూసి వుండటం వలన విన్న దృశ్యాల్ని ప్రాంతాలకు అన్వయించుకొని అనుభూతికి తెచ్చుకొంటూ, వాళ్ల అనుభవాల్ని నావిగా అనుభూతిస్తూ నేనూ గొర్రెలకాపరిగా మారి కొండల్లో తిరిగినంతగా మార్పు చెందితేగాని ఈ నవల రాయలేకపోయాను."**

రైతుదనం, గొల్లదనం రెండూ కలగలిసిన జీవితం నాది. సగం శరీరం కంకులుగా పండి గింజలు రాలిస్తే, మరో సగం శరీరం పొదుగుగా మారి పాలిచ్చే పల్లె జీవితం నాది.

ఈ నవల రాసేందుకు పద్దెదు సంవత్సరాలుగా నేను రగులుతూనే వున్నాను.

గొల్లలు, కాపులు సగం సగంగా వున్న వూరు మాది. చిన్నతనాన్నించీ వాళ్లతో కలిసిమెలిసి బతుకు పయనం సాగిస్తోన్నప్పటికీ, వాళ్ల జీవితాల్ని అర్థం చేసికొని, వాటిని సాహిత్యంలోకి తీసుకురావాలనే తలంపు వచ్చేసరికి సగం వయస్సు దాటింది. వ్యవసాయ వృత్తిని జీర్ణించు కొన్నంతగా గొర్ల కాపరితనాన్ని జీర్ణించుకొని నవలగా రాసేసరికి ఇంతకాలం పట్టింది. తనదికాని జీవితాన్ని తనదిగా మార్చుకోవా లంటే ఒక జీవితకాలం కృషి చేయవలసిందే. అది కూడా నిజాయితీగా, తన కులానికి, వృత్తికి సంబంధించిన పొరలన్నీ వదల్చుకొని అవతలి గట్టుకు నడవగలిగిన స్థితికి వచ్చినపుడు మాత్రమే సాధ్యమవుతుంది. చొక్కాను వదల్చి కంబడి కప్పు కోవచ్చు. ముల్లుగర్రను వదలి బొట్టెకర్రను చేతబట్టొచ్చు. లొట్టలు రిక్కలు లాంటి ఎద్దుల అదిలింపులు చాలించి గొర్రెల్ని హెచ్చరించే శబ్దాలు ఒంటబట్టించుకోవచ్చు. కాని ఒంటికి అంటిన గొర్రె బొచ్చును, పెంటికల వాసనను సహజంగా అనుభూతించే గొర్ల కాపరితనం రావాలిగదా! అందుకే- పక్కపక్కనే కలిసి జీవిస్తోన్న వాళ్ల బతుకుల్ని అక్షరబద్ధం చేసేసరికి ఇన్ని దశాబ్దాలు పట్టింది.




ఎవరి మూలాల్ని వాళ్లు తవ్వుకొంటూ పోవటమే సులభంగా వుంటుంది.

***

నల్లమల కొండ పాదాలనించి మా వూరికి ఐదారుమైళ్ల దూరం వుంటుంది. పొద్దున్నే లేచి కళ్లు నులుముకొంటూ పడమటి దిశకేసి చూస్తే ఏదో ధైర్యాన్నిస్తూ గంభీరంగా నిలబడుకొనివున్న కొండ వరసలు కనిపిస్తాయి. చలికాలపు ఉదయాలు బారెడు పొద్దెక్కేదాకా తెల్లని ఆవులమందల్లా కొండలమీద మొయిలు మేస్తూ పైకెగబాకుతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తే, వానాకాలము చినుకు తెరల చాటున వొదిగిపోయిన పర్వతాల ముగ్ధత్వము కళ్లు విప్పార్చుకొనేలా చేస్తే, ఎండాకాలపు రాత్రిళ్లు మంటల తోరణాలు చుట్టుముట్టి కొండలపైకి ఎగబాకుతూ భయపెడుతోంటే- ఏడాది పొడవునా నల్లమలలు మాకు కొత్తగానే కనిపిస్తాయి.

బాల్యంనించీ కొండల్లోకి వెళుతూనే వున్నాను. కొట్టాల్ని కప్పుకొనే బోదగడ్డికో, కొట్టం వాసాలకో, వేపెనారకో, చింత కాయలకో, అహోబిలం, జ్యోతి, బిలంగుహ, పాములేటయ్య, భైరవకోనలాంటి క్షేత్రాల్ని దర్శించేందుకో కొండల్లో తిరుగు తూనే వున్నాను. ఈ దుర్గమారణ్యాల్లోనే మా వూరి గొర్ల కాపరులు నెల, నెలన్నరపాటు గొర్రెల్ని మేపుకొంటూ కొండపొలం చేస్తూ బతుకుతారనే విషయం తెలిసి ఆశ్చర్యం కలిగేది. అదొక మార్మిక జీవనం. దాన్ని గురించి వాళ్ల నోళ్లలోంచి వింటూ దిగ్భ్రాంతికి గురయ్యేవాన్ని. ఆ జీవితాన్ని గురించి దశాబ్దాలుగా వింటూ, వాళ్లు తిరిగిన ప్రాంతాలు నేను చూసి వుండటం వలన విన్న దృశ్యాల్ని ప్రాంతాలకు అన్వయించుకొని అనుభూతికి తెచ్చుకొంటూ, వాళ్ల అనుభవాల్ని నావిగా అనుభూతిస్తూ నేనూ గొర్రెలకాపరిగా మారి కొండల్లో తిరిగినంతగా మార్పు చెందితేగాని ఈ నవల రాయలేక పోయాను. నిజంగా గొర్ల కాపర్లే యీ నవల రాసింటే- దీనికన్నా ఎంతో స్పష్టంగా, చిక్కగా, మరింత దగ్గరితనంగా, ఇంకొంత వాస్తవికంగా వుండేది. అందులో సాఫ్ట్‌వేర్ రవీంద్ర యాదవ్ పాత్ర వుండకపోవచ్చుగాని అచ్చం గొర్రెబొచ్చు వాసన గుబాళించి వుండేది. గొర్రెల జీవనానికి సంబంధించిన చాలా సూక్ష్మమైన అంశాలు వాళ్లకు మాత్రమే తెలుసు.

ఉన్నట్టుండి- తడిసిన గొర్రెపిల్లలా వజవజ వణుకుతూ, నిండా ముసుగేసుకొని కొండల్నించి వూర్లొకొచ్చి పడతాడు గొర్లకాపరి. అతన్ని పరామర్శించి సానుభూతి చూపటం తప్ప కొండల్నించి హిమాలయ శిఖరాల్లోని చలినంతా దుప్పట్లో చుట్టుకొచ్చిన అతని జ్వరాన్ని నేను అనుభూతించలేను గదా! దాన్ని అక్షరీకరించటం నాకు సాధ్యం కాదుగదా! ■

*(సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి నవల 'కొండపొలం' తానా నవలల పోటీ - 2019లో రూ.2లక్షల బహుమతి పొందిన సందర్భంగా, నవలకు ఆయన రాసిన ముందుమాట నుంచి తీసుకున్న భాగమిది. ఈ అవార్డు ప్రదాన సభ డిసెంబర్ 25 ఉదయం 10.30 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షులు: మృణాళిని, బహుమతి ప్రదానం: కె.శ్రీనివాస్, ఆవిష్కరణ: శీలా వీర్రాజు. సభలో వాసిరెడ్డి నవీన్, కాత్యాయనీ విద్మహే, అంపశయ్య నవీన్ పాల్గొంటారు.)*



సెలబ్ ఫిట్

# ముగ్ధమనోహారి

**నాజూకు ఫిజిక్...**
**గమ్మత్తయిన లుక్కు...**
**ముద్ద మందారంలా మెరిసే ముగ్ధమనోహారి ఆమె.**
**స్టార్ హీరో కుమార్తెగా బాలీవుడ్‌లోకి అడుగు పెట్టినా...**
**చూడచక్కని అభినయంతో తనకంటూ**
**ఓ ప్రత్యేకత సంపాదించుకున్న నటి సోనాక్షీ సిన్హా.**
**టీనేజీలో బొద్దుగా ఉన్న ఆమె వెండి తెరపైకి వచ్చేసరికి**
**పిక్చర్ పర్‌ఫెక్ట్‌గా మారిపోయింది. అయితే దీని వెనక**
**క్రమం తప్పని వ్యాయామం ఉందంటారు సోనాక్షి.**
**అదేమిటో ఆమె మాటల్లోనే...**

సాధారణంగా ఉదయం లేవగానే నా వ్యాయామం మొదలవుతుంది. తొలుత ఖాళీ కడుపుతో కార్డియో, ఆ తరువాత అరగంట స్టెయిర్‌మాస్టర్ చేస్తాను. అది అవ్వగానే 20-25 నిమిషాలు బ్రిస్క్ వాకింగ్ చేస్తా.



**రోజూ కొత్తగా:** ఇప్పుడు చాలా రకాల వర్కవుట్ మిషన్లు వచ్చాయి. బోర్ కొట్టకుండా వాటితో రోజుకో రకమైన వర్కవుట్ చేసుకోవచ్చు. దాంతో ఉత్సాహంగా జిమ్‌కు వెళ్లగలుగుతాం. నేనైతే ఏడాది కిందట పిలేట్స్ మొదలెట్టాను. నాకవి బాగా సరిపోయాయి. ఇవి కాకుండా స్విమ్మింగ్ చేస్తాను. టెన్నిస్ ఆడుతుంటాను. శరీరం ఫ్లెక్సిబుల్‌గా ఉండటానికి హాట్ యోగా చేస్తాను.

**సాకులు లేవు:** ఏదో ఒక కారణం చెప్పి జిమ్‌కు ఎగనామం పెట్టడం సరైంది కాదు. వ్యాయామం విషయంలో రాజీ పడేది లేదు. అలాగని రోజూ గంటలకు గంటలు జిమ్‌లో గడిపే వ్యక్తిని కాను. తెగ బరువులూ ఎత్తేయను. కానీ ఫిట్‌గా ఉండడానికి అవసరమైనవన్నీ చేస్తాను.

**ఆకలేస్తే అవే:** భోజనానికీ భోజనానికీ మధ్య ఆకలేస్తే బాదం, అక్రూట్ లేదంటే అరటి పండు తింటాను. అవి ఎప్పుడూ నా హ్యాండ్‌బ్యాగులో ఉంటాయి.

**ఆమె ఎనర్జీ చూసి:** ఫిట్‌నెస్ ట్రైనర్ నమ్రతా పురోహిత్ ఆధ్వర్యంలో వర్కవుట్స్ చేస్తున్నా. ఆమె నా గురించి పూర్తి కేర్ తీసుకుంటారు. ఎప్పటికప్పుడు స్ఫూర్తి నింపుతారు. ఆమెలోని ఎనర్జీ ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా నన్ను జిమ్‌కు వెళ్లేలా ఉత్సాహపరుస్తుంది. నమ్రతలో నాకు బాగా నచ్చింది అదే!

**ఆహారంలో క్రమశిక్షణ:** ఫిట్, ఎనర్జిటిక్ బాడీకోసం క్రమం తప్పని వ్యాయామం ఎంత ముఖ్యమో ఆహార నియమాలు పాటించడం కూడా అంతే ముఖ్యం. కానీ కావల్సినంత తింటాను. ఒకవేళ ఎక్కువ తిన్నాననిపిస్తే దాన్ని కరిగించేందుకు సరిపడా వర్కవుట్స్ చేస్తాను. బ్రెడ్ పూర్తిగా మానేశాను. మధ్యాహ్న భోజనంలో కార్బోహైడ్రేట్లు తప్పనిసరి. రాత్రిపూట పోషకాలు పుష్కలంగా ఉన్న ఆహారం తింటా. మెనూలో పప్పు, రోటీ, చికెన్, ఫిష్ ఉంటాయి. నూనెలో వేగించినవి, పంచదారతో చేసే వంటకాలకు నేను దూరం. అదృష్టం ఏమంటే... నేను స్వీట్ లవర్‌ను కాకపోవడం!

**అప్పుడప్పుడూ:** ఎప్పుడన్నా బాగా తినాలనిపించిన రోజు పిజ్జా లాగించేస్తా. లేదంటే ఛోళే కుల్చా తింటా.

**పంజాబీ బీట్:** వర్కవుట్స్ చేసేటప్పుడు పంజాబీ బీట్స్‌ను ఆస్వాదిస్తాను. ఆ పాటలంటే నాకు చాలా ఇష్టం. ఖాళీ దొరికితే నెట్‌ఫ్లిక్స్ చూస్తా.

**స్ఫూర్తి:** రోజూ నాకు స్ఫూర్తినిచ్చేది ఫలితం! మానసికంగా, శారీరకంగా మనలో మంచి మార్పు కనిపిస్తే అది ఎంతో శక్తినిస్తుంది. మరింత ఉత్సాహంగా ముందుకు సాగేందుకు తోడ్పడుతుంది. ఇక్కడో విషయం చెప్పాలి... నేను తొలి సినిమా చేసే నాటికి 30 కిలోల బరువు తగ్గాను. అందుకు స్ఫూర్తి హీరో సల్మాన్ ఖాన్! 'దబంగ్'కు ముందు బరువు తగ్గమని ఆయనే సూచించారు.

**అనుసరణ వద్దు:** ఫిట్‌గా ఉండాలనుకొనేవారు సామాజిక మాధ్యమాల్లోని కొందరు అథ్లెట్లను ఫాలో అవుతుంటారు. అది ఒక్కోసారి మనల్ని బాధిస్తుంది. ఎందుకంటే వాళ్లతో పోల్చుకొని మనం అలా లేమేంటని దిగులు పడుతుంటాం. దానివల్ల మానసిక వేదన పెరుగుతుంది. అందుకే ప్రతి ఒక్కరికి సొంత ఫిట్‌నెస్ ప్రణాళిక ఉండాలి. దాన్ని క్రమం తప్పకుండా ఆచరిస్తుండాలి. దానివల్ల మంచి ఫలితాలు వస్తాయి.



న్యూస్ మేకర్

# వారి భయమే నా పోరాటానికి బలం!

**అఘాయిత్యానికి గురైన సాటి సన్యాసినులకు**
**ఆమె అండగా నిలబడ్డారు.**
**న్యాయం పక్షాన మాట్లాడినందుకు**
**ఆమె దోషి అయ్యారు.**
**బెదిరింపులకూ, ఆఖరికి డిస్మిస్‌కూ గురయ్యారు.**
**అయినా ఆమె సంకల్పం సడలలేదు.**
**ఇప్పుడు తన అభిప్రాయాలను**
**మరింత గట్టిగా చాటడానికి**
**ఆత్మకథతో ముందుకు వస్తున్నారు.**
**సిస్టర్ లూసీ కలప్పురా...**
**ఆమె ఇప్పుడు కేరళలోనే కాదు...**
**దేశంలోనే ఓ సంచలనం!**

"నేను నా పుస్తకంలో రాసిన విషయాలేవీ కొత్తవి కావు. చాలా కాలంగా నేను చెబుతున్నవే! చర్చిల్లో ఒక మంచి మార్పు రావాలని నేను కోరుకుంటున్నాను. అందుకే ఈ పుస్తకం" అంటారు సిస్టర్ లూసీ కలప్పురా. 54ఏళ్ల ఈ క్రైస్తవ సన్యాసిని రాసిన 'కర్తావింటె నామ్మత్తిల్' (ప్రభువు పేరు మీద) అనే పుస్తకం సంచలనం సృష్టిస్తోంది. ఈ నెలలో కేరళలోని ప్రధాన నగరాల్లో తన పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్నారు లూసీ. అమె తన ఆత్మకథగా చెబుతున్న ఈ పుస్తకం ముద్రణ, పంపిణీనీ నిషేధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను కేరళ హైకోర్టు ఇటీవల కొట్టివేసింది.

"ఇది నాకు నైతిక విజయం. నా పుస్తకంలో వాస్తవాలనే నేను ప్రస్తావించాను" అని చెబుతున్నారు లూసీ. ఇంతకీ ఆమె ఈ పుస్తకం రాయడానికి దారి తీసిన పరిస్థితులు, కారణాలు ఏమిటి?

## బెదిరింపులకు లొంగలేదని...

కేరళలోని వయనాడ్‌లోని ఫ్రాన్సికన్ క్లారిస్ట్ కన్‌గ్రేగేషన్ (ఎఫ్‌సిసి)లో లూసీ క్రైస్తవ సన్యాసిని (నన్). ఒక చర్చి బిషప్ తమపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ, అతణ్ణి అరెస్ట్ చెయ్యాలని కిందటి ఏడాది సెప్టెంబరులో అయిదుగురు క్రైస్తవ సన్యాసినులు కొచ్చిలో ఆందోళనకు దిగారు. వారికి మద్దతుగా ఆ ఆందోళనలో లూసీ కూడా పాల్గొన్నారు. ఇది ఎఫ్‌సిసి అధికారుల ఆగ్రహానికి కారణం అయింది. దాదాపు ఏడాదిపాటు ఆమె బెదిరింపులను ఎదుర్కొన్నారు. ఆమెపై ఎఫ్‌సిసి నిఘా పెట్టింది. తోటి నన్స్‌ను ఆమెతో కలవనివ్వకుండా చేసింది. క్షమాపణలు చెప్పాలంటూ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదులను వెనక్కు తీసుకోకపోతే న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అయినా లూసీ దిగి రాకపోవడంతో ఆఖరికి ఈ ఏడాది ఆగస్టులో ఆమెను డిస్మిస్ చేసింది.

## ఆ ధైర్యమే నన్ను కదిలించింది!

"ఏది ఏమైనా వెనక్కి తగ్గేది లేదు. ఆ నన్స్‌కు నేను మద్దతు ఇవ్వడంతోనే ఇదంతా మొదలుకాలేదు. నాకన్నా పైన ఉన్న పెద్దలకూ, నాకూ విభేదాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. నేను కవితలు రాయడం, కారు కొనుక్కోవడం... ఇలా నేను ఏది చేసినా వాళ్లు సహించలేకపోయేవారు. ఆందోళనలో నేను పాల్గొన్న తరువాత వారి వ్యతిరేకత మరింత స్పష్టంగా కనిపించింది. ఆ నన్స్‌తో నాకు అంతకు ముందు పరిచయం లేదు. మీడియా కథనాల ద్వారా ఆ సంఘటన గురించి నాకు తెలిసింది. అధికారి స్థానంలో ఉన్న వ్యక్తి అఘాయిత్యం చేసినప్పుడు, అతడి మీద ఒక నన్ బహిరంగంగా ఆరోపణలు చేయాలంటే ఎంతో ధైర్యం ఉండాలి! అదే నన్ను కదిలించింది. అందుకే వాళ్లకు అండగా గొంతు కలపాలనుకున్నాను" అంటూ నాటి ఘటనల్ని గుర్తు చేసుకుంటారు లూసీ.

### చర్చి పెద్దల మాట ఇది!

చర్చి పెద్దలు చాలా కాలంగా తనపై గురి పెట్టారని సిస్టర్ లూసీ ఆరోపణ. అయితే ఆమె వివాదాస్పదురాలనీ, 2015లో ఆమెను వేరే చోటికి బదిలీ చేసినప్పుడు ఆ బదిలీ ఆదేశాలను ఆమె ఖాతరు చేయలేదనీ చర్చి వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే తన కవితలతో పుస్తకం ప్రచురించడానికి లూసీ అనుమతి కోరగా చర్చి అధికారులు తిరస్కరించారు. అయినా ఆ పుస్తకాన్ని ఆమె ప్రచురించారు. దానికోసం సరైన అనుమతి లేకుండా 50 వేల రూపాయలను ఆమె ఖర్చు చేశారనీ, అసాధారణ ఖర్చు కింద ఎఫ్‌సిసి సుపీరియర్ జనరల్ వినియోగించడానికి అధికారం ఉన్న దానికన్నా అది ఎక్కువ అనీ చర్చి వర్గాలు ఆరోపిస్తున్నాయి. సిస్టర్ లూసీపై ఉన్న మరో ఆరోపణ- కారు డ్రైవింగ్ నేర్చుకోవడం. కారు కొనడం! నన్‌గా మారిన వారు నిరాడంబరంగా జీవించి, దేవుడి సేవకు అంకితమవుతానని ప్రమాణం చేస్తారు. దాన్ని సిస్టర్ లూసీ ధిక్కరించారనీ అధికారులు పేర్కొంటున్నారు. పైగా కారు రుణం కోసం పై అధికారుల అనుమతి తీసుకోకుండానే హెడ్‌మిస్ట్రెస్‌ను సంప్రతించడం... ఇవన్నీ నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తాయని చర్చి పెద్దల వాదన. ఈ క్రమంలో సముచితం కాని ప్రవర్తన, మతపరమైన క్రమశిక్షణ ఉల్లంఘన ఆరోపణలతో ఆమెకు హెచ్చరిక నోటీసులు కూడా జారీ చేశారు.

జలంధర్ బిషప్ ఫ్రాంకో మలక్కల్ తమపై అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ కేరళ నన్స్ చేసిన ఆందోళనకు ఆమె మద్దతు ఇవ్వడంతో ఆమెపై ఉన్న ఆరోపణలన్నిటినీ ఎఫ్‌సిసి ఉన్నతాధికారులు మరోసారి పరిగణనలోకి తీసుకున్నారు. కాన్వెంట్ వదిలి వెళ్లాలని ఆమెకు నోటీసులు కూడా ఇచ్చారు. అయితే తాను ఎలాంటి ఉల్లంఘనలకూ పాల్పడలేదనీ, చర్చి పెద్దల చర్యలను ఎవరైనా ప్రశ్నిస్తే వారి నోళ్లు మూయించడానికి ప్రయత్నిస్తూ ఉంటారనీ సిస్టర్ లూసీ అంటున్నారు.



### లూసీ వాదన ఇది!

"కవితల పుస్తకం ప్రచురణ కోసం పదే పదే అనుమతులు అడిగాను. కానీ వారు నిరాకరించారు. నేనెప్పుడూ నా జీతాన్ని సంస్థకు మనస్ఫూర్తిగా ఇచ్చేస్తూ ఉంటాను. అయితే, సామాజిక కార్యక్రమాల కోసం ప్రయాణాలు చేయడానికి కారు కొనుక్కోవాలని కొంత డబ్బు అడిగితే అధికారులు తిరస్కరించారు. దాంతో నేను రుణం తీసుకొని కారు కొనుక్కున్నాను. అది ఉల్లంఘనగా నేను భావించడం లేదు. నిజానికి నాకు రావలసిన ప్రయోజనాలను ఇవ్వకుండా నా హక్కుల్ని మా సంస్థే కాలరాసింది" అని లూసీ ఆరోపించారు. ఇక ఈ ఏడాది జనవరిలో సిస్టర్ లూసీ సల్వార్ ధరించి దిగిన తన ఫొటోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనిపై ఆరోపణలు చేయవద్దని ప్రజలను కోరారు. ప్రయాణ సమయంలో క్రైస్తవ పూజారులు సాధారణ దుస్తులు ధరిస్తున్నప్పుడు, నన్స్‌కు కూడా అలాంటి స్వేచ్ఛ ఇవ్వాలని లూసీ డిమాండ్ చేశారు.

## ఏం జరుగుతోందో తెలుసు!

అయితే చర్చి పెద్దలకు వ్యతిరేకంగా నిలబడడం అంత సులువు కాదని ఆమెకు తెలుసు. "ఆందోళనలో పాల్గొనడానికి చర్చి పెద్దలు అనుమతి ఇవ్వలేదు. నాకు విధేయత లేదని వాళ్లు ఆరోపించారు. కానీ అది అబద్ధం. నేను నా అంతరాత్మ చెప్పిన దానికి విధేయంగా ఉన్నాను. ముప్ఫయ్యేళ్ళుగా ఈ వ్యవస్థలో ఉన్న నాకు ఇక్కడ ఏం జరుగుతోందో తెలుసు. పురుషాధిక్యత ఉన్న చర్చి వ్యవస్థలో నన్స్ అత్యాచారాలకు గురవుతున్నారు. నన్స్ అందరూ ఈ తరుణంలో కలిసికట్టుగా ఉండాలి. అయితే దురదృష్టవశాత్తూ అది జరగడం లేదు" అని ఆమె చెప్పారు.

లూసీ గతంలో కొట్టియ్యూర్‌లో ఒక ఫాదర్ మీద అత్యాచార ఆరోపణలు వచ్చినప్పుడు కూడా ఆ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలని చర్చి పెద్దలకు ఆమె లేఖ రాశారు. నన్స్‌పై అణచివేత, వేధింపులను నిరోధించాలని ఆ లేఖలో కోరారు. ఈ రకంగా సహజంగానే ఆమె పై అధికారుల, చర్చి పెద్దల ఆగ్రహానికి గురయ్యారు.

## గదిలో నిర్బంధించారు!

ఒక దశలో ఉన్నతాధికారులు ఆమెను గదిలో నిర్బంధించారు. "నేనేం తప్పు చేయలేదు, వాళ్లు నా నోరు నొక్కేయాలని ప్రయత్నించారు. ఆ క్రమంలో నన్ను చంపేయవచ్చు కూడా నా గురించి అబద్ధాలు ప్రచారం చేయవచ్చు. కానీ నేనేమిటో తెలిసిన వ్యక్తులు వాళ్ల మాటలు నమ్మరు. ఈ పరిణామాలు చూసి మా అమ్మ ఆందోళన చెందారు. అయితే ఆమె దృఢచిత్తం ఉన్న మనిషి, నాలో ఇంతటి ఆత్మవిశ్వాసం మా అమ్మ నుంచి వచ్చిందే. ఇంకా చెప్పాలంటే, నా కుటుంబం, చాలామంది విశ్వాసుల మద్దతు నాకు దొరికింది. ఎన్నో ప్రాంతాల నుంచి నన్స్ కాల్ చేసి మాట్లాడి, అలా మాట్లాడినట్టు ఎవరికీ చెప్పొద్దన్నారు. వాళ్ళు ఎంతగా భయపడుతున్నారో నాకు అర్థమైంది. నా పోరాటాన్ని కొనసాగించడానికి అది మరింత బలాన్ని ఇచ్చింది" అంటారు లూసీ.

## సంస్కరణలు రావాలి!

"నాపై అధికారులు, పెద్దల వైఖరి కారణంగా ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఆ సంఘటనలు నన్ను కుదిపేశాయి. ఒక నన్‌గా, వ్యక్తిగా నేను పడ్డ కష్టాలు, నేను విన్న, చూసిన సంఘటనలు, నాలో కలిగిన ఆలోచనల గురించి రాయాల్సిన అవసరం ఉందని భావించాను. కొన్ని కాన్వెంట్లలో నన్‌లను క్రైస్తవ పూజారులు (ప్రీస్ట్‌లు) లోబరుచుకున్న, పదేపదే లైంగిక వాంఛలు తీర్చాలని వేధించిన ఘటనలు నాకు తెలుసు. అలాగే చర్చిలో ఆరాధన చేసే వ్యక్తి ఒక బాలికకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడిన ఉదంతం గురించి విన్నాను. కొన్ని కాన్వెంట్లలో అనైతిక సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇది బహిరంగ రహస్యం. ఈ పరిణామాలు చర్చి, కాన్వెంట్ల పవిత్రతకు విఘాతం కలిగిస్తాయి. ఈ ధోరణి యేసు ప్రభువు ఆలోచనలకు విరుద్ధం" అని ఆమె పేర్కొన్నారు.

మరి దీనికి పరిష్కారం? "వివాహితులు కూడా క్రైస్తవ పూజారులు (ప్రీస్ట్) కావచ్చని స్వయంగా పోప్ చెప్పారు. దానిని ఇక్కడ మనం అనుమతిస్తే తప్పేమిటి? ఈ బలవంతపు బ్రహ్మచర్యం లైంగిక దాడికి దారితీస్తోందని నా అభిప్రాయం" అంటారు లూసీ. తాజాగా తాను రాసిన పుస్తకంలో సంచలనాత్మకమైన సంఘటనలూ, సంస్కరణల కోసం ప్రతిపాదనలూ ఎన్నో ఉన్నాయని లూసీ చెబుతున్నారు. ఒక నన్ గొంతు విప్పి, చర్చి వ్యవస్థపై చేస్తున్న ఆరోపణలు ఇప్పుడు సంచలనంతో పాటు ఆలోచనలూ రేకెత్తిస్తున్నాయి.

తిరుప్పావై

# దేవాధిదేవుణ్ణి సేవిద్దాం!

**ఎనిమిదో పాశురం**

**కీళ్‌వానమ్ వెళెన్రు ఎఱుమై శిఱు వీడు**
**మెయ్యాన్ పరన్దన కాణ్! మిక్కుళ్ళ పిళ్ళైగళుమ్**
**పోవాన్ పోగిన్టారై ప్పోగామల్ కాత్తు ఉన్నై**
**క్కూవువాన్ వన్దు నిన్టోమ్ కోదుకుల ముడైయ**
**పావాయ్! ఎఱున్దిరాయ్ పాడిప్పఱై కొండు**
**మావాయ్ పిళందానై మల్లరై మాట్టియ**
**దేవాదిదేవనై చ్చెన్రు నామ్ శేవిత్తాల్**
**ఆవావెన్ను ఆరాయుందరుళ్ ఎలోర్ ఎమ్బావాయ్**



**భావం:** "ఆకాశం తెల్లబడింది (తెల్లవారింది). ఆలమందలను ఉదయపు చిరు మేత కోసం చిన్న బీళ్ళలోకి వదిలిపెట్టారు. కొందరు గోప బాలికలు వాటి వెంట వెళ్తూ ఉంటే వాళ్ళని అడ్డగించాం. నిన్ను లేపడానికి నీ ఇంటి ముంగిట నిలిచి ఉన్నాం. లేచిరా! శ్రీకృష్ణుడికి నువ్వంటే వల్లమాలిన అభిమానం. భగవంతుడి పట్ల అభిమానం, మా పట్ల వేడుక ఉన్న ఓ పిల్లా! లేచిరావమ్మా! ఆయనను కీర్తిద్దాం. 'పర' అనే వాద్యాన్ని అందుకుందాం. గుర్రం రూపంలో వచ్చిన కేశి అనే రాక్షసుడి దవడలు చీల్చిన వాడూ, చాణూర, ముష్టికులు అనే మల్లులను మట్టి కరిపించిన వాడూ... ఆ దేవాధిదేవుణ్ణి చేరి సేవిద్దాం. ఆయన 'ఓహో! ఓహో!' అని ఆతుర పడి, మనం వచ్చిన పని ఏమిటో తెలుసుకొని, దయ చూపిస్తాడు" అని చెలులను పిలుస్తున్నారు గోపికలు. మార్గళి వ్రతం అద్వితీయమైనదని వివరిస్తున్నారు.

● ఎ. సీతారామారావు

అవగాహన

# డీటాక్స్ వాటర్...



ఒంట్లోని మలినాలు పోయి, చర్మం తాజాగా కనిపించేందుకు వీలైనన్ని నీళ్లు తాగుతాం. అయితే తాజా పండ్లు, కూరగాయ ముక్కలను నీళ్లలో వేసుకొని తాగితే ఆందం, ఆరోగ్యం రెండూ సొంతమవుతాయి.

- నీళ్లలో పైనాపిల్ ముక్కలు వేసి కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచి తరువాత తాగాలి. పైనాపిల్‌లోని ఎంజైమ్స్ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి.
- కివీ, కీరదోస ముక్కలు, పుదీనా ఆకుల్ని జార్‌లో వేసి, అందులో నీళ్లు పోసి రెండు గంటలు అలానే ఉంచాలి. ఈ నీళ్లు తాగితే చర్మానికి సి విటమిన్ అంది తాజాగా మారుతుంది. కురులు దృఢంగా పెరుగుతాయి.

## ముత్యాల ముగ్గు





బి. కాత్యాయని
గట్టుదుద్దెనపల్లి, కరీంనగర్

13 చుక్కలు
13 వరుసలు
సరిచుక్క

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

**మా చిరునామా...**
**నవ్య,**
**ముత్యాలముగ్గు,**
**ఆంధ్రజ్యోతి**
**కార్యాలయం,**
**రోడ్ నెంబర్ 70,**
**హుడా హైట్స్,**
**జూబ్లీ హిల్స్,**
**హైదరాబాద్**
**-500033.**





వై. ఐశ్వర్యలక్ష్మి
కడప

19 చుక్కలు
సందు
10 వరకు

ఇదీ సంగతి!

# అక్కడా వేధింపులే!



ఇంటర్నెట్ యుగం... స్మార్ట్ ఫోన్ విప్లవం... ప్రపంచం ఎంత ముందుకు పోతున్నా దేశంలో మహిళల పట్ల అనాగరిక పోకడలు తగ్గడం లేదు. ఈవ్‌టీజింగ్‌లు... పని ప్రదేశంలో ఇబ్బందులు... అక్కడ ఇక్కడ అని లేదు... ఆఖరికి ఆన్‌లైన్‌లోనూ ఆమెకు మనశ్శాంతి దొరకడంలేదు. అవును... భారత్‌లో ఇంటర్నెట్ వినియోగించే మహిళల్లో 40 శాతం మంది ట్రోలింగ్ బారిన పడుతున్నారు. అసంబద్ధ వ్యాఖ్యలతో పోకిరీలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్టు తాజా అధ్యయనంలో తేలింది.

ఇక మహిళల స్మార్ట్ ఫోన్ల వినియోగం, తద్వారా ఇంటర్నెట్ వాడకమూ విపరీతంగా పెరిగాయి. 60 శాతం మంది మొబైల్ ఫోన్‌లోనే ఇంటర్నెట్ వాడుతున్నారు. ప్రధాన మెట్రో నగరాల్లో అయితే ఇది 75 శాతం! ప్రస్తుతం మెట్రో నగరాల్లోని 44 శాతం మంది మహిళలు ఇంగ్లిష్ కంటెంట్ చూస్తున్నారు. ఉద్యోగాలకు సిద్ధమయ్యే క్రమంలో నైపుణ్యం పెంచుకొంటున్నారు. ఇందులో 18- 23 సంవత్సరాల అమ్మాయిలే అధికమని 'వెరిజోన్ మీడియా' తన నివేదికలో పేర్కొంది. వీరంతా విద్య, కెరీర్, నైపుణ్య శిక్షణల కోసం ఆన్‌లైన్‌లోకి వస్తున్నారట. 29-35 సంవత్సరాల మధ్యవారు శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణ వీడియోలు ఎక్కువ చూస్తున్నారట. మహిళా యూజర్లు సాయంత్రం 3- రాత్రి 9 గంటల మధ్య ఎక్కువ. 12 నగరాల్లో 1,300 మంది నుంచి సేకరించిన వివరాలతో ఈ నివేదిక రూపొందించారు.

### సర్వేలోని మరికొన్ని విశేషాలివి...

● భారత్‌లోని మహిళలు రోజుకు సగటున 145 నిమిషాలు స్మార్ట్‌ఫోన్‌లో ఇంటర్నెట్ చూస్తున్నారట! ప్రథమ శ్రేణి నగరాల్లో ఇది మరింత ఎక్కువ. ● 80 శాతం మంది ఆడవారు ఇంగ్లిష్‌తో పాటు ప్రాంతీయ భాషల సమాచారాన్నీ నెట్‌లో వెతుకుతున్నారు. ● ఆన్‌లైన్‌లో మహిళలు వీడియోలే ఎక్కువగా చూస్తున్నారు. వీటిల్లో కెరీర్, సామాజిక సమస్యలు, వ్యక్తిగత శ్రద్ధకు సంబంధించిన సమాచారం ఫాలో అవుతున్నవారే అధికం. ● 35 ఏళ్ల పైబడిన మహిళలు ఆరోగ్యం, ఫిట్‌నెస్ అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
# దిక్సూచి
విజయవాడ ● సోమవారం 23 డిసెంబరు 2019
6 diksuchi@andhrajyothy.com



విశేషం



## ఏడు నెలలకే మేయర్ పదవి

వయస్సు ఏడు నెలలు... ఇంకా బుడి బుడి అడుగులు కూడా వేయడం లేదు. కానీ ఏకంగా మేయర్ కుర్చీలో కూర్చున్నాడు. టెక్సాస్ నగరంలోని గ్రిమ్స్ కౌంటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం కూడా చేశాడు. ఆ పసివాడి పేరు విలియం చార్లెస్ మెక్‌మిలాన్. అమెరికాలో ఇప్పుడు అతడొక సంచలనం. అమెరికా చరిత్రలోనే అతి చిన్న వయసులో మేయర్‌గా నియమితుడైన వ్యక్తిగా చార్లెస్ మెక్‌మిలాన్ రికార్డు సృష్టించాడు. ఇంతకీ ఏడు నెలల పసికూన మేయర్ ఎలా అయ్యాడో తెలుసా! మున్సిపాలిటీకి నిధులు సమీకరించేందుకు అక్కడి 'వైట్‌హాల్ వాలంటీర్ ఫైర్ డిపార్ట్‌మెంట్' మేయర్ పదవికి వేలంపాట నిర్వహిస్తుంది. దీంట్లో ఎవరు ఎక్కువ చెల్లిస్తే వారు ఒక సంవత్సరం పాటు మేయర్ పదవిలో కొనసాగే అవకాశం ఉంటుంది. అందులో భాగంగానే అక్టోబర్ 20న మేయర్ పదవి కోసం వేలం పాట నిర్వహించారు. టెక్సాస్‌కు చెందిన కాడ్ మెక్‌మిలన్, నాన్సీ దంపతులు తమ ఏడు నెలల దత్తపుత్రుడు చార్లెస్‌ను ఆ పదవిలో చూడాలనుకున్నారు. వేలంలో ఎక్కువ పాట పాడి ఆ అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ప్రమాణ స్వీకారం రోజున చార్లెస్‌ను ఎత్తుకొని అతడి తల్లితండ్రులు వేదిక మీదకు రావడంతోనే హర్షధ్వానాలు మిన్నంటాయి. అతడి పదవీ ప్రమాణ స్వీకారోత్సవ వేడుకకు 150 మంది హాజరయ్యారు.













### డైలీ సుడోకు -231

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | 9 | 5 |
| | | | 1 | 7 | | 2 | | |
| | 4 | | | 2 | | | 6 | 7 |
| 3 | | | 7 | 4 | | 8 | | |
| | | 5 | 8 | | 3 | 6 | | |
| | | 2 | | 5 | 9 | | | 1 |
| 6 | 5 | | | 9 | | | 1 | |
| | | 4 | | 6 | 8 | | | |
| 9 | 2 | | | | | | | |

**సుడోకు - 230 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 6 | 9 | 5 | 2 | 8 | 3 | 1 | 7 |
| 2 | 5 | 7 | 6 | 3 | 1 | 9 | 8 | 4 |
| 1 | 3 | 8 | 9 | 4 | 7 | 2 | 5 | 6 |
| 9 | 4 | 6 | 2 | 8 | 3 | 5 | 7 | 1 |
| 7 | 8 | 5 | 4 | 1 | 9 | 6 | 3 | 2 |
| 3 | 2 | 1 | 7 | 6 | 5 | 4 | 9 | 8 |
| 8 | 9 | 2 | 3 | 7 | 6 | 1 | 4 | 5 |
| 6 | 1 | 3 | 8 | 5 | 4 | 7 | 2 | 9 |
| 5 | 7 | 4 | 1 | 9 | 2 | 8 | 6 | 3 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

# ఫ్యాషన్ కోర్సులకు చిరునామా..
# నిఫ్ట్

**ఆధునిక ప్రపంచం ఫ్యాషన్ మయం. అందంగా, ఆకర్షణీయంగా కనిపించడానికి చేసే ప్రయత్నాలెన్నో. బ్రాండెడ్ దుస్తులు, వాటికి ధీటుగా యాక్సెసరీలు హల్‌చల్ చేస్తున్న తరుణంలో ఫ్యాషన్ ప్రస్తావన లేని సందర్భం ఉండదంటే అతిశయోక్తి కాదు. సినిమా స్టార్ల మాదిరిగా ఫ్యాషన్‌కు ఐకాన్‌గా కనిపించాలన్నా స్టయిల్‌గా స్మార్ట్‌గా మెరవాలన్నా కీలక పాత్ర ఫ్యాషన్ డిజైనర్లదే. సెలెబ్రిటీలను సైతం తమ వైపు తిప్పుకోవడం వారికే సాధ్యం. ఇటువంటి ఫ్యాషన్ డిజైనింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి చక్కని మార్గం ఫ్యాషన్ కోర్సులు. ఈ కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అందిస్తూ ఫ్యాషన్ ప్రపంచానికే చిరునామాగా నిలుస్తోన్న సంస్థ నిఫ్ట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ). 2020-21 విద్యా సంవత్సరానికి నిఫ్ట్ అడ్మిషన్ షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సంబంధిత వివరాలను తెలుసుకుందాం..**



ఫ్యాషన్ ప్రపంచంలో తమకంటూ ఒక స్థానం సంపాదించాలకునే ఔత్సాహికులకు చక్కటి వేదిక నిఫ్ట్. దీన్ని 1986లో కేంద్ర వస్త్ర పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించారు. దేశవ్యాప్తంగా 16 నిఫ్ట్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిల్లో సీట్ల సంఖ్య 4297. ఈ క్యాంపస్‌ల ద్వారా ఆరు బ్యాచిలర్, మూడు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను ఆఫర్ చేస్తున్నారు.

### బ్యాచిలర్ కోర్సులు

**బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బీడీఈఎస్)**

- విభాగాలు: యాక్సెసరీ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెదర్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.
- విభాగాల వారీగా సీట్ల సంఖ్య: ఫ్యాషన్ డిజైన్ - 642; లెదర్ డిజైన్ - 168; యాక్సెసరీ డిజైన్ - 600; టెక్స్‌టైల్ డిజైన్ - 558; నిట్‌వేర్ డిజైన్-296; ఫ్యాషన్ కమ్యూనికేషన్ - 598.
- వ్యవధి: నాలుగేళ్లు
- అర్హత: 10+2

**బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్‌టెక్) - అపెరల్ ప్రొడక్షన్**

- సీట్ల సంఖ్య: 518
- వ్యవధి: నాలుగేళ్లు
- అర్హత: 10+2 (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో)
- వయసు: బ్యాచిలర్ విభాగంలోని అన్ని కోర్సులకు వయోపరిమితి 23 ఏళ్లు

**పీజీ కోర్సులు**

- మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఎండీఈఎస్)
- సీట్ల సంఖ్య: 171
- వ్యవధి: రెండేళ్లు
- అర్హత: డిగ్రీ లేదా నిఫ్ట్ / నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (నిడ్) నుంచి మూడేళ్ల డిప్లొమా.

**మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ (ఎంఎఫ్ఎం)**

- సీట్ల సంఖ్య: 606
- వ్యవధి: రెండేళ్లు
- అర్హత: డిగ్రీ లేదా నిఫ్ట్ / నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (నిడ్) నుంచి మూడేళ్ల డిప్లొమా.

**మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎంఎఫ్‌టెక్)**

- సీట్ల సంఖ్య: 140
- వ్యవధి: రెండేళ్లు
- అర్హత: నిఫ్ట్ నుంచి బీఎఫ్‌టెక్ లేదా బీఈ / బీటెక్.

### ప్రవేశం

ఎంచుకున్న కోర్సును బట్టి ప్రవేశ ప్రక్రియ వేర్వేరుగా ఉంటుంది. ఇందులో భాగంగా క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్, జనరల్ ఎబిలిటీ టెస్ట్, సిట్యూయేషన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

### బ్యాచిలర్ కోర్సులకు

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షల్లో క్యాట్, గ్యాట్, సిట్యూయేషన్ టెస్ట్‌లు ఉంటాయి. ఇందులో క్యాట్‌కు 50 శాతం, గ్యాట్‌కు 30 శాతం, సిట్యూయేషన్ టెస్ట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తారు. క్యాట్‌లో సమాధానాలను రాయడానికి మూడు గంటల సమయం ఉంటుంది. గ్యాట్‌ను ఇంగ్లీష్‌లో నిర్వహిస్తారు. సమాధానాలను గుర్తించడానికి రెండు గంటల సమయం కేటాయిస్తారు. ఇందులో విభాగాల వారీగా ఇచ్చే ప్రశ్నలు.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ (20 ప్రశ్నలు), కమ్యూనికేషన్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), ఇంగ్లీష్ కాంప్రెహెన్షన్ (25 ప్రశ్నలు), అనలిటికల్ ఎబిలిటీ (15 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ (15 ప్రశ్నలు).

- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశం కోరుకునే అభ్యర్థులకు జనరల్ ఎబిలిటీ టెస్ట్ (గ్యాట్) మాత్రమే ఉంటుంది. సమాధానాలను గుర్తించడానికి మూడు గంటల సమయం కేటాయిస్తారు. ఇందులో విభాగాల వారీగా ఇచ్చే ప్రశ్నలు.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ (30 ప్రశ్నలు), కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లీష్ కాంప్రెహెన్షన్ (45 ప్రశ్నలు), అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ (25 ప్రశ్నలు), కేస్ స్టడీ (25 ప్రశ్నలు).

### నోటిఫికేషన్ సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 31, 2019
- రాత పరీక్ష తేదీ: జనవరి 19, 2020
- ఫలితాల వెల్లడి: ఫిబ్రవరి / మార్చి, 2020
- వెబ్‌సైట్: http://nift.ac.in/

### సృజనాత్మకతను పెంచే

విద్యార్థిలో సృజనాత్మకతను పెంచే విధంగా నిఫ్ట్‌లో బోధన ఉంటుంది. తరగతి గది బోధనతోపాటు ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ ట్రిప్, ప్రాజెక్ట్ వర్క్స్ చేపడతారు. ఇండస్ట్రీ కనెక్ట్, గ్లోబల్ కనెక్ట్, గ్రాస్‌రూట్ కనెక్ట్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

### ఎలెక్టివ్స్ కూడా

మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యం, వృత్తిపరంగా మరింత మెరుగుదలకు కోర్సు వర్క్‌తోపాటు బ్యాచిలర్, మాస్టర్స్ విద్యార్థులకు కొన్ని జనరల్ ఎలెక్టివ్స్‌ను కూడా బోధిస్తారు. అవి.. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్, ప్రొఫెషనల్ ఎథిక్స్ అండ్ వాల్యూస్, క్రిటికల్ థింకింగ్, సైకాలజీ, ఎకానమీ, ఇండియన్ హిస్టరీ, నేచర్ / హిస్టారికల్ వాక్ తదితరాలు. ఇందులో కొన్ని అంశాలు కోర్సులో భాగంగా తప్పనిసరిగా ఉంటాయి. మిగతావి ఐచ్ఛికం.

### ఎఫ్‌టీఐతో భాగస్వామ్యం

నిఫ్ట్‌కు ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎఫ్ఐటీ) - న్యూయార్క్‌తో భాగస్వామ్యం కూడా ఉంది. దీని ప్రకారం ప్రతిభగల విద్యార్థులకు నిఫ్ట్-ఎఫ్ఐటీ నుంచి డ్యూయల్ డిగ్రీ చేసే అవకాశం ఉంటుంది. దీనికి నిఫ్ట్‌లో రెండేళ్లు, ఎఫ్ఐటీలో ఏడాది పాటు విద్యనభ్యసించాలి. ఆ తరవాత నిఫ్ట్‌లో తిరిగి తమ చదువును కొనసాగించవచ్చు. అయితే ఈ ప్రోగ్రామ్ కోసం మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు.

### హైదరాబాద్ క్యాంపస్

**సీట్ల సంఖ్య 294**

కోర్సుల వారీగా సీట్ల సంఖ్య

**బ్యాచిలర్ విభాగం**

| కోర్సు | సీట్ల సంఖ్య |
|---|---|
| ఫ్యాషన్ డిజైన్ | 42 |
| నిట్‌వేర్ డిజైన్ | 42 |
| యాక్సెసరీ డిజైన్ | 42 |
| టెక్స్‌టైల్ డిజైన్ | 42 |
| ఫ్యాషన్ కమ్యూనికేషన్ | 42 |
| అపెరల్ ప్రొడక్షన్ | 42 |
| **మాస్టర్స్ విభాగం** | |
| మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ | 42 |

వెబ్‌సైట్: http://www.nift.ac.in/hyderabad/



### మాస్టర్స్ ఇలా

మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశం కోరుకునే వారికి క్యాట్, గ్యాట్, గ్రూప్ డిస్కషన్ / పర్సనల్ ఇంటర్వ్యూ విభాగాలు ఉంటాయి. ఇందులో క్యాట్‌కు 40 శాతం, గ్యాట్‌కు 30 శాతం, గ్రూప్ డిస్కషన్ / పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు. క్యాట్‌లో సమాధానాలను రాయడానికి మూడు గంటల సమయం ఉంటుంది. గ్యాట్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో నిర్వహిస్తారు. సమాధానాలను గుర్తించడానికి రెండు గంటల సమయం కేటాయిస్తారు. ఇందులో విభాగాల వారీగా ఇచ్చే ప్రశ్నలు.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ (20 ప్రశ్నలు), కమ్యూనికేషన్ ఎబిలిటీ (30 ప్రశ్నలు), ఇంగ్లీష్ కాంప్రెహెన్షన్ (30 ప్రశ్నలు), అనలిటికల్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ (15 ప్రశ్నలు).

- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే వారికి గ్యాట్, గ్రూప్ డిస్కషన్ / పర్సనల్ ఇంటర్వ్యూ విభాగాలు ఉంటాయి. ఇందులో గ్యాట్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్ / పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు. గ్యాట్‌లో సమాధానాలను గుర్తించడానికి మూడు గంటల సమయం కేటాయిస్తారు. పరీక్ష విధానం ఒక్కటే అయినప్పటికీ ఎంచుకున్న కోర్సును బట్టి ప్రశ్నల సంఖ్యలో తేడా ఉంటుంది.
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఉండే గ్యాట్‌లో విభాగాల వారీగా ఇచ్చే ప్రశ్నలు.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ (10 ప్రశ్నలు), కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లీష్ కాంప్రెహెన్షన్ (50 ప్రశ్నలు), అనలిటికల్ & లాజికల్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ (25 ప్రశ్నలు), కేస్ స్టడీ (40 ప్రశ్నలు).
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి సంబంధించి ఉండే గ్యాట్‌లో విభాగాల వారీగా ఇచ్చే ప్రశ్నలు.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ (30 ప్రశ్నలు), కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లీష్ కాంప్రెహెన్షన్ (45 ప్రశ్నలు), అనలిటికల్ & లాజికల్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ (25 ప్రశ్నలు), కేస్ స్టడీ (25 ప్రశ్నలు).



## జాబ్ కార్నర్

### ప్రొఫెసర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) - విశాఖపట్నం, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం.
- ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, సెమినార్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20, 2020.
- వెబ్‌సైట్: www.iimv.ac.in/

### మేనేజర్

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) - పుణె, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- మొత్తం ఖాళీలు: 14
- పోస్టుల వారీగా ఖాళీలు: జాయింట్ / అసోసియేట్ డైరెక్టర్-2, మేనేజర్-5, సీనియర్ హెచ్ఆర్‌డీ ఆఫీసర్-2, సీనియర్ లీగల్ ఆఫీసర్-2, పర్చేజ్ ఆఫీసర్-1, ఫైనాన్స్ ఆఫీసర్-2.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్ / ఎంసీఏ, ఎంబీఏ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, సీఏ, తత్సమానం అనుభవం.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 12, 2020.
- వెబ్‌సైట్: https://cdac.in/

### ఇంజనీర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) - రూర్కీ (ఉత్తరాఖండ్) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- మొత్తం ఖాళీలు: 10
- భర్తీ చేసే పోస్టులు: రిజిస్ట్రార్, ఇంజనీర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్, సైంటిఫిక్ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్-2, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్ లెవల్-1, 2, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 18, 2020.
- వెబ్‌సైట్: www.iitr.ac.in/


2020
జనవరి
JANUARY
రాజానరసింహ
సాధుశేఖర్
JANUARY
1
RELEASE


SHOOTING STARTS SOON
MAHANKALI MOVIES
HAPPY BIRTHDAY
TO OUR HERO
AADI
SAIKUMAR
#AADI 16
PRODUCER : MAHANKALI DIWAKAR
WRITTEN & DIRECTED BY : GB KRISHNA


పడి పడి నవ్వుతుండగా, ప్రతి థియేటర్ లో పండగే...
UV creations
ALLU ARAVIND PRESENTS
GA2 PICTURES
ప్రతిరోజూ పండగే
MARUTHI BUNNY VAS THAMAN S


GOLUGURI RAMAKRISHNA REDDY PRESENTS
విజయభేరి
A GAUTHAM VASUDEV MENON FILM
JAN 1ST 2020 RELEASE
తూటా
A TALE OF LOVE


viacom 18 STUDIOS
FAMILY ENTERTAINER
BLOCKBUSTER HIT
KARTHI JYOTIKA SATHYARAJ
దొంగ
A JEETHU JOSEPH FILM


'DIL' RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
DECEMBER 25TH RELEASE
U r my heart beat
ఇద్దరి లోకం ఒకటే
SHIRISH MICKEY J MEYER G R KRISHNA
HARSHITH REDDY - BEKKEM VENUGOPAL (GOPI) SAMEER REDDY ABBURI RAVI
TAMMI RAJU BANDI RATNA KUMAR RAMANA VANKA STUNT SIVA
G ANUHYA REDDY BHANU VIJAY
U/A


SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
THAMAN S VIVEK KUCHIBHOTLA PRASAD MURELLA
వెంకీ మామ
BEST FILM IN TOWN

# ప్రభుత్వ అప్పీల్‌పై రిలయన్స్ గుస్సా

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టులో ప్రభుత్వం ఫైల్ చేసిన పిటిషన్‌పై రిలయన్స్ ఇండస్ట్రీస్ మండిపడింది. పన్నా-ముక్తా, తపతి ఆయిల్ అండ్ గ్యాస్ క్షేత్రాలపై మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్ తీర్పుపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం ఈ పిటిషన్ ఫైల్ చేయడాన్ని తప్పుబట్టింది. 2016లో ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ప్రకారం 350 కోట్ల పరిహారం చెల్లించే వరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈక్విటీలో 15 శాతం వాటాను సౌదీఅరామ్కో కంపెనీకి అమ్మడాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం హైకోర్టును కోరింది. తుది తీర్పు రాకుండానే ప్రభుత్వం తనంతట తాను ఈ మొత్తాన్ని ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించింది. ఇది విధానాలను దుర్వినియోగం చేయడమే అవుతుందని విమర్శించింది.

# 10 కోట్ల స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి లక్ష్యం

## మేక్ ఇన్ ఇండియాపై ఒప్పో దృష్టి

### భారత్‌లో అపార అవకాశాలపై గురి



న్యూఢిల్లీ: భారత్‌లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మేక్ ఇన్ ఇండియా పథకంపై చైనా టెక్ దిగ్గజ సంస్థ ఒప్పో దృష్టిపెట్టింది. భారత్‌లోని యువతరాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రణాళికలు, ఉత్పత్తులను రూపొందించుకుంటోంది. భారత ప్రజల జీవనశైలికి తగినట్టుగా రూపకల్పనతోపాటు ఇక్కడి స్టార్టప్‌లకు సహకారం అందించేందుకు సన్నద్ధమవుతోంది. మేక్ ఇన్ ఇండియానే ప్రధాన ఆధారంగా చేసుకుని భారత్‌లో సంస్థను పరుగులు పెట్టించాలని భావిస్తోంది. వచ్చే ఏడాది ముగిసేసరికి పది కోట్ల స్మార్ట్‌ఫోన్లను భారత్‌లో ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు ఇటీవల ప్రకటించింది. వాటితోపాటు ప్రపంచ స్థాయి సాంకేతికతతో వివిధ ఉత్పత్తుల్ని భారత వినియోగదారులకు అందిస్తామని చెబుతోంది. దేశంలో మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా 5జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)పై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఒప్పో వైస్ ప్రెసిడెంట్ (ఆర్‌డీ) తస్లీం ఆరిఫ్ తాజాగా ప్రకటించారు. 5జీ ఉత్పత్తులకు భారత్ ఒక నమ్మకమైన మార్కెట్‌గా ఆయన అభివర్ణించారు. నేషనల్ డిజిటల్ కమ్యూనికేషన్స్ పాలసీ (ఎన్‌డీసీపీ) ద్వారా ఇక్కడి ప్రభుత్వం పరిశ్రమలో ఆశావహ పరిస్థితుల్ని కల్పిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తమ ఆర్ అండ్ డీ కేంద్రంలో ఇప్పటికే 5జీపై పరిశోధనలు ప్రారంభించామని, వీలైనంత త్వరలో 5జీ స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టనున్నామని ఆయన వెల్లడించారు. గత కొన్ని నెలలుగా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు తీవ్రంగా మందగించడంతో.. భారీ మార్కెట్ కలిగిన భారత్ పలు సంస్థలకు కీలక మార్కెట్‌గా మారింది.

దేశంలో సుమారు 50 కోట్ల మంది ఇంకా ఫీచర్‌ఫోన్లనే వాడుతున్నారని అంచనా. అందుకే ఇక్కడున్న భారీ అవకాశాలను ఒడిసిపట్టాలని ఫోన్ల తయారీ సంస్థలు భావిస్తున్నాయి. ఐడీసీ సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో భారత మార్కెట్లో ఒప్పో 11.8 శాతం వాటాను దక్కించుకోగలిగింది. గత ఏడాదితో పోలిస్తే. 92.3 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం.

# గ్లెన్‌మార్క్ రానిటిడిన్ మాత్రల రీకాల్

Glenmark
A new way for a new world

న్యూఢిల్లీ: కడుపులో పుళ్లు, అల్సర్లకు వినియోగించే రానిటిడిన్ మాత్రల్ని రీకాల్ చేసినట్లు అమెరికా ఔషధ తయారీ సంస్థ గ్లెన్‌మార్క్ ప్రకటించింది. వాటిలో అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) సూచించిన పరిమితికి మించి ఎన్-నైట్రోసోడిమిథైలమిన్ (ఎన్‌డీఎంఏ) ఉన్నట్లు అనుమానాలుండటం తోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. కాలుష్యంతో వ్యాప్తి చెందే ఎన్‌డీఎంఏను కేన్సర్ కారకంగా పరిశోధకులు గుర్తించడం గమనార్హం. కాగా.. ఇప్పటి వరకూ ఈ మాత్రల వల్ల ఎలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని.. ముందుజాగ్రత్తగా ఈ చర్యను తీసుకున్నామని గ్లెన్‌మార్క్ వివరించింది. ఇప్పటికే ఈ మాత్రల్ని కొనుగోలు చేసిన వినియోగదారులు వాటిని వాడరాదని, ఒకవేళ వాడిన పక్షంలో వైద్యుల్ని సంప్రదించాలని తెలిపింది. రికాల్ చేసిన మొత్తం 928 రానిటిడిన్ లాట్స్‌లో 16 లాట్స్ గోవాలోని గ్లెన్‌మార్క్ పరిశ్రమలో ఉత్పత్తి కాగా, 912 లాట్స్‌ను పుదుచ్చేరిలోని స్ట్రైడ్స్ ఫార్మా సైన్స్ తయారుచేసింది.

# ఏడాదిలో రూ.1.33 లక్షల కోట్లు




## మందగమనంలోనూ ఎఫ్‌పీఐల జోరు

### ఆరేళ్ల గరిష్ఠ స్థాయిలో ఈక్విటీ కొనుగోళ్లు

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ నీరసిస్తోంది. సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అయినా విదేశీ పోర్టుఫోలియో సంస్థ(ఎఫ్‌పీఐ)లకు భారత క్యాపిటల్ మార్కెట్‌పై ఏ మాత్రం నమ్మకం తగ్గలేదు. వేల కోట్ల పెట్టుబడులు కుమ్మరిస్తున్నాయి. ఈ సంస్థలు ఈ సంవత్సరం ఇప్పటి వరకు భారత మార్కెట్‌లో రూ.1.33 లక్షల కోట్ల నికర పెట్టుబడులు పెట్టాయి. ఇందులో ఈక్విటీ మార్కెట్లోనే రూ.97,250 కోట్లు మదుపు చేశాయి. ఎఫ్‌పీఐలు గత ఆరేళ్లలో ఎన్నడూ భారత ఈక్విటీ మార్కెట్‌లో ఇంత భారీ స్థాయిలో పెట్టుబడి పెట్టలేదు. ఎఫ్‌పీఐల పెట్టుబడుల జోరుతోనే, ఆర్థిక వ్యవస్థ మందగమనంలోనూ దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు రేసు గుర్రాల్లా పరుగెడుతున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

#### పెట్టుబడుల్లో ఆటుపోట్లు

నిజానికి ఈ సంవత్సరం జనవరిలో ఎఫ్‌పీఐలు భారత ఈక్విటీ మార్కెట్‌లో రూ.4,200 కోట్ల నికర అమ్మకాలు జరిపాయి. మళ్లీ ఫిబ్రవరి నుంచి జూన్ వరకు నికర కొనుగోళ్లకు దిగాయి. సూపర్ రిచ్ టాక్స్ భయంతో జూలై-ఆగస్టులో రూ.30,000 కోట్ల నికర అమ్మకాలు జరిపాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధ భయాలు, అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు మందగించడం ఇందుకు దోహదం చేశాయి. మళ్లీ సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు ఎఫ్‌పీఐల కొనుగోళ్ల జోరు కొనసాగుతోంది.

#### ఎందుకంటే?

సూపర్ రిచ్‌పై బడ్జెట్‌లో ప్రతిపాదించిన సెస్సును ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. వృద్ధి రేటును గాడిలో పెట్టేందుకు కార్పొరేట్ టాక్స్‌ను పది శాతం వరకు తగ్గించింది. కష్టాల్లో ఉన్న రియల్టీ, ఎన్‌బీఎఫ్‌సీలను ఆదుకునేందుకు ప్రత్యేక 'సహాయ' ప్యాకేజీలు ప్రకటించింది. అవసరాన్ని బట్టి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. వీటికి తోడు ఆర్‌బీఐ వరుసగా అయిదు విడతలుగా కీలక వడ్డీ రేట్లు 1.35 శాతం తగ్గించింది. కొన్ని ఇబ్బందులున్నా అమెరికా, ఐరోపా, జపాన్‌తో పోలిస్తే మన స్టాక్ మార్కెట్ ఈ సంస్థలకు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇవన్నీ ఎఫ్‌పీఐలకు మళ్లీ భారత మార్కెట్‌పై గురి కుదిరేలా చేశాయి.

#### డెట్ మార్కెట్లో రూ.27,000 కోట్లు

రుణ పత్రాల మార్కెట్‌లోనూ ఎఫ్‌పీఐలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ మార్కెట్‌లో ఈ సంవత్సరం ఇప్పటి వరకు రూ.27,000 కోట్ల నికర పెట్టుబడులు పెట్టాయి. మరో రూ.9,000 కోట్లు హైబ్రిడ్ ఫండ్స్‌లో మదుపు చేశాయి. ఇవే సంస్థలు గత ఏడాది (2018) భారత డెట్ మార్కెట్ నుంచి రూ.48,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీల రంగంలో సంక్షోభం లేకపోతే ఎఫ్‌పీఐలు ఈ సంవత్సరం డెట్ మార్కెట్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టి ఉండేవని మార్కెట్ వర్గాల అంచనా

#### ఈ షేర్లలోనే పెట్టుబడులు

బ్యాంకులు, ఆయిల్ అండ్ గ్యాస్, బీమా కంపెనీల షేర్లలో ఎఫ్‌పీఐలు ఎక్కువగా మదుపు చేస్తున్నాయి. బ్యాంకింగ్ షేర్లలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి ప్రైవేట్ బ్యాంకుల షేర్లను భారీగా కొనుగోలు చేసినట్టు మార్కెట్ వర్గాల అంచనా.



అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక పరిస్థితిపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు ముగిసి వాణిజ్య యుద్ధ భయాలు సద్దుమణిగే వరకు ఈ అనిశ్చితి కొనసాగుతుంది. కాబట్టి 2020లోనూ ఎఫ్‌పీఐల పెట్టుబడుల జోరు కొనసాగవచ్చు.

- ఉమేశ్ మెహతా, రీసెర్చ్ హెడ్, శామ్‌కో సెక్యూరిటీస్



# హైదరాబాద్ మార్కెట్లోకి మెర్సిడెస్ బెంజ్ కొత్త జీఎల్‌సీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా సరికొత్త జీఎల్‌సీ.. హైదరాబాద్ మార్కెట్లోకి వచ్చింది. ఆదివారంనాడిక్కడ జరిగిన కార్యక్రమంలో మెర్సిడెస్ బెంజ్ సిల్వర్ స్టార్ సేల్స్ హెడ్ సాయి హర్ష దీన్ని విడుదల చేశారు. బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఈ కారు అమ్మకాలను ప్రారంభించారు. ఇందులో ఎంబక్స్ టచ్ కంట్రోల్, 10.25 అంగుళాల టచ్ స్క్రీన్, వాయిస్ రికగ్నిషన్ సామర్థ్యంతోపాటు ఆటో పార్క్, మెర్సిడెస్ మీ కనెక్ట్ తదితర అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి. మీ కనెక్ట్‌తో స్మార్ట్‌ఫోన్ ద్వారా కారు పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు, నియంత్రించవచ్చు. ఈ కారు ధర 57.75 లక్షలు (ఎక్స్ షోరూమ్, హైదరాబాద్)

## అవంతి ఫైనాన్స్ నిధుల సేకరణ

ముంబై: రతన్ టాటా, నందన్ నీలేకని ప్రమోట్ చేసిన మైక్రో లోన్ ఎన్‌బీఎఫ్‌సీ అయిన అవంతి ఫైనాన్స్ 3-4 కోట్ల డాలర్లు (రూ.285 కోట్లు) సమీకరించాలనుకుంటోంది. ఇన్వెస్టర్లు, దేశీయ ఆర్థిక సంస్థల నుంచి ఈ సొమ్మును సమీకరించనున్నారు. సంస్థ వృద్ధి కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. బెంగళూరు కేంద్రంగా ఉన్న అవంతి ఫైనాన్స్ రెండేళ్ల క్రితం ప్రారంభమైంది. ఇప్పటికే ఈ కంపెనీలో రతన్ టాటా, నందన్ నీలేకనీ రూ.50 కోట్ల చొప్పున పెట్టుబడి పెట్టారు. కాగా వచ్చే మార్చి-ఏప్రిల్ నాటికి రూ.285 కోట్ల వరకు నిధులను సమీకరించాలనుకుంటున్నట్టు అవంతి ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాహుల్ గుప్తా తెలిపారు.

# కన్సాలిడేషన్‌కే ఆస్కారం

▸▸ వారంలో నాలుగు రోజులే ట్రేడింగ్

న్యూఢిల్లీ: ఒక పక్క క్రిస్మస్ సెలవు దినం కావడం వల్ల నాలుగే ట్రేడింగ్ దినాలుండడం, మరో పక్క మార్కెట్‌ను ప్రభావితం చేసే చెప్పుకోదగ్గ పరిణామాలేవీ లేకపోవడం వల్ల ఈ వారంలో మార్కెట్ కన్సాలిడేషన్ బాట పట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటివరకు సాగిన వేగవంతమైన ర్యాలీ వల్ల కూడా కొంత అప్రమత్తత పాటించడం తప్పనిసరి అని, స్వల్పకాలంలో కన్సాలిడేషన్ ఉంటుందనేందుకు సంకేతమని పరిశీలకులంటున్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం మార్కెట్లకు సెలవు. కాగా డిసెంబరు ఫ్యూచర్స్ కాంట్రాక్టులు గురువారం ముగియనున్నాయి. ఈ కారణం వల్ల స్వల్పకాలిక కన్సాలిడేషన్‌ను తోసి పుచ్చలేమని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. ఏడాది చివరి వారం సైతం కావడం వల్ల స్టాక్ ఆధారిత కదలికలకే ఆస్కారం అధికంగా ఉందని శామ్‌కో సెక్యూరిటీస్ వ్యవస్థాపక సీఈఓ జిమీత్ మోదీ అంటున్నారు. ఇతర అంశాల విషయానికి వస్తే క్రూడాయిల్ ధరలు, రూపాయి కదలికలు, ఎఫ్‌పీఐల పెట్టుబడి ధోరణులను దేశీయ మార్కెట్లు నిశితంగా పరిశీలించే ఆస్కారం ఉన్నట్టు చెబుతున్నారు.

## సెన్సెక్స్ నుంచి టాటా మోటార్స్ ఔట్

బీఎస్ఈ సెన్సెక్స్ నుంచి టాటా మోటార్స్, యెస్ బ్యాంక్, వేదాంతలను తొలగించనున్నారు. వాటి స్థానాన్ని అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, నెస్లే ఇండియా భర్తీ చేస్తాయి. ఈ కారణంగా ఫండ్ మేనేజర్లు కొన్ని సర్దుబాట్లు చేసుకునే ఆస్కారం ఉందంటున్నారు.

## టీసీఎస్‌దే హవా

గత వారంలో సాగిన ర్యాలీలో దేశంలోని పది అత్యంత విలువైన కంపెనీల్లో 8 కంపెనీల మార్కెట్ విలువ రూ.1.13 లక్షల కోట్లు పెరిగింది. ఇందులో భారీగా లాభపడిన కంపెనీగా టీసీఎస్ నిలిచింది. ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లాభపడిన ఇతర కంపెనీల్లో ఉన్నాయి. హెచ్‌యూఎల్, ఐటీసీ మాత్రమే నష్టాల్లో ముగిశాయి. టీసీఎస్ మార్కెట్ విలువ రూ.56,604.72 కోట్లు పెరిగి రూ.8,33,986.26 కోట్లకు చేరింది.

# మళ్లీ తగ్గిన భారత్ ఉక్కు ఉత్పత్తి

▸▸ గత ఏడాది కంటే 2.8 శాతం తక్కువ

న్యూఢిల్లీ: భారత ఉక్కు ఉత్పత్తి వరుసగా రెండో నెలలోనూ తక్కువగానే నమోదైంది. గత ఏడాది నవంబరులో 9,192 మిలియన్ టన్నుల (ఎంటీ) ఉక్కు ఉత్పత్తి కాగా.. ఈ నవంబరులో అది 2.8 శాతం తగ్గి 8.934 ఎంటీ మాత్రమే ఉత్పత్తి అయిందని ప్రపంచ ఉక్కు అసోసియేషన్ నివేదిక పేర్కొంది. ఈ ఏడాది అక్టోబరులో కూడా.. గత ఏడాదితో పోలిస్తే 3.4శాతం ఉత్పత్తి తగ్గిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉక్కు ఉత్పత్తి సైతం 1 శాతం తగ్గుదలను నమోదు చేసింది. అయితే.. ప్రపంచంలోనే అత్యధికంగా ఉక్కును ఉత్పత్తి చేసే చైనాలో మాత్రం.. ఇది మరింత పెరగడం గమనార్హం. గత ఏడాది నవంబరుతో పోలిస్తే చైనా ఉక్కు ఉత్పత్తి 4శాతం పెరిగి 80.287 ఎంటీ నమోదు చేసింది.

# బొమ్మల దిగుమతి నిబంధనలు కఠినం



న్యూఢిల్లీ: మన దేశంలోకి దిగుమతి చేసుకునే బొమ్మల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు నిబంధనల్ని మరింత కఠినతరం చేయనున్నట్లు ప్రకటించింది. తక్కువ నాణ్యత కలిగిన బొమ్మలు దేశీయ మార్కెట్లోకి ప్రవేశించకుండా తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. దిగుమతుల్లోని నమూనాలను సేకరించి ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన లాబ్స్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తామని, నాణ్యత లేనట్టుగా తేలితే.. ఆ దిగుమతికి సంబంధించిన సరుకులన్నింటినీ వెనక్కి పంపడమో లేక నాశనం చేయడమో జరుగుతుందని వాణిజ్య శాఖ స్పష్టం చేసింది. భారత నాణ్యతా మండలి చేసిన అధ్యయనం మేరకు ఈ చర్యల్ని చేపడుతున్నట్లు పేర్కొంది.

ఆ అధ్యయనం ప్రకారం.. దాదాపు 67 శాతం బొమ్మలు ఏమాత్రం నాణ్యత లేకుండా దిగుమతి అవుతున్నాయని తేలింది. 30శాతం ప్లాస్టిక్ బొమ్మల్లో పరిమితికి మించి అనవసర లోహాలు ఉన్నట్లు తేల్చిచెప్పింది. భారత్‌లో బొమ్మల్లో 85 శాతం దిగుమతి చేసుకున్నవే కాగా, వీటిలో అధికశాతం చైనా నుంచే దిగుమతి అవుతుండటం గమనార్హం.

## ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 22వ తేదీకి.. | | విజయవాడ | 452 |
| హైదరాబాద్ | 415 | విశాఖపట్నం | 470 |
| 23వ తేదీకి.. | | వరంగల్ | 418 |
| చిత్తూరు | 438 | డజను గుడ్లు రూ. | 66 |
| గోదావరి | 452 | | |

## ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 93 | విజయవాడ | 98 |
| వరంగల్ | 93 | గుంటూరు | 98 |
| మహబూబ్‌నగర్ | 93 | ఒంగోలు | 100 |
| కరీంనగర్ | 93 | చిత్తూరు | 86 |
| కర్నూలు | 93 | నెల్లూరు | 86 |
| విశాఖపట్నం | 102 | అనంతపురం | 82 |
| గోదావరి | 97 | | |

టెక్ వ్యూ

# కరెక్షన్‌కు ఆస్కారం



వి సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం పాజిటివ్‌గా ప్రారంభమై అప్‌ట్రెండ్‌ను వారం అంతా కొనసాగించింది. చివరికి 200 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయిలో 12270 వద్ద క్లోజయింది. గత వారంలో అంతకు ముందు నమోదైన చారిత్రక గరిష్ఠ స్థాయిలన్నింటినీ ఛేదించుకుంటూ పోయింది. మూడు వారాల పాటు 12100 పాయింట్ల వద్ద సాగిన సైడ్‌వేస్ ధోరణికి తెర దించి బ్రేకౌట్ సాధించడం, బలమైన ర్యాలీలో దూసుకుపోవడం వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. మరోసారి ఓవర్‌బాట్ స్థితిలోకి కూడా ప్రవేశిస్తున్నందువల్ల కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. నెలవారీ చార్టుల్లో చూసినా 10650 నుంచి గత నాలుగు నెలల కాలంలో మంచి ర్యాలీ సాధించి మరో కొత్త గరిష్ఠ స్థాయిలకు చేరింది. కొంత కాలంగా కీలక అవరోధంగా ఉన్న 12150 ఇప్పుడు మద్దతు స్థాయిగా మారింది.

ట్రెండ్‌లో భద్రత కోసం ఇప్పుడు రాబోయే కరెక్షన్‌లో కూడా ఈ మద్దతు స్థాయి కన్నా దిగజారకుండా నిలదొక్కుకోవాలి. విఫలమైతే మళ్లీ కరెక్షన్ ముప్పు ఏర్పడవచ్చు. అలాగే ముందు 12300 వద్ద ఎదుర్కొనబోయే పరీక్షలో కూడా ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

**బుల్లిష్ స్థాయిలు:** సానుకూల ట్రెండ్‌ను కొనసాగించినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం 12300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలు 12400, 12500. ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో ముందున్న నిరోధాలేవి అన్నది చెప్పడం సాధ్యం కాదు. అన్నీ మానసిక అవధులే.



**బేరిష్ స్థాయిలు:** పుల్‌బ్యాక్ కరెక్షన్‌లో పడినా గతంలో టాప్‌గా ఉండి ఇప్పుడు మద్దతు స్థాయి అయిన 12150 కన్నా పైన తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. అంతకన్నా దిగజారితే మాత్రం స్వల్పకాలిక బలహీనతలో పడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 12000. ఈ నెల 13న ఏర్పడిన ఈ బాటమ్ కన్నా దిగజారితే మరింత కరెక్షన్ ఏర్పడే ఆస్కారం ఉంది.

**బ్యాంక్ నిఫ్టీ:** మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించినట్టయితే ప్రధాన మానసిక అవధి, ప్రధాన నిరోధం 32500 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

**స్వల్పకాలిక వ్యూహం:** 12150 వద్ద గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిలక బై పొజిషన్లు హోల్డ్ చేయవచ్చు.

**పాటర్న్:** 12300 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్", "ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. ఈ రేఖల వద్ద బ్రేకౌట్ ఏర్పడితే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగుతుంది. 12150 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ఏర్పడవచ్చు.

**టైమ్:** గత శుక్రవారం మైనర్ టాప్ ఏర్పడినట్టు కనిపిస్తోంది. ఈ కారణంగా ఇప్పుడు మైనర్ కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. ఈ సూచి ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఏర్పడవచ్చు.

**కంటైనర్ కార్పొరేషన్ (రూ.582) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..**

| | | |
|---|---|---|
| రూ.585 ఎగువన అప్‌ట్రెండ్ | మొదటి నిరోధం రూ.605 | రెండో నిరోధం రూ.630 |
| రూ.570 దిగువన డౌన్‌ట్రెండ్ | మొదటి మద్దతు రూ.550 | రెండో మద్దతు రూ.530 |

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం: | 12300, 12345 |
| మద్దతు: | 12235, 12000 |

www.sundartrends.in

ఆస్ట్రో టెక్

# 12500 పైన ముగిస్తే బుల్లిష్

(డిసెంబరు 23-27 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 12272 (+185)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 12046-12294 పాయింట్ల మధ్యన కదలాడి 185 పాయింట్ల లాభంతో 12272 వద్ద వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా ముగిసింది.

- గత మంగళ, శుక్రవారాల నడుమ (2, 6 తేదీలు) చంద్రుడు కుంభ, మీన రాశుల్లో సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధి 12069-11889. గత వారం టార్గెట్లన్నింటినీ దాటి దూసుకుపోయింది. ఈ కారణంగా ఈ వారం కదలికలు అత్యంత కీలకం కానున్నాయి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 12059, 11826, 11479, 11529 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అన్ని డీఎంఏల కన్నా పైన ఉంది. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైనే ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌ను సూచిస్తోంది. ఈ వారాంతంలో 12500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి : 12500** **బ్రేక్‌డౌన్ స్థాయి : 12050**

**నిరోధ స్థాయిలు :** 12425, 12500 (12350 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు :** 12125, 12050 (12200 దిగువన బేరిష్)

**ఇన్వెస్టర్లకు సూచన...**

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

**గ్రహగతులు**

- తులలోని విశాఖ పాదం 1 నుంచి ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- ధనుస్సులోని మూల పాదం 2-3 మధ్యలో రవి సంచారం
- వృశ్చికంలోని ఆశ్లేష పాదం 2 నుంచి ధనుస్సులోని మూల పాదం 1 మధ్యలో బుధ సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 4 నుంచి తులలోని హస్త పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4 నుంచి ఉత్తరాషాఢ పాదం 1లో వృశ్చిక నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని మూల పాదం 4లో కర్కాటక నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 3లో రాహువు, ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో కేతువు సంచారం

## సాధారణంగా మెరుగు (సోమవారానికి)

**తిథి :** మార్గశిర బహుళ ద్వాదశి; నక్షత్రం : విశాఖ

**అప్రమత్తం :** అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.51**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10.20 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12 గంటల వరకు మెరుగ్గాను, తర్వాత 3.15 వరకు నిలకడగాను ట్రేడయి అనంతరం చివరి వరకు నిస్తేజంగా ఉండవచ్చు.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ఎటిపి కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం :** 12310, 12345
**మద్దతు స్థాయిలు :** 12230, 12195

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

# ఒక రాష్ట్రం.. 3 రాజధానులు

## అమరావతినే కొనసాగించాలి: విద్యార్థి జేఏసీ

విజయవాడ సిటీ, డిసెంబరు 22: "అమరావతినే రాష్ట్ర రాజధానిగా కొనసాగించాలి. ముఖ్యమంత్రి పదవిని కూడా ప్రాంతాల వారీగా కేటాయించాలి" అని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయపాటి జగదీశ్, పీ ఆదిత్యసాయి డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్జీవో హోం వద్ద ఆదివారం ఆందోళన నిర్వహించారు. మూడు రాజధానుల ప్రకటనను నిరసిస్తూ జీఎన్ రావు కమిటీ నమూనా ప్రతులను జేఏసీ నేతలు దహనం చేశారు.





## నిరూపిస్తే భూమి రాసిచ్చేస్తా

▸▸ మాజీ మంత్రి ప్రత్తిపాటి

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): "నా పేరుతో 198 ఎకరాలు ఉన్నాయని పుస్తకం వేశారు. అసెంబ్లీ సాక్షిగా 38 ఎకరాలు రాజధానిలో ఉన్నాయని ప్రకటించారు. నా పేరుతో 3గజాలు చూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం. ఎవడో సురేశ్ నా బినామీ అని అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఆ 38ఎకరాలు నిరూపిస్తే బుగ్గనకే రాసిస్తాను. లేకుంటే ఆయన రాజీనామా చేస్తారా?" అని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సవాల్ విసిరారు. రాజధాని రైతుల నిరసనకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాలు ముఖ్యం కాదని, రాజకీయాలకు అతీతంగా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### ఆ కమిటీకి చట్టబద్ధత లేదు: కొల్లు

"జీఎన్ రావు కమిటీకి చట్టబద్ధత లేదు. సిఫార్సులన్నీ జగన్ చెప్పినట్లే చేశారు. నేరాల్లో గుర్తింపు పొందిన దక్షిణాఫ్రికాను ఆదర్శంగా తీసుకుంటారా?" అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా సీమ, ఉత్తరాంధ్రల్లో కర్మాగారాలు పెట్టాలి. అంతేగాని రాజధాని మారిస్తే ఒరిగేదేమీ లేదు" అని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మూడు రాజధానుల వల్ల పరిపాలన చాలా కష్టమవుతుందన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టడమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకటరావు విమర్శించారు. జీఎన్‌రావు కమిటీ జగన్ చెప్పినట్లు వ్యవహరించిందే తప్ప ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫ్యాక్షన్ విస్తరణే జగన్ పన్నాగం : యనమల

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మూడు రాజధానుల ప్రకటన వెనుక ఫ్యాక్షన్ పాలిటిక్స్‌ను రాష్ట్రం మొత్తం విస్తరించడమే జగన్ పన్నాగమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. మూడు రాజధానుల వికేంద్రీకరణ పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేయాలన్నదే జగన్ ఎజెండా అని, దాని వెనుక అంతర్గతంగా ఫ్యాక్షన్ రాజకీయాలు ఉన్నాయని ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తన ఫ్యాక్షన్ రాజకీయాలను ఉత్తరాంధ్రకు విస్తరిస్తున్నారని మండిపడ్డారు. విశాఖ కేంద్రంగా కొన్ని నెలలుగా వైసీపీ నేతలు చేస్తున్న ఫ్యాక్షన్ పాలిటిక్స్ మూడు రాజధానుల ప్రకటనకు పునాది రాళ్లని ఆరోపించారు. తన తల్లిని ఓడించారనే కక్షతోనే జగన్ ఉత్తరాంధ్రను దాదాగిరి రాజకీయాలకు కేంద్ర బిందువుగా చేయాలని కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు.



తుళ్లూరులో ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు



మందడంలో రైతులతో కలిసి బైఠాయించిన ఆందోళనలో పాల్గొన్న టీడీపీ నేతలు ప్రత్తిపాటి, కొల్లు రవీంద్ర తదితరులు

# మాకు భవిష్యత్ వద్దా!?

## రైతులకు మద్దతుగా విద్యార్థుల పోరుబాట

▸▸ మద్దతు తెలిపిన గుంటూరు వైద్యులు

▸▸ రాజధానిలో ఐదోరోజూ ఆందోళన

▸▸ మండుటెండలోనే మహిళలు, చిన్నారుల నిరసన

▸▸ టెంట్ హౌస్ యజమానులకు పోలీసుల నోటీసులు

గుంటూరు/అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం భూమిలిస్తే ఇప్పుడు మా జీవితాలు అంధకారమవుతున్నాయని అమరావతి రైతులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా రాజధాని పరిధిలోని 29 గ్రామాల ప్రజలు ఆదివారం వరసగా ఐదురోజు నిరసన తెలిపారు. మందడంలో ప్రధాన రహదారిని రైతులు దిగ్బంధించారు. రోడ్డుపై అడ్డంగా పడవను పెట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆ పడవను బలవంతగా పక్కకు తొలగించారు. కాగా, రోడ్డుపై టెంటు వేసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "విభజన అనంతరం చెట్టుకింద పాలన సాగించాల్సి వస్తే పెద్ద మనసుతో మా భూమలు త్యాగంచేశాం. నేడు రాజధాని తరలించే యత్నం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తుంటే మా ఆందోళన తెలియజేయటానికి కనీసం నీడ లేకుండా చేశారు" అంటూ మండిపడ్డారు. రోడ్డుపై టెంటు వేసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై తుళ్లూరు, మందడం రైతులు మండిపడ్డారు. ఇప్పుడు తీసి ఉదయాన్నే వేసుకోండని శనివారం రాత్రి డీఎస్పీ చెప్పారని.. ఇప్పుడు టెంటు వేయనీయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పోలీసులను ఎదిరించి తుళ్లూరు రైతులు టెంట్లు వేసుకోగా, మందండం రైతు మండుటెండలోనే మహిళలు, పిల్లలతో కలిసి నిరసన తెలిపారు. టెంటు ఇస్తే నోటీసులు ఇస్తామని షామియానా వాళ్లను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ.. ఎండలోనే ధర్నా కొనసాగించారు. పోలీసులు వైసీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పంచాయతీ కార్యాలయాలకు వేసిన రంగునే తుడిచేశాం.. మేం నల్ల రంగు వేయటం తప్పయితే.. పార్టీ రంగు పంచాయతీ కార్యాలయానికి వేయడం తప్పుకాదా? అని నిలదీశారు. పోలీసులపై ప్రైవేటు కేసులు పెడతామని హెచ్చరించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు భారీగా బలగాలను మోహరించారు. లేమల్లె గ్రామ ప్రధాన రహదారిపై రైతులు, మండల టీడీపీ నేతలు ధర్నా నిర్వహించారు. ఉండవల్లి కూడలి వద్ద టీడీపీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు.





### విద్యార్థుల ఆందోళన

తమ ఉన్నత భవిష్యత్తు కోసమే రైతులు త్యాగాలు చేశారని, ఒక రాజధాని పూర్తికాకుండా మూడు రాజధానులు అభివృద్ధి అసాధ్యమని రాజధాని ప్రాంత విద్యార్థులు గళం విప్పారు. రైతుల పోరాటానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం తమ నిర్ణయం మార్చుకునే వరకు రైతులకు మద్దతుగా పోరాడతామని విద్యార్థులు తెలిపారు. అలాగే గుంటూరు జిల్లా వైద్యుల సంఘం రైతులకు మద్దతుగా నిలిచింది.

### చెప్పుల దండతో నిరసన

మూడు రాజధానుల ప్రతిపాదనను నిరసిస్తూ ఉద్దండరాయునిపాలెంలో ఓ రైతు విన్నూత్న నిరసన తెలిపారు. రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతంలో వంటావార్పు కార్యక్రమానికి వచ్చి.. మెడలో చెప్పుల దండ వేసుకొని తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కలుగుజేసుకొని తమ సమస్యకు పరిష్కారించాలని కోరారు. "మోదీజీ మమ్మల్ని ఏ కమిటీ సభ్యులు సంప్రదించలేదు. మా పరిసర ప్రాంతాలలోని ఒక జమిందారీ కుటుంబాన్ని కలిసి అభిప్రాయం తీసుకున్నారు" అంటూ రాయపూడికి చెందిన ముస్లిం రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనకు నిరసనగా తుళ్లూరు చేపట్టిన మహాధర్నాకు రాయపూడి, తదితర ప్రాంతాల నుంచి ఆదివారం పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు.



ఉద్దండరాయునిపాలెంలో మెడలో చెప్పులతో ధర్నా

### ▪ కేసులకు భయపడం: శ్రావణ్

"పోలీసులు రైతు, రైతు కూలీల కుటుంబాల నుంచి వచ్చిన వారే. మీరు తినే ప్రతి ముద్ద రైతు పండించేదే. ఒక్కసారి మానవతా హృదయంతో ఆలోచించండి. భూములు త్యాగం చేసిన రైతులపై జులం సరికాదు" అని మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం తుళ్లూరు, మందడం, వెలగపూడి తదితర ప్రాంతాల్లో రైతులు చేస్తున్న దీక్ష శిబిరాలను సందర్శించి ఉద్యమానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కేసులకు భయపడేది లేదన్నారు. ప్రతి రైతుకు టీడీపీ అండగా ఉంటుందని.. వారిపై పెట్టే కేసులకు న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

### ప్రమాణం అక్కడెందుకు చేశారు: అనగాని

"రైతుల త్యాగాలతో, రాష్ట్ర ప్రజల ఏకాభిప్రాయంతో ఏర్పడిన అమరావతిని రాజధానిగా పనికి రాదంటున్న చోట సీఎంగా జగన్, మంత్రులు ఎందుకు ప్రమాణ స్వీకారం చేశారు? ఎనిమిది సార్లు కేబినెట్ సమావేశాలు, మూడుసార్లు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన అమరావతి.. రాజధానికి పనికి రాదా? దళితులు అత్యధికంగా ఉన్న నియోజకవర్గంలో రాజధానిని నిర్మించడం మీకు ఇష్టం లేదా?" అని సీఎం జగన్‌ని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ నిలదీశారు. రాజధాని నిర్మించడం చేతకాకనే విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించారని విమర్శించారు. "విశాఖలో ఎక్కువ భూములు వైసీపీ వారివే. అందుకే ఆ ప్రాంతాన్ని రాజధానిగా జగన్ ప్రకటించారు" అని దుయ్యబట్టారు. క్రిస్టియన్ల ఓట్లు దండుకున్న జగన్ కనీసం వారికి క్రిస్మస్ కానుకలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

# అమరావతి కాదది.. ఎడారి!

## ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసినవారిని జగన్ వదలరు: తమ్మినేని



న్యూఢిల్లీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రాజస్థాన్ ఎడారిలా ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. దాని ముసుగులో ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసిన నేరస్థులెవరినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వదలరని స్పష్టం చేశారు. ఆదివారమిక్కడ ఆంధ్ర భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో 'ఆంధ్రజ్యోతి' అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. అమరావతి రాజధాని పేరుతో ముందే టీడీపీ నేతలు వేల ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్న ఆరోపణలు నిజమైతే.. దానిపై చర్యలు తీసుకోవాలి తప్ప.. రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చాక, రాజధానిగా అమరావతి నిర్ధారణ జరిగి, ప్రధాని మోదీ శంకుస్థాపన చేశాక.. కొన్ని వేల కోట్లు వ్యయం చేసి అనేక భవనాలు నిర్మించాక, ఇపుడు ఇన్‌సైడర్ ట్రేడింగ్ పేరుతో రాజధానిని మార్చాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించగా.. 'రాష్ట్ర రాజధాని అంటే నా రాజధాని అని అనిపించాలే గాని.. ఏ కొందరి కోసమో అన్న భావం కలుగకూడదు. అసలు అమరావతిలో ఏముంది చెప్పండి? నేను స్పీకర్ అయ్యాక ఆ ప్రాంతమంతా స్వయంగా తిరిగి పరిస్థితిని చూశాను. రాజస్థాన్ ఎడారిలా ఉంది. అందుకే రాజధానిని వికేంద్రీకరిస్తున్నాం. సీఎం తీసుకుంటున్న ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను' అని చెప్పారు. అమరావతిని రాజధానిగా నిర్ణయించిన సందర్భంలో ఆనాటి ప్రధాన విపక్ష నేతగా ఉన్న జగన్.. కొత్త రాజధానికి 30 వేల ఎకరాలుండాలని.. అమరావతి మహానగరంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని నిండు సభలో చెప్పిన మాటలను గుర్తుచేయగా.. తమ్మినేని తటపటాయిస్తూ.. మాట దాటవేశారు. మళ్లీ అదే ప్రశ్న వేసినా సమాధానం చెప్పడానికి ఇష్టపడలేదు. విశాఖపట్నంలో పరిపాలక రాజధాని రావడం నీకిష్టం లేదా అని ఎదురు ప్రశ్నించారు. 'వెనుకబడిన ఉత్తరాంధ్రకు రాజధాని రావడం సంతోషించాలి. ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది' అని తెలిపారు. జగన్ నిర్ణయంపై రైతులు, విద్యార్థులు, డాక్టర్లు, ప్రజాసంఘాలు, విపక్షాలన్నీ రోడ్లపైకి వచ్చి నిరసనలు, దీక్షలు చేయడాన్ని ప్రస్తావించగా.. 'నువ్వు క్షేత్రస్థాయిలో చూశావా? అక్కడ నువ్వన్నంత తీవ్ర వ్యతిరేకత లేదు. కొద్దిమందిలోనే ఆ ప్రభావం ఉంది. నువ్వు ఢిల్లీలో కూర్చోకుండా క్షేత్రస్థాయికి వెళ్లి ఉద్యమాల సంగతి చెప్పు' అని స్పీకర్ సూచించారు. 'నేను ఆ ప్రాంతం నుంచి వచ్చినవాడినే. అక్కడ ఏం జరుగుతుందో నాకూ తెలుసు' అని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి స్పందించగా.. స్పీకర్ మాట దాటవేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జీఎన్ రావు కమిటీ 13 జిల్లాల సమగ్రాభివృద్ధి కోసం నియమించిన కమిటీయే తప్ప, రాజధానిని నిర్ణయం కోసం నియమించిన కమిటీ కానేకాదని అందులో స్పష్టీకరించారు. రాజధాని అంశమూ సమగ్రాభివృద్ధిలో భాగం కనుక.. ఆ అంశాలను కూడా అధ్యయనం చేసిందన్నారు. అమరావతిలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎలాంటి ఉద్యోగాల కల్పన జరగలేదని.. అక్కడ ఇల్లు కట్టుకునే ఉత్సాహం కూడా గత ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేకపోయిందని విమర్శించారు. రైతులను ప్రలోభపెట్టి భూములను లాక్కున్నారని ఆరోపించారు. కేంద్రీకృత అభివృద్ధికి వెళ్లవద్దని శ్రీకృష్ణ కమిటీ, శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికలను గత ప్రభుత్వం పట్టించుకుని ఉంటే.. జీఎన్ రావు కమిటీని వేసే అవసరమే ఉండేదికాదని తెలిపారు.



## బాబు ట్రాప్‌లో వైసీపీ

▸▸ రాజధాని మైథాలజీకి చంద్రబాబు నిర్మాత

▸▸ వైఎస్ తవ్విన కాల్వల్లో బోర్లు వేశారు

▸▸ ఎత్తిపోతల పథకమని అంటున్నారు: సోము

రాజమహేంద్రవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): "రాజధాని కేంద్రంగా అభివృద్ధి జరిగిన దాఖలాలు ప్రపంచంలో ఎక్కడా లేవు. రాజధాని అనే మైథాలజీకి చంద్రబాబు నిర్మాతగా ఉన్నారు. అసలు రాజధాని అనే దానిపై చర్చ అనవసరం. రాజధాని అనేది సైలెంట్‌గా చేసుకోవాల్సిన పని. వైసీపీ ప్రభుత్వం కూడా చంద్రబాబు ట్రాప్‌లోనే ఉంది" అని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు కావాల్సింది అభివృద్ధి... అది వికేంద్రీకరణతోనే సాధ్యమన్నారు. 'అమెరికా రాజధాని ఓ పల్లెటూరులో ఉంది. చైనా రాజధాని బీజింగ్... కానీ అభివృద్ధి షాంఘైలో జరిగింది. భారతదేశంలో అనేక రాష్ట్రాలు విడిపోయాయి. అవన్నీ తమ రాజధానులను సైలెంట్‌గా నిర్మించుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా రాజధానిపై చర్చను పెంచకుండా అన్ని ప్రాంతాలను ఏవిధంగా అభివృద్ధి చేయాలో ఆలోచించాలి.' అని సూచించారు. రాజధాని అంటే భూములు కొనుక్కోవడం కాదన్నారు. ఎవరినో సీఎంను చేయడానికి రాజకీయ పార్టీ ఉండకూడదని, అభివృద్ధి కోసమే ఉండాలని సోము స్పష్టం చేశారు. రాయలసీమను అభివృద్ధి చేస్తే ఎవరో ఏదో అనుకుంటారని భావించాల్సిన అవసరమే లేదని అన్నారు. బంగారంతోపాటు ఎన్నో విలువైన ఖనిజాలు ఉన్న రాయలసీమను రత్నాల సీమగా అభివృద్ధి చేయాలన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కాలంలోనే నెల్లూరు పోర్టు వచ్చిందనీ, పోలవరంను ప్రారంభించిందీ ఆయనేనని అన్నారు. వైఎస్ కాలంలో తవ్విన రెండు కాలవల్లో బోర్లు వేసి ఎత్తిపోతల పథకం అంటున్నారంటూ చంద్రబాబుపై మండిపడ్డారు. 900 కిలోమీటర్ల తీరమున్నా చంద్రబాబు ఒక్క పోర్టూ కట్టలేదన్నారు. కడితే తమ వారికి ఉన్న పోర్టుకు ఇబ్బంది అవుతుందని ఆలోచించి ఉంటారంటూ విమర్శించారు. చంద్రబాబును విమర్శించడం వల్లే బీజేపీ అధ్యక్ష పదవి రాలేదు. ఇప్పుడు కూడా విమర్శిస్తారెందుకు? అని కొందరు అడుగుతున్నారని.. నేను ప్రెసిడెంట్‌ని అవ్వకపోతే గాడిదనవుతాను. ఏమవుతుంది? కానీ వాస్తవాలు మాట్లాడతాను' అంటూ సోము వీర్రాజు ముక్తాయించారు. భారత్‌లో ముస్లింలను ఎన్నడూ ఇబ్బంది పెట్టలేదని, క్యాబ్ బిల్లుపై మైనారిటీలకు భయమెందుకని అని వీర్రాజు ప్రశ్నించారు.

### రాష్ట్రాన్ని ముంచబోతున్న జగన్

▸▸ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయుడు

తిరుపతి తిలక్‌రోడ్డు: రాజధానిని విశాఖపట్నం మార్చి రాష్ట్రాన్ని సీఎం జగన్ బంగాళాఖాతంలో ముంచబోతున్నారని బీజేవైఎం అధ్యక్షుడు రమేశ్‌నాయుడు విమర్శించారు. తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధానిగా అమరావతినే కొనసాగించాలన్నారు. రాజధానిని మూడు ముక్కలు చేసి ప్రాంతీయ చిచ్చు పెట్టడం, ప్రజల మనసుల్లో విషబీజాలు నాటడం మానుకోవాలని జగన్‌కు సూచించారు.

## రాజధాని రగడ

# అమిత్ షా దృష్టికి!

▸▸ రెండ్రోజుల్లో భేటీ కానున్న సుజనా

▸▸ వెంట రైతులు, లాయర్లు, వ్యాపారులు కూడా..

▸▸ రాజధానిపై వైఖరి తెలుసుకునే యత్నం

▸▸ స్పష్టత రాగానే ఉద్యమం ఉధృతం

▸▸ ఆంధ్రలో బీజేపీ బలోపేతానికి వ్యూహం



అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మార్పుపై రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని కేంద్ర హోం మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ ఎంపీ సుజనాచౌదరి భావిస్తున్నారు. ఈ మేరకు రెండు మూడు రోజుల్లో ఆయనతో సమావేశం కానున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల చివరి రోజున (17న) మూడు రాజధానుల ప్రకటనలు చేయడం, మర్నాడే జీఎన్ రావు కమిటీ నివేదికలో కూడా మూడు రాజధానుల ప్రస్తావన తేవడంతో అమరావతిలో భారీఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. గత ఐదు రోజులుగా రాజధాని పరిధిలోని 29 గ్రామాల రైతులు ఆందోళన తీవ్రతరం చేశారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల వైఖరి ఎలా ఉంది?, ప్రాంతాల వారీగా రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రజల స్పందన తదితర సమాచారాన్ని అమిత్‌షా దృష్టికి సుజనా తీసుకెళ్లనున్నారు. రాష్ట్రానికి చెందిన కొంతమంది రైతులు, వ్యాపారవేత్తలు, న్యాయవాదులు కేంద్ర హోం మంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరుతూ సుజనాచౌదరిని అభ్యర్థించినట్లు సమాచారం. దీంతో సోమ/మంగళవారాల్లో హోంమంత్రితో భేటీ కావాలనుకున్నప్పటికీ... జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడి కానున్నందున.. తర్వాత రెండు రోజుల్లో సమావేశమయ్యే అవకాశముంది. కాగా.. ఇప్పటివరకు అమరావతి రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన కంపెనీల వివరాలు.. రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలు తదితర వివరాలతోపాటు రాజధాని మార్పుతో జరిగే పరిణామాలను అమిత్ షాకు ఆయా వర్గాల ప్రతినిధులు సమగ్రంగా వివరిస్తారు. 'ఉన్నపళంగా రాజధాని మార్పు చేయడాన్ని ఉద్యోగ వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. కేబినెట్ నిర్ణయం తర్వాత ప్రభుత్వం స్పష్టంగా ప్రకటిస్తే ఉద్యోగులు కూడా నిరసనలకు దిగే పరిస్థితులున్నాయి' అని తెలియజేయనున్నారు. ఈ అంశంపై బీజేపీ వైఖరి ఎలా ఉండాలో అమిత్ షా నుంచి రాష్ట్ర నేతలు సూచనలు తీసుకోనున్నారు. జగన్ ప్రకటన వెలువడిన వెంటనే కన్నా లక్ష్మీనారాయణతోపాటు పలువురు నేతలు అభివృద్ధి వికేంద్రీకరణకు మద్దతు పలకడం, తర్వాతి రోజు జగన్ ప్రకటనను తప్పుపట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమిత్‌షా ఆదేశాలతో రాష్ట్రంలో పార్టీ అనుసరించాల్సిన విధానాన్ని చర్చించనున్నారు. రాజధానిని మార్చాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకించాలని అధినేత సూచిస్తే.. బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని భావిస్తున్నారు. రాజధాని మార్పును వ్యతిరేకిస్తూ ఉద్యమం తీవ్రతరం చేస్తే పార్టీని జనాల్లోకి విస్తృతంగా తీసుకెళ్లవచ్చని అమిత్ షాకు వివరించనున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పార్టీ కేడర్ ఏదో ఒక అంశంతో జనాల్లోకి వెళ్లాలని యోచిస్తోంది. అంతేకాకుండా అమరావతి రైతులకు బాసటగా నిలిచి ప్రధాని శంకుస్థాపన చేసిన అమరావతిని నిలిపిన ఘనత బీజేపీకి దక్కేలా చేసుకోవాలని భావిస్తోంది.



### 50-70 వేల కోట్ల పరిహారం!

ఉన్నపళంగా రాజధాని మార్పు అంత సులభమైన విషయమేమీ కాదని, దానికి ప్రభుత్వం భారీగా పరిహారం చెల్లించాల్సి ఉంటుందని సుజనా పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల భూములు తిరిగి ఇస్తే.. తమకు జరిగిన నష్ట పరిహారంపై వారు న్యాయస్థానాలను ఆశ్రయిస్తారని, దీంతో రూ.50 వేల నుంచి రూ.70 వేల కోట్ల వరకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుందని, రాష్ట్ర ఖజానాపై ఇది మరింత భారమని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. పులిచింతల ప్రాజెక్టు విషయంలో కాంట్రాక్టరును మార్చినందుకు ఆ కాంట్రాక్టరు హైకోర్టును ఆశ్రయించారని, రూ.450 కోట్లు ఆయనకు చెల్లించాలని కోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు.

## అమరావతికి నష్టం ఉండదు

▸▸ అన్ని ప్రాంతాలూ సమాన అభివృద్ధి

▸▸ మూడు రాజధానులపై హోంమంత్రి సుచరిత



విశాఖపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీకి మూడు చోట్ల రాజధానులు ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుత రాజధాని నగరం అమరావతికి ఎలాంటి నష్టమూ ఉండదని రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరిత అన్నారు. విశాఖ నగరంలోని సూర్యాబాగ్‌లో కొత్తగా నిర్మించిన అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఆదివారం ఇక్కడకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి ఒకేచోట కేంద్రీకృతమైతే ఉమ్మడి రాష్ట్రంలో ఎదురైన పరిస్థితే పునరావృతమవుతుందన్న భావనతో ముఖ్యమంత్రి జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం కలుగుతుంది కాబట్టి ప్రజలు కూడా సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. సీఎం నిర్ణయాన్ని అమరావతి ప్రాంత రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఆ జిల్లా ప్రజాప్రతినిధిగా మీరెలా స్పందిస్తారని ప్రశ్నించగా... అమరావతిలో శాసనసభ, హైకోర్టు బెంచ్, రాజ్‌భవన్ ఉంటాయి కాబట్టి ఆ ప్రాంతానికి కలిగే నష్టం ఏమీ ఉండదన్నారు.

## రాజధాని ఆందోళనపై మరో రెండు కేసులు

గుంటూరు, డిసెంబరు 22 : అమరావతిలోనే రాజధాని కొనసాగించాలంటూ ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు ఆదివారం మరో రెండు కేసులు నమోదు చేశారు. ఇప్పటికే రైతులపై ఆరు కేసులు నమోదుకాగా తాజాగా మరో రెండు కేసులు నమోదయ్యాయి. మల్కాపురం జంక్షన్‌లో శనివారం కొందరు రైతులు గ్రూపుగా ఏర్పడి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిని అడ్డుకునేందుకు యత్నించిన పోలీసు అధికారులపై దాడికి పాల్పడి విధులకు ఆటంకం కలిగించారని పోలీసు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్పీ విజయరావు తెలిపారు. తుళ్లూరులోని పంచాయతీ కార్యాలయానికి నల్లరంగులు వేస్తుండగా అడ్డుకునేందుకు యత్నించిన పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించారని అందిన ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ఉండవల్లిలో తలకిందులుగా నిరసన

# రాజధానికి ఒక్కసారే శంకుస్థాపన

▸▸ ఉద్యమం అన్ని జిల్లాలకూ విస్తరించాలి

▸▸ అమరావతి 5కోట్ల ఆంధ్రుల రాజధాని

▸▸ ప్రతిష్టాన్ పీఠాధిపతి కమలానంద భారతి

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ముద్ద ముద్దకూ బిస్మిల్లా అనరని... అలాగే రాజధానికి కూడా ఒక్కసారే శంకుస్థాపన చేస్తారని ప్రతిష్టాన్ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి వ్యాఖ్యానించారు. మందడంలో రైతులు చేస్తున్న ఆందోళనకు ఆయన ఆదివారం సంఘీభావం తెలిపారు. రాజధాని అమరావతిపై చర్చలు, కమిటీలు అవసరమే లేదన్నారు. అందరి అంగీకారంతోనే అమరావతికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాజధానిగా అమరావతిని ప్రకటించిన రోజూ ఎవరూ అడగలేదని, ఉద్యమాన్ని కొనసాగించాలని కమలానంద పిలుపునిచ్చారు. మీ భద్రత, భవిష్యత్, జీవితం అంతా అమరావతితోనే ముడిపడి ఉందని అక్కడి ప్రజలకు సూచించారు. ఇది 29గ్రామాల ప్రజల రాజధాని కాదని, 5కోట్ల ఆంధ్రుల రాజధాని అని స్పష్టం చేశారు. అమరావతి ఉద్యమం జిల్లాలకూ విస్తరిస్తే ప్రజాబలం మరింత పెరుగుతుందన్నారు.



మందడంలో ఆందోళన చేస్తున్న రైతులతో కమలానంద భారతి



## ఎన్ఆర్ఐ మోనీషాకు కీలక పదవి

హ్యూస్టన్, డిసెంబరు 22: అమెరికా ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్(ఎఫ్‌సీసీ) ప్రధాన సాంకేతిక అధికారిగా భారత సంతతికి చెందిన అమెరికన్ మహిళ మోనీషా ఘోష్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న ఎరిక్ బర్గర్ స్థానంలో ఆమె జనవరి 13 నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. అమెరికాలోని సమాచార ప్రసార చట్టాలు, నిబంధనల రూపకల్పన, అమలులో ఎఫ్‌సీసీదే బాధ్యత. ప్రధాన సాంకేతిక అధికారిగా మోనీషా ఘోష్ ఎఫ్‌సీసీ ఛైర్మన్ అజిత్ పాయ్, కమిషన్‌కు సాంకేతిక అంశాలపై సలహాలు ఇస్తారు.



## లాస్ వెగాస్‌లో అగ్నిప్రమాదం

లాస్ వెగాస్, డిసెంబరు 22: అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరిగిన ఓ అగ్నిప్రమాదంలో ఆరుగురు మృతిచెందగా.. 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. లాస్ వెగాస్ డౌన్‌టౌన్‌లోని ఆల్‌ఫైన్ మోటెల్‌లో.. ఓ స్టౌ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఆరుగురు చనిపోగా.. 13 మంది గాయపడ్డారని తెలిపారు. క్షతగాత్రుల్లో కొందరు పైఅంతస్తుల నుంచి దూకడంతో గాయపడ్డారని వివరించారు. ప్రమాదం కారణంగా రూ. 3.38 కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.



## అఫ్ఘాన్ అధ్యక్షుడిగా మళ్లీ ఘనీ!

కాబూల్, డిసెంబరు 22: అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడిగా అష్రాఫ్ ఘనీ రెండోసారి ఎన్నికయ్యారు. అఫ్ఘానిస్థాన్ ఇండిపెండెంట్ ఎలక్షన్ కమిషన్(ఐఈసీ) వర్గాల సమాచారం మేరు ఆయన 50.64 % ఓట్లు సాధించారు. ఘనీ ప్రధాన ప్రత్యర్థి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అబ్దుల్లా అబ్దుల్లా 39.52% ఓట్లు సాధించారు. ఎన్నికలకు సంబంధించి అభ్యంతరాలను అభ్యర్థులు మూడు రోజుల్లోగా ఎన్నికల సంఘానికి తెలపాలి. ఎన్నికల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వీటిని తాము అంగీకరించబోమని అబ్దుల్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



రామ్‌లీలా మైదానంలో బహిరంగ సభకు హాజరైన బీజేపీ కార్యకర్తలకు ప్రధాని మోదీ అభివాదం

# ఎన్నార్సీపై వెనక్కి?



(మొదటి పేజీ తరువాయి)

చెప్పదల్చుకున్నా. కేవలం సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించేందుకు దాన్ని కేవలం అసోంలో మాత్రం అమలు చేయాల్సి ఉంది" అని మోదీ విస్పష్టంగా ప్రకటించారు. దేశంలోని ముస్లింలందరినీ నిర్బంధ శిబిరాలకు తరలిస్తారంటూ కాంగ్రెస్, అర్బన్ నక్సల్స్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని యువత నమ్మవద్దని.. అది పచ్చి అబద్ధమని, యువతీయువకులంతా సీఏఏ చట్టాన్ని వివరంగా చదవాలని వేడుకున్నారు. "దేశంలోని ముస్లింలు ఆందోళన చెందాల్సిన పనే లేదు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ) మన దేశ ముస్లింలకు వర్తించవు" అని తేల్చిచెప్పారు. చర్చ, వాదోపవాదాలు, భిన్నాభిప్రాయం తెలపడం.. ఇవన్నీ ప్రజాస్వామ్య లక్షణాలని గుర్తుచేశారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కలిగించడం మన లక్షణాలు కావన్నారు. పౌరసత్వ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా హింసాత్మక ప్రదర్శనలు చేస్తున్న వారు కావాలంటే తనను ద్వేషించాలని.. అంతే తప్ప దేశాన్ని ద్వేషించవద్దని అన్నారు. "కావాలంటే నా దిష్టి బొమ్మల్ని తగలబెట్టండి. కానీ, పేదవాడి ఆటోరిక్షాలను తగలబెట్టొద్దు" అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశ ప్రత్యేకత అని గుర్తుచేశారు. జాతీయ పౌర పట్టిక విషయంలో తమ వాదనను సమర్థించుకునేలా.. 'చొరబాటుదారులు తమ ఉనికిని ఎప్పటికీ బయటపెట్టుకోరు. శరణార్థులు తమ గురించి ఎప్పుడూ దాచుకోరు" అని ఆయన వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ నుంచి హిందువులు ఎప్పుడు రావాలనుకున్నా వారికి స్వాగతం పలకాలని సాక్షాత్తూ మహాత్మాగాంధీయే చెప్పారని.. ఆయన మాటలను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. ఈ చట్టం వల్ల ప్రయోజనం పొందేవారిలో పాకిస్థాన్ నుంచి వచ్చిన దళితులు కూడా ఉంటారని.. వారి బాధను ఎందుకు అర్థం చేసుకోరని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా ఈ దేశం కోసం 33 వేల మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని.. అలాంటి పోలీసులు ఇప్పుడు దాడులకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు.

### హిందువులుగా పుట్టడం నేరమా?: గడ్కరీ

పాకిస్థాన్‌లో మైనారిటీలైన హిందువులపై తీవ్రమైన దురాగతాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. దీంతో వారు పొట్ట చేతబట్టుకొని భారత్‌కు వలస వస్తున్నారని తెలిపారు. హిందువులుగా పుట్టడం నేరమా? అని ఆయన ప్రశ్నించారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన సభలో గడ్కరీ మాట్లాడారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) భారత్‌లోని ముస్లింలకు వ్యతిరేకం కాదని పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లోని మైనారిటీలను ఆదుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందని తెలిపారు.

### దీదీ.. మీ ఏజీని అడగండి..

పౌరసత్వ సవరణ చట్టాన్ని తన రాష్ట్రంలో అమలు చేయనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై మోదీ స్పందించారు. "మీరా పని చేయగలరేమో మీ అడ్వొకేట్ జనరల్‌ను అడిగి చూడండి" అని వ్యంగ్యంగా అన్నారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలపై ఆమే ఒకప్పుడు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు.. పౌరసత్వ సవరణ చట్టంపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్న మమత వ్యాఖ్యలను ప్రస్తావించి.. "ఈ రోజు దీదీ.. మమతా దీదీ.. దీదీ సీధీ (నేరుగా) కోల్‌కతా నుంచి ఐక్యరాజ్యసమితికి చేరుకున్నారు" అంటూ మోదీ ఎద్దేవా చేశారు. "పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని కొందరు ప్రకటిస్తున్నారు. కానీ.. మీరు ముఖ్యమంత్రులు. రాజ్యాంగం ప్రకారం ప్రమాణ స్వీకారం చేశారు. జాతీయ జెండా నీడన ఉంటూ అలాంటి ప్రకటనలు చేస్తారా? కనీసం న్యాయనిపుణులతో మాట్లాడండి. బహిరంగంగా కాకపోయినా.. మూసిన తలుపుల వెనుక గదుల్లోనైనా మాట్లాడండి" అని సూచించారు. అలాగే.. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు బంగ్లాదేశ్‌లో మత వివక్షకు గురవుతున్నవారికి పౌరసత్వం ఇచ్చే విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావించడాన్ని మోదీ గుర్తు చేశారు. దాన్ని అమలు చేయాలని మోదీ అనుకుంటే సమస్య ఏమిటని నిలదీశారు. "బంగ్లాదేశ్‌లో మతవిద్వేషం కారణంగా బాధ పడుతున్నవారు సహాయం పొందాలని అసోంకు 15 ఏళ్లపాటు సీఎంగా ఉన్న తరుణ్‌గొగోయ్ అన్నారు. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్ కూడా అదే మాట అన్నారు" అని గుర్తుచేశారు. ఈ నాయకులందరివీ ఓటు బ్యాంకు రాజకీయాలని మండిపడ్డారు.

### బీజేపీ మేనిఫెస్టోలో ఎన్నార్సీ

2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో కూడా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎన్నార్సీ ప్రస్తావన ఉంది. మేనిఫెస్టోలోని 'చొరబాట్లపై యుద్ధం' అనే విభాగంలో ఎన్నార్సీ గురించి ఉంది. దాని సారాంశమేమిటంటే..

"దేశంలోని కొన్ని ప్రాంతాల సాంస్కృతిక, బాషాపరమైన గుర్తింపు విషయంలో భారీ మార్పులు కనపడుతున్నాయి. దానివల్ల స్థానిక ప్రజల జీనోపాధిపై, ఉద్యోగావకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అలాంటి ప్రాంతాల్లో ప్రాధాన్యం ప్రకారం మేం అత్యంత వేగంగా జాతీయ పౌర చిట్టా ప్రక్రియను అమలు చేస్తాం. భవిష్యత్తులో మేం దేశంలోని ఇతర ప్రాంతాల్లో దశలవారీగా ఎన్నార్సీని అమలు చేస్తాం."

# మోదీవన్నీ అబద్ధాలే

## షా వల్లే భయానకం : కాంగ్రెస్

న్యూఢిల్లీ, డిసెంబరు 22: దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నది తాము కాదని, కేంద్ర హోం మంత్రి అమిత్ షాయే సృష్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సీఏఏ తరువాత ఎన్ఆర్‌సీని అమలు చేస్తామంటూ ఇటీవల పార్లమెంటులో అమిత్ షా ప్రకటించారని, దానివల్లే భయానక వాతావరణం నెలకొందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్‌శర్మ ఆరోపించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ అన్నీ అబద్ధాలే చెబుతారని కాంగ్రెస్ ట్విటర్‌లో పేర్కొంది. ప్రధాని మోదీ.. దేశ ప్రజలను తన పేరుతో తప్పుదోవ పట్టిస్తున్నారని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్ అన్నారు. ఇదిలా ఉండగా.. సీఏఏలో భాగంగా అహ్మదీయులకు కూడా భారత పౌరసత్వం ఇచ్చేలా ఆదేశించాలంటూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు కాంగ్రెస్ ఎంపీ ప్రతాప్‌సింగ్ బజ్వా లేఖ రాశారు.

### యువత భవిష్యత్తును నాశనం చేశారు: రాహుల్

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. దేశంలోని యువత భవిష్యత్తును నాశనం చేశారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. "ఉద్యోగాల కల్పనలో వెనుకబడటం, దేశ ఆర్థిక పరిస్థితిని దిగజార్చడంతో వారు మీకు ముఖం చూపించలేక విద్వేష రాజకీయాల వెనుక దాక్కున్నారు" అని ఘాటుగా విమర్శించారు. కాగా, పౌరసత్వ చట్టం, ఆందోళనకారులపై పోలీసు దమనకాండను నిరసిస్తూ మహాత్మాగాంధీ సమాధి రాజ్‌ఘాట్ వద్ద సోమవారం 5 గంటల పాటు సత్యాగ్రహం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

## ఎన్నార్సీపై ముస్లిం ప్రవాసీల ఆందోళన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

భారత్‌లో ఎన్నార్సీకి వ్యతిరేకంగా భారతీయ ముస్లింలు చేస్తున్న నిరసన జ్వాలలు క్రమంగా గల్ఫ్ దేశాలనూ తాకుతున్నాయి. తెలుగు రాష్ట్రాలు సహా భారత్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు గల్ఫ్ దేశాలలో పెద్ద సంఖ్యలో ఉండగా.. వీరందరూ ఎన్నార్సీ పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పౌర జాబితాలో పేరు నమోదు కోసం ముస్లింలు మాత్రమే తమ పూర్వీకుల పుట్టుపూర్వోత్తరాల గురించి ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందన్న ప్రచారాన్ని అత్యధికులు విశ్వసిస్తున్నారు. భారత్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గల్ఫ్‌లోని ఒక ప్రముఖ ఎయిర్‌లైన్స్.. హైదరాబాద్ సహా దేశంలోని ఇతర నగరాలకు విమానాల సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లుగా సామాజిక మాధ్యమాలలో బూటకపు ప్రచారం చక్కర్లు కొట్టింది. దీంతో గల్ఫ్‌లోని ప్రవాసీలు, స్వదేశంలోని వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గల్ఫ్‌లో నిర్వహించే ప్రవాసీల సామాజిక కార్యక్రమాలలో సాధారణంగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్రవాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. కానీ ఈసారి మలయాళీలు, తెలంగాణవారితో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రవాసీ ముస్లింలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిరసన ప్రదర్శనలపై గల్ఫ్‌లో నిషేధం ఉంది. అయినప్పటికీ పరిమిత స్థాయిలో ప్రవాసీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎన్నార్సీకి వ్యతిరేకంగా మౌనంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం కువైత్‌లోని అబ్బాసీయాలో జరిగిన సభలో వేలాది మంది ప్రవాసీలు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేయగా.. దుబాయ్‌లోని నాయిఫ్ రోడ్డు వద్ద శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.

## డీసీపీ రాథోడ్‌కు 'జన' హారతులు



బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఏఏ వ్యతిరేక ఆందోళనలను జాతీయగీతం పాడి శాంతింపజేసిన బెంగళూరు సెంట్రల్ విభాగం డీసీపీ చేతన్‌సింగ్ రాథోడ్‌ను స్థానికులు ప్రశంసిస్తున్నారు. గురువారం ఇక్కడ 144వ సెక్షన్‌ను ఉల్లంఘించి వేల మంది ముస్లింలు రోడ్డెక్కారు. వారిని శాంతింపజేసేందుకు ఆయన జాతీయగీతం పాడారు. దీంతో ఆందోళనకారులూ జాతీయగీతం ఆలపించి అక్కడి నుంచి వెనుతిరిగారు. ఈ ఘటన సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పోలీసు ఉన్నతాధికారుల రాథోడ్ చొరవను ప్రశంసించారు.

## ప్రజ్ఞ వల్ల విమానం ఆలస్యం

▸▸ సీటు విషయంలో ఎంపీ పేచీ.. ప్రయాణికుల అసహనం



న్యూఢిల్లీ, డిసెంబరు 22: బీజేపీ వివాదాస్పద ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ మరోసారి తన ప్రవర్తనతో విమర్శలపాలయ్యారు. విమానం సీటు విషయంలో సిబ్బందితో ఆమె పేచీ పెట్టుకున్నారు. దీంతో ఫ్లైట్ ఏకంగా 45నిమిషాలు ఆలస్యమైంది. ఢిల్లీ నుంచి భోపాల్‌కు వెళ్లేందుకు స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ ఎస్జీ-2489 ఫ్లైట్‌లో ఆమె.. ఎమర్జెన్సీ వరుసలోని ఏ-1సీటును బుక్ చేసుకున్నారు. 78 సీట్ల సామర్థ్యం గల ఈ విమానంలోని తొలి వరుసగా ఎమర్జెన్సీ వరుస ఉంటుంది. నిబంధనల ప్రకారం వీల్‌చైర్‌లోని ప్రయాణికులకు ఈ వరుసను కేటాయించరు. శనివారం ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు తన సొంత వీల్‌చైర్‌లో ప్రజ్ఞ వచ్చారు. భద్రతా కారణాలరీత్యా ఎమర్జెన్సీ వరుసలోని ఏ-1 సీటును ఇవ్వలేమని.. నాన్ ఎమర్జెన్సీ వరుస అయిన ఏ-2 సీటుకు మారాలని ఆమెకు స్టాఫ్, డ్యూటీ మేనేజర్ విజ్ఞప్తి చేశారు. విమానం ఆలస్యం అవుతుండటంతో కొందరు ప్రయాణికులు కూడా సీటు మారండి మేడం అంటూ ప్రజ్ఞను వేడుకున్నారు. అయినా ఆమె ససేమిరా అన్నారు. చివరికి భద్రత సూచనల తాలూకు నిబంధనల డాక్యుమెంట్ ఏదో చూపించమని అడిగి.. దాన్ని తెప్పించుకొని చూసుకున్నారు. ఆ తర్వాతే సీటు మారారు. ఈ ఘటనపై స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్‌కు వ్యతిరేకంగా రాజ్ భోజ్ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ అనిల్ విక్రమ్‌కు ఫిర్యాదు చేశారు.

## గుమ్నామి బాబా.. సుభాష్ బోస్ కాదు!

▸▸ ఆయన నేతాజీ అనుచరుడు.. విష్ణు సహాయ్ కమిషన్



లఖ్‌నవూ, డిసెంబరు 22: దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్ పేరిట సైన్యాన్ని సృష్టించి బ్రిటిష్ వారిని గడగడలాడించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణం ఇప్పటికీ ఓ రహస్యమే. ఆయన విమాన ప్రమాదంలో చనిపోయారని.. లేదు లేదు స్వాతంత్ర్యం తర్వాత కూడా జీవించే ఉన్నారని, మారువేషంలో దేశంలో సంచరించారని కథనాలు వచ్చాయి. ఓ దశలో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నివసించిన గుమ్నామి బాబానే నేతాజీ అని చాలామంది బలంగా నమ్మారు. ఈ నేపథ్యంలో వాస్తవం తేల్చేందుకు యూపీ ప్రభుత్వం జస్టిస్ విష్ణు సహాయ్ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ ఇటీవల 130 పేజీలతో నివేదిక ఇచ్చింది. 11 కీలక పాయింట్లతో గుమ్నామి బాబా.. నేతాజీ కాదని తేల్చింది. గుమ్నామి.. 1985 సెప్టెంబరు 16న చనిపోయారు. ఆయన చివరి కర్మల్లో 13 మంది మాత్రమే పాల్గొన్నారని.. వీటిని గౌరవంగా జరిపి ఉండాల్సిందని కమిషన్ అభిప్రాయపడింది.

## శశిథరూర్‌కు కేరళ కోర్టు అరెస్ట్ వారంట్

తిరువనంతపురం, డిసెంబరు 21: కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు తిరువనంతపురం కోర్టు అరెస్ట్ వారంట్ జారీ చేసింది. 1989లో తాను రచించిన 'ద గ్రేట్ ఇండియన్ నావెల్' అనే పుస్తకంలో నాయర్ మహిళలను థరూర్ కించపరిచారంటూ సంధ్య అనే న్యాయవాది ఆయనపై కేసు వేశారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని థరూర్‌కు కోర్టు నోటీసులు పంపింది. కానీ ఆయన హాజరుకాకపోవడంతో న్యాయస్థానం అరెస్ట్ వారంట్ జారీ చేసింది. దీనిపై కోర్టును ఆశ్రయిస్తామని థరూర్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

## గిన్నిస్‌కు 'నటరాజ' నృత్యం!

బాల్కొండ, డిసెంబరు 22: కూచిపూడి నృత్యప్రదర్శనలో నిజామాబాద్ జిల్లా వాసి గిన్నిస్‌కు ఎక్కారు. భైంసా గ్రామానికి చెందిన తిరుమండ్ల వేణుగోపాల్ అలియాస్ నటరాజ రామకృష్ణదీ ఘనత. ఆదివారం బాల్కొండలో అమృతధార సేవ సంస్థ నిర్వాహకుడు హరచారి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం 8 గంటలకు రామకృష్ణ నృత్యాన్ని ప్రారంభించారు. ఏకబిగిన రాత్రి 9 గంటల దాకా కొనసాగించారు. తన 13గంటల నృత్యప్రదర్శనతో గతంలో ఒకరు చేసిన 11గంటల నృత్యప్రదర్శనను అధిగమించడంతో గిన్నిస్, లిమ్కా, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుల్లో ఆయన పేరు నమోదైంది.

# యూపీ హింసలో బెంగాల్ బీభత్సం!



## ఆరుగురి అరెస్టు.. పీఎఫ్ఐ, సిమితో సంబంధాలు: దినేశ్ శర్మ

న్యూఢిల్లీ, డిసెంబరు 22: సీఏఏకు వ్యతిరేకంగా తమ రాష్ట్రంలో జరిగిన హింసలో ఇతర రాష్ట్ర వ్యక్తుల ప్రమేయం ఉందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. ఉప ముఖ్యమంత్రి దినేశ్ శర్మ ఆదివారం అత్యవసరంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి దీనిపై మాట్లాడారు. 'పశ్చిమ బెంగాల్లోని మాల్దాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేశాం. వీరంతా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులు. దానికి సిమితో సంబంధం ఉంది' అని ఆయన వెల్లడించారు. ఆందోళనకారులు అక్రమ ఆయుధాలను ఉపయోగించారని తెలిపారు. మీరట్‌లో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. రాష్ట్రంలో సోమవారం వరకు ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక ఆదివారం బిజ్నోర్‌లో మృతుల కుటుంబాలను పరామర్శించారు. బెంగాల్లో ప్రశాంతత నెలకొంది.

### బయటకొచ్చిన పోలీసు కాల్పుల వీడియో

'పోలీసులు కాల్పులు జరపలేదు. ఆందోళనకారులే వాళ్ల మధ్య వాళ్లే కాల్పులు జరుపుకొన్నారు' అనేది యూపీ డీజీపీ ఓపీ సింగ్ ప్రకటన కాగా.. దీనికి విరుద్ధంగా కాన్పూర్‌లో ఓ పోలీసు కాల్పులు జరుపుతున్న వీడియో బయట పడింది. రబ్బరు బుల్లెట్లతోనే కాల్చామని పోలీసులు చెబుతున్నారు.

### పోలీసును కాపాడిన వాలెట్

ఫిరోజాబాద్‌లో జరిగిన కాల్పుల్లో కానిస్టేబుల్ విజేంద్ర కుమార్ త్రుటిలో తప్పించుకున్నాడు. అతడి వాలెట్టే అతడిని కాపాడింది. 'నల్బండ్ ప్రాంతంలో విధుల్లో ఉన్నాను. ఆందోళనకారుల్లో కొందరు కాల్పులు జరిపారు. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లోంచి దూసుకొచ్చిన తూటా నా వాలెట్‌లో ఆగిపోయింది' అని విజేంద్ర తెలిపాడు.

### న్యాయ విచారణ జరపండి

వర్సిటీ ప్రాంగణంలోకి పోలీసులు రావడంపై న్యాయ విచారణ జరపాలని కేంద్ర మానవ వనరుల శాఖను జామియా మిలియా ఇస్లామియా రిజిస్ట్రార్ కోరారు. జామియా విద్యార్థులకు మద్దతుగా ఆదివారం దక్షిణ ఢిల్లీలో ఆందోళనలు కొనసాగాయి.

### మతం రంగు పులిమారు: ఈశాన్య రాష్ట్రాల ప్రజలు

ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు ఆదివారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టారు. సీఏఏకు హిందూ ముస్లిం రంగు పులిమారని, మూలవాసుల హక్కుల కోసం పోరాడుతున్న తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

### జైపూర్‌లో భారీ ర్యాలీ

సీఏఏకు వ్యతిరేకంగా రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్ ఆధ్వర్యంలో జైపూర్‌లో ఆదివారం 'సంవిధాన్ బచావ్' పేరిట భారీ ర్యాలీ జరిగింది. దాదాపు మూడు లక్షల మంది పాల్గొన్నారు. సీపీఐ, సీపీఎం, ఆప్, ఎస్పీ, ఆర్ఎల్డీ, జేడీఎస్ తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు. సీఏఏ రాజ్యాంగానికి వ్యతిరేకమని, దేశాన్ని మత ప్రాతిపదికన విభజిస్తుందని, ఉప సంహరించాలని డిమాండ్ చేశారు.





బెంగళూరులో సీఏఏకు అనుకూలంగా భారీ ర్యాలీ

## విధ్వంసకులపై ఉక్కుపాదం!

**యూపీలో 67 మంది దుకాణాలు సీజ్**

లఖ్‌నవూ, డిసెంబరు 22: 'హింసకు పాల్పడిన ఆందోళనకారులపై ప్రతీకారం తీర్చుకుంటాం'.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇటీవల చేసిన హెచ్చరిక ఇది! పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా లఖ్‌నవూ, సంభల్‌లో నిర్వహించిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు జరిగాయి. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. అందుకు కారకులైన వారిని గుర్తిస్తాం. వారి ఆస్తులను స్వాధీనం చేసుకొని, వేలం వేసి నష్టపరిహారం వసూలు చేస్తాం' అని యోగి స్పష్టం చేశారు. ఈ దిశగా అధికారులు తొలి అడుగు వేశారు. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసకుల నుంచి పరిహారాన్ని రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం ముజఫర్‌నగర్‌లో 67 దుకాణాలను సీజ్ చేశారు. ఇక్కడ శుక్రవారం జరిగిన హింసలో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంతో పాటు వాహనాలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులను సీసీటీవీ ఫుటేజీ, ఫొటోలు, వీడియోల ద్వారా గుర్తించారు. ఆ 67 మందికి చెందిన దుకాణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం హింసాత్మక ఘటనలు జరిగిన లఖ్‌నవూ, సంభల్‌లో ఇంకా ఆస్తుల స్వాధీన ప్రక్రియ ప్రారంభం కాలేదు. లఖ్‌నవూలో ఆస్తి నష్టాన్ని అంచనా వేసేందుకు నలుగురితో కమిటీ చేసినట్లు కలెక్టర్ అభిషేక్ ప్రకాశ్ తెలిపారు. రాంపూర్ జిల్లాలో 25 మంది ఆందోళనకారుల ఆస్తుల స్వాధీనానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు.

### ఆస్తి నష్టంపై కోర్టుకెళ్లనున్న రైల్వే!

సీఏఏ వ్యతిరేక నిరసనల్లో ఆందోళనకారులు రైల్వే ఆస్తులనూ ధ్వంసం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమకు నష్టపరిహారం ఇప్పించాలంటూ రైల్వే శాఖ అధికారులు కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఆస్తుల నష్టానికి పరిహారం ఇప్పించాలంటూ కోర్టులో వ్యాజ్యం దాఖలు చేయనున్నారు. ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమబెంగాల్‌లో రూ.90 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా.. సీఏఏ నిరసన ప్రదర్శనలను అదుపు చేసే క్రమంలో పోలీసులు సమీపంలోని ఆస్పత్రుల్లోకి వెళ్లి వైద్య సేవలకు అంతరాయం కలిగిస్తున్నారన్న వార్తలపై ఐఎంఏ స్పందించింది. ఇలాంటి చర్యలు సరికాదని, ఆస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేసింది.

## బెంగళూరులో బీజేపీ మద్దతు ర్యాలీ

బెంగళూరు/చెన్నై, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఏఏకు మద్దతుగా కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆదివారం బీజేపీ భారీ ర్యాలీ నిర్వహించింది. ఇండియన్ సిటిజన్ ఫర్ సీఏఏ పేరిట చేపట్టిన ఈ ర్యాలీలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడారు. దేశంలోకి అక్రమంగా వలస వచ్చిన వారిని నియంత్రించేందుకే ప్రభుత్వం ఎన్ఆర్‌సీని తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్‌తోపాటు పలు పార్టీలు రాజకీయ వైషమ్యంతో కుట్రలు చేస్తున్నాయని నిందించారు. ఆందోళన చేస్తున్న వారికి చట్టం గురించి తెలియదని మండిపడ్డారు. అక్షరం ముక్కరాని వారు, పంక్చర్‌లు వేసుకునే వారి వల్లే అల్లర్లు జరుగుతున్నాయన్నారు. కాగా, ఈ ర్యాలీలో పాల్గొన్న వరుణ్(31) కత్తిపోట్లకు గురయ్యారు. ర్యాలీ అనంతరం ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా, ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాలపై వచ్చి, కత్తులతో పొడిచి పరారయ్యారు. స్థానికులు, పోలీసులు హుటాహుటిన ఆయన్ని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. ఎంపీ తేజస్వి సూర్య ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. నిందితులను అరెస్టు చేయాలన్నారు. మరోవైపు మంగళూరులో పోలీసు కాల్పుల్లో మరణించిన ఇద్దరి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. 'ఈ రోజే బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆదేశించా' అని సీఎం యడియూరప్ప వెల్లడించారు.



## సీఏఏ సాహసోపేత నిర్ణయం: వీహెచ్‌పీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తీసుకురావడం సాహసోపేతమైన నిర్ణయమని వీహెచ్‌పీ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్ జైన్ అన్నారు. ఆదివారమిక్కడ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సీఏఏపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ వరకు అనేక మంది సీఏఏ రావాలని కోరుకున్నారని చెప్పారు.

# 10/10

**వెస్టిండీస్‌పై వరుసగా పదో సిరీస్‌తో భారత్ రికార్డు**

- విరాట్, రోహిత్, రాహుల్ అర్ధ సెంచరీలు
- ఆఖర్లో జడేజా, శార్దూల్ మెరుపులు
- ఈ ఏడాదిని గ్రాండ్‌గా ముగించిన కోహ్లీసేన

మూడు వన్డేల సిరీస్‌కు టీమిండియా అదిరిపోయే ఫినిషింగ్ ఇచ్చింది. నువ్వా.. నేనా అనే స్థితిలో నిర్ణాయక మ్యాచ్‌లో బరిలోకి దిగిన కోహ్లీ సేన ఛేదనలో తమ స్థాయేంటో ప్రత్యర్థికి మరోసారి రుచి చూపింది. 316 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఎప్పటిలాగే ఓపెనర్లు రోహిత్, రాహుల్ అర్ధసెంచరీలతో మెరుపు ఆరంభాన్ని అందించారు. మిడిలార్డర్ విఫలమైనా మరో ఎండ్‌లో కెప్టెన్ కోహ్లీ వీరోచిత ఆటను ప్రదర్శించాడు. అతడికి జడేజా సహకారం అందించగా.. చివర్లో శార్దూల్ ఠాకూర్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో భారత్‌కు విజయం సులువైంది. విండీస్‌లో పూరన్, పొలార్డ్ డెత్ ఓవర్లలో భారత్‌పై విరుచుకుపడినా ఫలితం లేకపోయింది. కరీబియన్లపై భారత్‌కు ఇది వరుసగా పదో ద్వైపాక్షిక సిరీస్ కావడం విశేషం.




**1** — ఓపెనర్‌గా అన్ని ఫార్మాట్లలో కలిపి ఓ ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు రోహిత్ శర్మ (2442). ఈ జాబితాలో జయసూర్య (2387) పేరిట ఉన్న 22 ఏళ్ల రికార్డును రోహిత్ బద్దలుగొట్టాడు.

ఈ ఏడాది అన్ని ఫార్మాట్లలో అత్యధిక రన్స్ చేసిన బ్యాట్స్‌మన్ కోహ్లీ (2455). ఇక ఈ సంవత్సరం వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన బ్యాట్స్‌మన్ రోహిత్ (1490).



కోహ్లీ (85)

జడేజా (39 నాటౌట్)

**కటక్:** వెస్టిండీస్‌పై తమకు తిరుగులేదని భారత్ మళ్లీ చాటుకుంది. ఉత్కంఠగా సాగిన పోరులో టాపార్డర్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ (81 బంతుల్లో 9 ఫోర్లతో 85), కేఎల్ రాహుల్ (89 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 77), రోహిత్ శర్మ (63 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 63) అర్ధసెంచరీలతో సత్తాచాటారు. దీంతో ఆదివారం జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో భారత్ 4 వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీ్‌సను 2-1తో దక్కించుకుంది. తొలుత విండీస్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 315 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (64 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 89), కీరన్ పొలార్డ్ (51 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 74 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. అరంగేట్ర ఆటగాడు నవ్‌దీప్ సైనీకి 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 48.4 ఓవర్లలో 6 వికెట్లకు 316 రన్స్ చేసి గెలిచింది. కోహ్లీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. రోహిత్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ లభించింది.

**ఛేదన ధాటిగా..:** భారీ లక్ష్య ఛేదనతో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్, రాహుల్ మెరుపు ఆరంభంతో పాటు శతక భాగస్వామ్యాన్ని అందించారు. మిడిలార్డర్ మాత్రం ఆకట్టుకోలేకపోయింది. కానీ కోహ్లీ అసలు సిసలు ఆటను ప్రదర్శించాడు. అతడికి జడేజా జత కలిసి జట్టును విజయంవైపు నడిపించాడు. ఆరంభంలో ఓపెనింగ్ జోడీ చకచకా స్కోరును పెంచింది. తొలి ఓవర్‌ను మేడిన్‌గా ఆడిన రోహిత్..మూడో ఓవర్‌లో 2 ఫోర్లు, నాలుగో ఓవర్‌లో 4,6తో దూసుకెళ్లాడు. అటు రాహుల్ కూడా బౌండరీలు రాబట్టడంతో 16 ఓవర్లలో స్కోరు వందకు చేరింది. ఆ వెంటనే 49 బంతుల్లో రాహుల్.. 52 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీలు పూర్తి చేశారు. అయితే 23వ ఓవర్‌లో రోహిత్ వికెట్‌ను తీసి హోల్డర్ భారత్‌ను తొలి దెబ్బ తీశాడు. అప్పటికే తొలి వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యం జత చేరింది.

**'మిడిల్' వైఫల్యం.. కోహ్లీ పోరాటం:** రోహిత్ అవుటయ్యాక ఇన్నింగ్స్ గాడి తప్పింది. కోహ్లీ క్రీజులో పాతుకుపోయినా మిడిలార్డర్ నుంచి సహకారం కరువైంది. మధ్య ఓవర్లలో విండీస్ బౌలర్లు పరుగులను నియంత్రించారు. శతకం వైపు సాగుతున్న రాహుల్ 30వ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఆ వెంటనే శ్రేయాస్ అయ్యర్ (7), రిషభ్ పంత్ (7) పెవిలియన్ చేరారు. ఈ దశలో కేదార్ జాదవ్ (9)కు సత్తా చాటే చాన్సొచ్చినా విఫలమయ్యాడు. ఫలితంగా 40 పరుగుల వ్యవధిలోనే ఈ మూడు వికెట్లు నేలకూలాయి. అటు 51 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన కోహ్లీకి జడేజా స్ట్రయిక్‌ను రొటేట్ చేస్తూ సహకరించాడు. 44వ ఓవర్‌లో రెండు ఫోర్లు బాది కోహ్లీ కాస్త ఊపు తెచ్చాడు. చివరి 24బంతుల్లో 30 రన్స్ చేయాల్సిన దశలో కీమోపాల్ ఝలక్ ఇచ్చాడు. 47వ ఓవర్ తొలి బంతికే కోహ్లీని బౌల్డ్ చేశాడు. దీంతో మ్యాచ్ ఒక్కసారిగా విండీస్‌వైపు మొగ్గింది. కానీ అనూహ్యంగా శార్దూల్ ఠాకూర్ 48వ ఓవర్‌లో ఓ భారీ సిక్స్‌తో పాటు బౌండరీ బాదడంతో స్టేడియం హోరెత్తింది. దీంతో 12 బంతుల్లో సమీకరణం 7 రన్స్‌కు రాగా భారత్ 48.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది.

**ఆరంభంలో ఆచితూచి..:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ ఇన్నింగ్స్ తొలి 40 ఓవర్లపాటు మెరుపులు లేకుండానే సాగింది. డెత్ ఓవర్లలో నికోలస్ పూరన్, పొలార్డ్ ఆకాశమే హద్దుగా చెలరేగగా స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. వీరి విజృంభణతో విండీస్ చివరి 10 ఓవర్లలో 118 రన్స్ సాధించింది. పేసర్ సైనీ అద్భుత బౌలింగ్‌తో తొలి 8 ఓవర్లలో 28 పరుగులే ఇచ్చినా.. ఆతర్వాత ఈ జోడీ ధాటికి రెండు ఓవర్లలోనే 30 రన్స్ ఇచ్చుకున్నాడు. దీనికితోడు భారత ఫీల్డర్లు పలు క్యాచ్‌లు జారవిడిచారు. అంతకుముందు ఓపెనర్లు లూయిస్ (21), హోప్ (42) మధ్య తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం దక్కింది. వన్‌డౌన్‌లో వచ్చిన రోస్టన్ చేజ్ (38) నిదానం కనబర్చినా హెట్‌మయెర్ (37) ధాటిగా ఆడాడు. 28వ ఓవర్‌లో 6,4 బాదాడు. కానీ కెరీర్‌లో తొలివన్డే ఆడిన పేసర్ సైనీ సూపర్ యార్కర్‌తో చేజ్‌ను, తర్వాతి ఓవర్‌లోనే హెట్‌మయెర్‌ను పెవిలియన్ చేర్చాడు.

**చివర్లో మోతెక్కించారు:** పూరన్, పొలార్డ్ క్రీజులో ఉన్న దశలో విండీస్ స్కోరు 32 ఓవర్లలో 144 మాత్రమే. 37వ ఓవర్‌లో పొలార్డ్ రెండు సిక్సర్లు బాదినప్పటికీ 40 ఓవర్లలో స్కోరు 200కు కూడా చేరలేదు. కానీ అప్పటిదాకా ఓపిక ప్రదర్శించిన వీరిద్దరు చివరి ఓవర్లలో బౌలర్లను ఆటాడుకున్నారు. 43వ ఓవర్‌లో భారీ సిక్సర్‌తో పూరన్ 42 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 46వ ఓవర్‌లో 3 ఫోర్లు సాధించిన పూరన్.. 48వ ఓవర్‌లో 4,4,6తో రెచ్చిపోయాడు. కానీ అతడి దూకుడు అదే ఓవర్‌లో జడేజా క్యాచ్‌తో ముగిసింది. ఐదో వికెట్‌కు భారత్‌పై ఈ జోడీ రికార్డు స్థాయిలో 135 పరుగులు జోడించింది. చివరి రెండు ఓవర్లలో పొలార్డ్ ఓ ఫోర్, 3 సిక్సర్లతో కలిపి 32 పరుగులు రాబట్టాడు.

## కలిస్‌ను దాటిన కోహ్లీ

వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ ఏడోస్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో జాక్వెస్ కలిస్(దక్షిణాఫ్రికా)ను అధిగమించాడు. ఈ జాబితాలో సచిన్ టాప్‌లో ఉన్నాడు.

1. సచిన్ టెండూల్కర్ 18,426 రన్స్
2. సంగక్కర 14,234
3. పాంటింగ్ 13,704
4. జయసూర్య 13,430
5. జయవర్దనే 12,650
6. ఇంజమాముల్ హక్ 11,739
7. విరాట్ కోహ్లీ 11,609
8. జాక్వెస్ కలిస్ 11,579
9. సౌరవ్ గంగూలీ 11,363
10. రాహుల్ ద్రావిడ్ 10,889

## జోడీ నెంబర్. 1

భారత ఓపెనర్లు రోహిత్ శర్మ, రాహుల్ ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడుతున్నారు. వీరందించే శుభారంభాలతో జట్టు ఎదురులేకుండా సాగుతోంది. ముఖ్యంగా ధవన్ గాయంతో ఓపెనర్‌గా ఆడుతున్న రాహుల్ టీమ్ మేనేజ్‌మెంట్ అంచనాలకు అనుగుణంగా రాణిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది వీరు తొలి వికెట్‌కు ఐదుసార్లు 100+ పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన జోడీగా రికార్డు సృష్టించారు. అలాగే వీరిద్దరు కలిసి 1008 రన్స్ జట్టుకు అందించారు.


రోహిత్ (63)


రాహుల్ (77)

**స్కోరుబోర్డు**

**వెస్టిండీస్:** లూయిస్ (సి) సైనీ (బి) జడేజా 21; హోప్ (బి) షమి 42; చేజ్ (బి) సైనీ 38; హెట్‌మయెర్ (సి) కుల్దీప్ (బి) సైనీ 37; పూరన్ (సి) జడేజా (బి) ఠాకూర్ 89; పొలార్డ్ (నాటౌట్) 74; హోల్డర్ (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 50 ఓవర్లలో 315/5. వికెట్ల పతనం:** 1-57, 2-70, 3-132, 4-144, 5-279. **బౌలింగ్:** శార్దూల్ 10-0-66-1; షమి 10-2-66-1; సైనీ 10-0-58-2; కుల్దీప్ 10-0-67-0; జడేజా 10-0-54-1.

**భారత్:** రోహిత్ (సి) హోప్ (బి) హోల్డర్ 63; రాహుల్ (సి) హోప్ (బి) జోసెఫ్ 77; కోహ్లీ (బి) పాల్ 85; శ్రేయాస్ (సి) జోసెఫ్ (బి) పాల్ 7; పంత్ (బి) పాల్ 7; జాదవ్ (బి) కాట్రెల్ 9; జడేజా (నాటౌట్) 39; శార్దూల్ (నాటౌట్) 17; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 48.4 ఓవర్లలో 316/6. వికెట్ల పతనం:** 1-122, 2-167, 3-188, 4-201, 5-228, 6-286. **బౌలింగ్:** కాట్రెల్ 10-1-74-1; హోల్డర్ 10-0-63-1; పాల్ 9.4-0-59-3; చేజ్ 4-0-19-0; పియెర్ 7-0-46-0; జోసెఫ్ 8-0-53-1.

**2** — వన్డేల్లో వేగంగా 3వేల రన్స్ చేసిన రెండో బ్యాట్స్‌మన్ షాయ్ హోప్. 67 ఇన్నింగ్స్‌ల్లో అతడు ఈ ఘనత సాధించాడు. సౌతాఫ్రికా బ్యాట్స్‌మన్ హషీమ్ ఆమ్లా (57 ఇన్నింగ్స్) అగ్రస్థానంలో ఉన్నాడు.

**135** — భారత్‌పై ఐదో వికెట్‌కు పూరన్, పొలార్డ్ నమోదుచేసిన రికార్డు భాగస్వామ్యం ఇది. 2002లో విజయవాడలో శ్యామ్యూల్స్-పావెల్ 109 రన్స్ భాగస్వామ్యమే ఇప్పటివరకు రికార్డు.

**42** — ఈ ఏడాది వన్డేల్లో షమి సాధించిన వికెట్లు. 21 మ్యాచ్‌ల్లో ఆ వికెట్లు తీశాడు. ఇందులో ఓ హ్యాట్రిక్ (2019 వరల్డ్‌కప్), ఓసారి ఐదు వికెట్లు, మరోసారి నాలుగు వికెట్లు కైవసం చేసుకున్నాడు. ఇలా ఏడాదిలో అత్యధిక వికెట్లు తీయడం షమికిది రెండోసారి.

## కోహ్లీ-రోహిత్‌తో పోలిస్తే గంగూలీ-సచిన్‌ది ఉత్తమ జోడీ



**న్యూఢిల్లీ:** విరాట్ కోహ్లీ-రోహిత్ శర్మ జతగా బ్యాటింగ్ చేస్తూ భారీగా పరుగులు సాధించివుండొచ్చు. కానీ నాణ్యమైన బౌలర్లను ఎదుర్కొనే విషయానికి వస్తే..సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ జోడీనే గొప్పదని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ పేర్కొన్నాడు. 'కోహ్లీ-రోహిత్ వన్డేల్లో భారత్ అత్యుత్తమ జోడీ అన్న వాదన బలంగా వినిపిస్తోంది. అయితే 15 ఏళ్లపాటు సచిన్-సౌరవ్ ద్వయం ప్రపంచ మేటి బౌలర్లను చీల్చి చెండాడిన విషయాన్ని గుర్తించాలి' అని చాపెల్ గుర్తుచేశాడు. టెండూల్కర్, గంగూలీ ఆడిన రోజుల్లో ప్రపంచంలోని ప్రతి క్రికెట్ జట్టులో ఇరువురు నాణ్యమైన పేస్ బౌలర్లున్నారన్నాడు. 'వసీమ్ అక్రమ్-వకార్ యూనిస్, ఆంబ్రోస్-వాల్ష్, మెక్‌గ్రాత్-బ్రెట్ లీ, డొనాల్డ్-పొలాక్, మలింగ-చమిందా వాస్ లాంటి హేమాహేమీ పేసర్లను ఎదుర్కొని టెండూల్కర్, సౌరవ్ ధారాళంగా పరుగులు చేశారు' అని చాపెల్ వివరించాడు.

## ఓటమి దిశగా లంక

**లక్ష్యం 476.. ప్రస్తుతం 212/7 ● పాక్‌తో రెండో టెస్టు**


నసీమ్‌షా

**కరాచీ:** పాకిస్థాన్‌తో రెండో టెస్టులో పర్యాటక శ్రీలంక ఓటమి అంచున నిలిచింది. పాక్ నిర్దేశించిన 476 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో.. నాలుగో రోజైన ఆదివారం ఆట చివరకు లంక 7 వికెట్ల నష్టానికి 212 పరుగులతో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్ ఒషాడ ఫెర్నాండో (102 బ్యాటింగ్) ఒక్కడే అజేయ సెంచరీతో పోరాడాడు. నసీమ్‌షా 3 వికెట్లు తీశాడు. ఆటకు సోమవారమే ఆఖరి రోజుకాగా.. లంక విజయానికి మరో 264 రన్స్ చేయాలి. చేతిలో 3 వికెట్లే ఉన్నాయి. అంతకుముందు కెప్టెన్ అజర్ అలీ (118), బాబర్ ఆజమ్ (100 నాటౌట్) సెంచరీలతో రాణించడంతో.. ఓవర్‌నైట్ స్కోరు 395/2తో నాలుగో రోజు ఆట కొనసాగించిన పాక్ 555/3 వద్ద రెండో ఇన్నింగ్ డిక్లేర్ చేసింది.

### గోవా హ్యాట్రిక్.. ఒడిశాపై గెలుపు

**మర్గావ్:** ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్)లో ఎఫ్‌సీ గోవా వరుసగా మూడో విజయం సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గోవా 3-0తో ఒడిశాను ఓడించింది. ఫెర్రన్(19వ, 89వ) రెండు గోల్స్.. ఫెర్నాండెజ్ (85వ) ఓ గోల్ కొట్టాడు.



## చాంపియన్ ఆనంద్

**ఆలిండియా పోలీస్ టెన్నిస్**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** అఖిల భారత పోలీసుల టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో సీఐఎస్ఎఫ్ ఐజీ సీవీ ఆనంద్ చాంపియన్‌గా నిలిచాడు. వైజాగ్‌లో ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆనంద్ 8-4తో ఏపీకి చెందిన సత్యానారాయణపై గెలుపొందాడు. టీమ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఐటీబీపీని ఓడించి సీఆర్‌పీఎఫ్ జట్టు విజేతగా నిలిచింది. ఏపీ హోంమంత్రి మేకతోటి సుచరిత క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్, ఐబీ స్పెషల్ డైరెక్టర్ అలోక్ ప్రభాకర్, వైజాగ్ పోలీస్ కమిషనర్ ఆర్‌కే మీనా పాల్గొన్నారు.

एक राष्ट्र एक कर एक बाजार
NATION TAX MARKET
केन्द्रीया कर आयुक्त का कार्यालय
కేంద్ర పన్నుల కమీషనర్ వారి కార్యాలయము
सीजीएसटी भवन :: कन्नावारितोटा :: गुन्टूर.
CGST భవన్ :: కన్నావారితోట :: గుంటూరు-522 004.
TEL : 0863-2234713, ఫ్యాక్స్: 0863-2234365
SABKA VISHWAS (Legacy Dispute Resolution) SCHEME, 2019
గుంటూరు కేంద్ర వస్తు మరియు సేవాపన్నుల కార్యాలయము వారిచే సబ్ కా విశ్వాస్ (పూర్వ పన్నుల వివాద పరిష్కారం) మరియు వార్షిక టాక్స్ రిటర్న్స్ పై అవగాహన సదస్సు.
గుంటూరు CGST కమిషనరేట్ పరిధిలోని వస్తు మరియు సేవాపన్ను చెల్లింపుదారులు, టాక్స్ ప్రాక్టీషనర్స్, వర్తకసంఘాలకు ది.23.12.2019 తేది సోమవారం మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు హోటల్ సింధూరి, 4వ లైను, బ్రాడీపేట, గుంటూరు నందు సబ్ కా విశ్వాస్ (పూర్వ పన్నుల వివాద పరిష్కారం) మరియు వార్షిక టాక్స్ రిటర్న్స్ (2017-18) పై అవగాహన సదస్సు నిర్వహించబడును. కావున ఈ అవగాహన సదస్సులో పాల్గొని మీ యొక్క సందేహాలు నివృత్తి చేసుకొనవచ్చును. సెంట్రల్ ఎక్సైజ్ పన్ను మరియు సేవాపన్నులను అసలు చెల్లించనివారు, పన్నులు ఎగవేసిన వారు ఈ సబ్ కా విశ్వాస్ (పూర్వ పన్నుల వివాద పరిష్కారం) ద్వారా ఆ వివాదాలను పరిష్కరించుకోవచ్చును.
తేది : 20-12-2019 సం/- కమీషనర్

# అచ్చిరాని 'రాజధాని'



- ఇన్నేళ్లైనా ఆంధ్రులకు కలగానే..
- కర్నూలును కేపిటల్ చేసుకొంటే 'కలిసుందా'మని హైదరాబాద్‌కు
- విభజనతో హైదరాబాద్ దూరం..
- రాజధానే లేని రాష్ట్రం మనకు..
- ఆ కల అమరావతి తీర్చేంతలోనే తెరపైకి రాజధానుల ప్రతిపాదన
- ఏకంగా మూడు రాజధానులు
- అసలిదేదో తెలీని గందరగోళం

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు 'రాజధాని' నగరం అచ్చిరాలేదా?! కలల రాజధాని నవ్యాంధ్రలో సాకారం అవుతున్నదనే మురిపెం మూన్నాళ్ల ముచ్చటేనా?! రాష్ట్ర ప్రభుత్వం స్థాయిలో వేగవంతం అయిన పరిణామాలు ఈ ప్రశ్నకు అవుననే బదులిస్తున్నాయి. శాసనసభ శీతాకాల సమావేశాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజధాని నగరంపై చేసిన ప్రకటన ఒక్కసారిగా రాష్ట్ర ప్రజల్లో ప్రకంపనలు రేపింది. రిటైర్డ్ ఐఏఎస్ జీఎన్ రావు కమిటీ ఇప్పుడు రాజధాని నగరంపై చేసిన అధ్యయన నివేదిక మరింత కలవరపరిచింది. ఈ నేపథ్యంలో నవ్యాంధ్ర ప్రజలు మరోసారి గతాన్ని నెమరువేసుకుంటున్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు .. తెలుగు వారి ఆత్మగౌరవం పేరిట ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేశారు. ఈ పోరాటం ఫలించి, ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. ఆంధ్రరాష్ట్రానికి కర్నూలును రాజధానిని చేశారు. అయితే, అక్కడ సచివాలయంగానీ, అసెంబ్లీగానీ లేవు. రేకుల షెడ్లలోనే కొంతకాలం పాలన సాగింది. ఆ తర్వాత తెలుగువారంతా ఒక్కటేనన్న అభిప్రాయంతో, తెలంగాణ ప్రాంతంతో ఆంధ్ర రాష్ట్రం కలిసింది. తెలంగాణ, ఆంధ్ర రా ష్ట్రం కలసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. హైదరాబాద్ రాజధాని అయింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ కొత్తల్లోనే .. ఆంధ్రా ప్రాంతం వారు తెలంగాణ వనరులను దోచుకుంటున్నారంటూ అక్కడ ఆందోళన మొదలైంది. 1969లో తెలంగాణ ఉద్యమం మొదలైంది. దీంతో.. ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ నగరంపై సందేహాలు మొదలయ్యాయి. ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడినప్పుడల్లా .. హైదరాబాద్‌తో పెంచుకున్న అనుబంధం తెగిపోతుందోమోనన్న ఆందోళన పెరిగేది. ఉద్యమం జోరు తగ్గిన వెంటనే .. హైదరాబాద్ రాజధాని నగరంగా కొనసాగుతుందన్న భ్రమల్లోకి వెళ్లిపోయారు. 2005 నుంచి మళ్లీ తెలంగాణ ఉద్యమం మొదలైంది. 2009లో ఆ ఉద్యమం పతాక స్థాయికి చేరింది. 2013లో రాష్ట్ర విభజన జరిగిపోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి 'రాజధాని' సమస్య తలెత్తింది. 2014 డిసెంబరులో రాజధాని నగరంగా అమరావతిని ప్రకటించారు. రాష్ట్రానికి నడిబొడ్డున ఉండే అమరావతికి రాజధాని నగరంగా అభివృద్ధి చెందే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమయింది. కృష్ణా నదీ తీరాన రాజధాని నగరం ఉండడంతో .. జనాభాకు తగ్గ మంచినీరు లభిస్తుందని కూడా భావించారు. ప్రఖ్యాత విద్యా , వైద్య సంస్థలు రావచ్చున్న అభిప్రాయమూ నెలకొంది. అమరావతిలో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణాలు జరిగాయి. శాశ్వత భవన నిర్మాణాలు జరుగుతాయన్న ఆశలు నెలకొన్నాయి. విజయవాడ నుంచి గుంటూరు హైవే వెంబడి రియల్ ఎస్టేట్ భూమ్ మొదలైంది. ఆకాశ హర్మ్యాలు కనిపించాయి. రాజధాని నగరం అమరావతి క్రమంగా అభివృద్ధికి నోచుకుంటుందన్న ఆనందం నెలకొంది. ఇలాంటి తరుణంలో 2019లో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. చంద్రబాబు స్థానంలో జగన్ సీఎం అయ్యారు. అయితే, అప్పటికే .. రాజధాని నగరంపై .. జగన్ అవినీతి ఆరోపణలు చేయడం, దానిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని ప్రకటించడం వంటి ఘటనల నేపథ్యంలో .. రాజధాని నగరంలో ఆరు నెలలుగా అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయి. ఇలాంటి తరుణంలో .. ఈ నెలలో జరిగిన అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో .. రాజధాని నగరంపై సీఎం జగన్ చేసిన ప్రకటన రాజకీయంగా వేడెక్కించింది. అమరావతిలో అసెంబ్లీ, విశాఖలో సచివాలయం, కర్నూలులో హైకోర్టు .. ఇలా మూడు రాజధానులంటూ జగన్ చేసిన ప్రకటన .. ప్రధాన చర్చగా మారిపోయింది. ఏ ఇద్దరు కలిసినా .. ఇదే చర్చించుకోవడం కనిపించింది. శీతాకాలంలో హాట్ టాపిక్‌గా మారిన రాజధాని నగరం మార్పు అంశానికి మరింత వేడి పుట్టించేదిగా .. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రిటైర్డ్ ఐఏఎస్ జీఎన్ రావు కమిటీ ఇచ్చిన అధ్యయన నివేదిక ఉంది. సచివాలయం మార్పు తథ్యమని ఆ నివేదిక స్పష్టం చేసింది. దీంతో మరోసారి ఆంధ్రులకు 'రాజధాని' సమస్య తలెత్తింది. మొత్తంగానే రాష్ట్రానికి .. క్యాపిటల్ సిటీ అచ్చి రాలేదన్న అభిప్రాయం బలపడుతోంది.

### రాజధాని ఏదో?

'మూడు రాజధానులు' అంటూ ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలే గందరగోళంతో నిండి ఉండగా, జీఎన్ రావు కమిటీ ఇచ్చిన నివేదిక మరింత అయోమయానికి తావు ఇచ్చేలా ఉన్నదని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఉన్న అమరావతిని రాజధాని నగరంగా భావించాలా? సచివాలయం ఉన్న విశాఖపట్నంను రాజధాని నగరంగా పేర్కొనాలా? హైకోర్టు ఉన్న కర్నూలును రాజధానిగా భావించాలా అనే సందేహాలున్నాయి.

## అమరావతి భూములపై మరింత దృష్టి

- క్రయవిక్రయాలు, కేటాయింపులపై నిశిత పరిశీలన: సీఆర్డీయేకు ఆదేశం

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి సంబంధించిన భూవ్యవహారాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ తాము ప్రతిపక్షంగా ఉన్నప్పటి నుంచి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవముందంటూ చాటే ఆధారాల సేకరణ కోసం ప్రభుత్వ పెద్దల నుంచి సీఆర్డీయేకు తాజాగా ఆదేశాలందినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఇప్పటికే ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు మరింతగా దృష్టి సారించారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి కావాలన్న ప్రభుత్వ ఆదేశానుసారం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. టీడీపీ నేతలతోపాటు అప్పటి ప్రభుత్వంలోని కొందరు మంత్రులు, శాసనసభ్యులు, వారి సన్నిహితులు పలు అక్రమ మార్గాల్లో అమరావతిలో భారీగా భూములను సొంతం చేసుకున్నారంటూ వైసీపీ నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. కానీ తాము అధికారంలోకి వచ్చి 6 మాసాలు దాటినా ఆ ఆరోపణలను సాక్ష్యాధారాలతో నిరూపించలేకపోవడమూ విదితమే. ఇదిలావుంటే, అసైన్డ్ భూములను నిబంధనలకు విరుద్ధంగా కొందరు కొనుగోలు చేసి, వాటిని భూసమీకరణకు ఇచ్చి, బదులుగా పొందిన రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలిచ్చింది. ఇదే కోవలో ఇంకెన్నో లొసుగులు అమరావతి భూవ్యవహారాల్లో చోటుచేసుకున్నాయని, బినామీ లావాదేవీల ద్వారా అప్పటి అధికారపక్షమైన టీడీపీకి చెందిన ఎందరో నేతలు అపరిమిత లబ్ధి పొందారని వైసీపీ ఇప్పటికీ ఆరోపిస్తోంది. వీటినే అధికారులు పరిశీలించనున్నారు.

## ఫిరాయింపులతో.. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం

- సకాలంలో చర్యలు తీసుకోని స్పీకర్లు
- ఫిరాయింపుదార్లతో పార్టీ అధ్యక్షులే రాజీనామా చేయించేలా సవరణ
- ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని వెల్లడి
- డెహ్రాడూన్‌లో స్పీకర్ల సదస్సుకు హాజరు



న్యూఢిల్లీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులతో రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. డెహ్రాడూన్‌లో ఈ నెల 18 నుంచి 3 రోజుల పాటు అఖిల భారత అసెంబ్లీ స్పీకర్ల సదస్సు జరిగింది. లోక్‌సభాపతి ఓం బిర్లా ముఖ్య అ తిథిగా హాజరయ్యారు. సదస్సు అనంతరం తమ్మినే ని ఢిల్లీ చేరుకుని.. ఆదివారం ఏపీ భవన్‌లో మా ట్లాడారు. ఫిరాయింపుల నిషేధ చట్టం అమలులో ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలు లేదా ఎంపీలు ఒక పార్టీ తరపున గెలిచి.. తర్వాత మరో పార్టీలోకి మారడాన్ని నిషేధించలేని పరిస్థితిని స్పీకర్ల సదస్సు తీవ్రంగా పరిగణించినట్లు చెప్పారు. కర్ణాటక మాజీ స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ ఇటీవల 17 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడాన్ని స్పీకర్లంతా అభినందించినట్లు చెప్పారు. స్పీకర్లు తమకున్న విచక్షణాధికారాలను రాజకీయాలకు అతీతంగా వినియోగించడంలో విఫలవుతున్న కారణంగానే ఫిరాయింపుల నిషేధ చట్టం సక్రమంగా అమలు కావడం లేదని తమ్మినేని చెప్పారు. ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోకుండా తాత్సారం చేయడంవల్లే న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటున్నాయని చెప్పారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన శాసన వ్యవస్థలో న్యాయవ్యవస్థ జోక్యానికి తావులేకుండా రాజ్యాంగ స్ఫూర్తితో ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని స్పీకర్లు మరింత కఠినం గా.. నిష్పక్షపాతంగా అమలు చేసి, రాజకీయాల్లో నైతిక విలువలు పెంపొందించాలని సదస్సులో నిర్ణయించామన్నారు. ఒక పార్టీ గుర్తుతో గెలిచే ప్రజాప్రతినిధులు మరో పార్టీలోకి ఫిరాయిస్తే.. ఆయా పార్టీల అధ్యక్షులే వారితో రాజీనామా చేయించేలా చట్టసవరణ చేయాలని రాజస్థాన్ స్పీకర్ సీపీ జోషి ప్రతిపాదించారని తెలిపారు. దీనికి అందరూ మద్దతిచ్చారని చెప్పారు. ప్రస్తుత చట్టాన్ని కఠినతరం చేయడంపై అధ్యయనానికి స్పీకర్ల ఉపసంఘాన్ని నియమించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులోని సభ్యులను నియమించే అధికారాన్ని లోక్‌సభ స్పీకర్‌కు అప్పగించినట్లు తెలిపారు. లఖ్‌నవూలో జనవరి 15న మళ్లీ స్పీకర్ల సదస్సు జరుగుతుందన్నారు.

### ఫిరాయింపులపై జగన్ కఠినంగా ఉన్నారు

పార్టీ ఫిరాయింపులపై ఏపీ సీఎం జగన్ కఠినంగా ఉన్నారని తమ్మినేని చెప్పారు. ఇతర పార్టీల నుంచి వైసీపీలో ఎవరు చేరాలనుకున్నా.. ముందు ఆ ఎమ్మెల్యేలు, ఎంపీలు కచ్చితంగా తమ పదవులకు రాజీనామా చేయాలని.. అలాంటి వారినే పార్టీలోకి ఆహ్వానిస్తామని జగన్ అసెంబ్లీలోనే ప్రకటించారని గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో సభను సజావుగా నడిపించాలన్న లక్ష్యంతో తానెంతో సంయమనం పాటిస్తున్నానని తమ్మినేని చెప్పారు.

## స్పీకర్ తమ్మినేనికి ఏపీ భవన్‌లో అవమానం

- భోజన, వసతి బిల్లు చెల్లించాలన్న సిబ్బంది

న్యూఢిల్లీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ భవన్‌లో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు అవమానం జరిగింది. ప్రోటోకాల్ నిబంధనలను తుంగలోతొక్కి 'రాష్ట్ర అతిథి'గా తన గౌరవ మర్యాదలకు తిలోదకాలివ్వడంపై ఆయన మనస్తాపం చెందారు. డెహ్రాడూన్ నుంచి శనివారం సాయంత్రం తమ్మినేని ఢిల్లీలోని ఏపీ భవన్‌కు సతీసమేతంగా చేరుకున్నారు. ఆయనకు స్వర్ణముఖి బ్లాకులోని 320 గెస్ట్ రూమ్‌ను కేటాయించారు. ఆయన ఆదివారం సాయంత్రం రాష్ట్రానికి వెళ్లే హడావుడిలో ఉండగా.. ఏపీ భవన్ చిరుద్యోగి ఒ కరు వచ్చి.. 'సార్...భోజన, వసతి బిల్లు కట్టమన్నారు' అంటూ పుస్తకంపై సం తకం చేయాలని కోరారు. రాష్ట్ర అతిథి హోదాలో ఉన్న తనను బిల్లు అడగడమేంటని సీతారాం విస్తుపోయారు. 'సార్.. మీకు కేటగిరీ-1 కింద విడిది ఇచ్చారు. అమరావతిలో ఉండే సాధారణ పరిపాలనా విభాగం(జీఏడీ) నుంచి స్టేట్ గెస్ట్‌గా కాకుండా కేటగిరీ-1లో మీకు వసతి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చారు. అందువల్లే ఈ పొరపాటు జరిగింది' అని వారు తెలిపారు. 'ముందు బిల్లు కట్టేయండి.. తర్వాత సంగతి నేను చూసుకుంటా' అని సీతారాం తన ఆంతరంగిక సిబ్బందిని ఆదేశించారు. ఆ సమయంలో ఆయన సతీమణి వాణి కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. 'డబ్బు ఎంతైనా ముందు ఇచ్చేద్దాం. మనకు అవమానం జరిగింది. స్పీకర్‌గా ఈ అధికారులు గౌరవించలేదు' అని అసహనం వ్యక్తంచేశారు. కాగా, స్పీకర్ తమకు స్టేట్ గెస్ట్ అని, ఆయన విడిది ఉన్నందుకు బిల్లు వసూలు చేయాలనుకోవడం తప్పేనని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ భావనా సక్సేనా స్పష్టీకరించారు. ఆమె ఆదివారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్లో మాట్లాడుతూ పొరపాటుకు చింతిస్తున్నామన్నారు.

# అయ్యో.. ఇప్పుడెలా?

(మొదటి పేజీ తరువాయి)

సింహభాగం ఇంటి అద్దె, ఈఎంఐలకే పోతే రోజువారి జీవితం గడిపిదేలా అని వేదనపడుతున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని ఐనవోలులో ఏఐఎస్ అధికారులకు ఇళ్ల స్థలాలకు సీఆర్‌డీఏ గతంలో భూములు కేటాయించిం ది. సగటున ఒక్కో అధికారికి 500 గజాల భూమిని కేటాయించారు. గజానికి రూ.5వేల చొప్పున వారంతా రూ.25 లక్షల చొప్పున చెల్లించారు. ఇలా 350 మంది అధికారులు రూ.87.50 కోట్లమేర చెల్లించినట్లు తెలిసింది. చాలా మంది అధికారులు ఈపీఎఫ్ సొమ్ముతోపాటు బ్యాంకుల నుంచి రుణాలు తీ సుకుని మరీ ఆ ప్లాట్లకు డబ్బులు చెల్లించారు. కొందరు అధికారులు హైదరాబాద్‌లో ఉన్న ఇళ్లు, ప్లాట్లను కుదువపెట్టి మరీ డబ్బుకట్టారు. నాడు ప్రత్యేకంగా ఓ రిజిస్ట్రేషన్ అధికారిని అమరావతిలో ఏర్పాటు చేసి భూములు రిజిస్ట్రేషన్ చేశారు. రాజధానిలో భూములివ్వడమే గొప్పని, వచ్చిన అవకాశం చేజార్చుకోకూడదని ఎవరి ప్లాటు ఎక్కడో తేలకముందే, పేపర్‌పై ఉన్న లేఅవుట్లనే పరిగణనలోకి తీసుకుని హడావుడిగా డబ్బు చెల్లించారు. తమ భూ ముల్లో లే అవుట్‌వేసి అభివృద్ధి చేయాలని తొలి నుంచి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సీఆర్‌డీఏను కోరుతున్నారు. ఎన్నికల అనంతరం కూడా ఒత్తిడి తీసుకొచ్చారు. సీఆర్‌డీఏ కమిషనర్ లక్ష్మీనరసింహాన్ని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో త్వరలో లే అవుట్లు వేస్తామని సీఆర్‌డీఏ నుంచి శుభవార్త వచ్చింది.

### బొత్స వ్యాఖ్యలతో కలకలం..

లేఅవుట్ల ప్రతిపాదనలు సిద్ధమవుతున్న దశలో పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ రాజధానిని శ్మశానంతో పోల్చడం, దానిపై రాజకీయ దుమారం చెలరేగడంతో అధికారుల్లో నైరాశ్యం ఆవహించింది. వారి వాట్సాప్ గ్రూప్‌ల్లో బొత్స చేసిన శ్మశాన వ్యాఖ్యలపై చర్చలు జరిగాయి. 'మన భూముల మాటేమిటి? రాజధాని ఉంటుందా? అప్పులు తెచ్చి డబ్బులు చెల్లించాం. పీఎఫ్ సొమ్మును దీని కోసం వాడుకున్నాం. బ్యాంకు నుంచి లోన్ తీసుకుని ప్లాటుకు రూ.25 లక్షలు చెల్లించాం. నెలనెల ఈఎమ్‌ఐలు కడుతున్నాం' అంటూ తీవ్ర ఆందోళనతో అందులో చర్చలు జరిపారు. సీనియర్ అధికారులు భరోసా ఇవ్వాలని కొందరు జూనియర్ ఐఏఎస్‌లు విజ్ఞప్తి చేశారు. రాజధాని తరలివెళ్లదని, ఎన్నికలకు ముందు గుంటూరులో జరిగిన ప్లీనరీలో సీఎం జగన్ హామీ ఇచ్చారని, ఎవరూ అధైర్యపడవద్దని ఐఏఎస్‌ల గ్రూప్‌లో ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఈ నెల 17న అసెంబ్లీలో సీఎం ప్రకటనతో ఈ గ్రూప్‌లో చర్చలు మూగపోయాయి. ఏ పోస్టుపెడితే ఏమవుతుందోనన్న భయంతో రాజధాని ప్రస్తావన ఎత్తడానికి జంకుతున్నారు. అయితే గత మూడు రోజులుగా ఏ ఇద్దరు అధికారులు కలిసినా ఒక్కటే.. బాధ వినిపిస్తోంది. 'భూములు పోయినట్లేనా? మనం కట్టిన డబ్బులు వెనక్కి ఇస్తారా? అమరావతి భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తే.. మన పరిస్థితి ఏమిటి' అని కలవరపడుతున్నారు.

### చిన్న ఉద్యోగుల హాహాకారాలు..

భారీగా వేతనాలుండే ఐఏఎస్, ఐపీఎస్‌ల పరిస్థితే ఇలా ఉంటే.. మధ్య, దిగువ శ్రేణి ఉద్యోగుల మాటేమిటి? రూ.40వేల లోపు వేతనాలున్న ఉద్యోగుల మాటేమిటి? వారు మరీ దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సచివాలయంలో ఓ కీలక శాఖలో పనిచేస్తున్న అధికారి వేతనం రూ.40 వేలు. హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చాక తొలుత హెచ్‌వోడీలో పనిచేశారు. రాజధాని మారదన్న నమ్మకంతో గొల్లపూడిలోని తమ ప్రధాన కార్యాలయం సమీపంలో సొంతంగా ప్లా టు కొన్నారు. పీఎఫ్ సొమ్మును కొంత అడ్వాన్స్‌గా చెల్లించి, మిగతాది నెల వేతనం నుంచి చెల్లించేలా రూ.16,500 ఈఎమ్‌ఐ పెట్టుకున్నారు. తాజా పరిణామంతో షాక్‌కు గురయ్యారు. రాజధాని కొత్త ప్రాంతానికి వెళ్తే అక్కడ ఇంటి అద్దె, గొల్లపూడిలోని ఇంటి స్థలానికి ఈఎమ్‌ఐ కట్టేసరికి ఉన్న జీతం ఆవిరవుతుందని... ఇక పిల్లల చదువులు, రోజువారీ జీవనం ఎలా గడపాలంటూ మనోవేదనకు గురవుతున్నారు. మరో ఉద్యోగి హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఉన్న ఇంటిని అమ్మేసి వి జయవాడలో ఫ్లాటు తీసుకున్నారు. దానికి ఈఎమ్‌ఐ రూ.14,500 చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఇక్కడ ఫ్లాటుకు చెల్లించే ఈఎమ్‌ఐతోపాటు కొత్త ప్రాంతంలో ఇంటిఅద్దె భరించాలి. రూ.32వేల జీతమందుకునే తన పరిస్థితి అగమ్యగోచరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిద్దరే కా దు.. వేలాది మంది ఉద్యోగులు తాము పనిచేస్తున్న ప్రాంతాల్లో మా ర్కెట్ రేటు కాస్త ఎక్కువగా ఉన్నా జీవితమంతా కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఇళ్లు, ప్లాట్లు కొనుక్కున్నారు. ఇందుకోసం అనేక మంది బ్యాంకు రుణాలు తీసుకున్నారు. ఇప్పుడు ఆ రుణాలు రద్దుచేసుకోవాలనుకుంటే ఎంత కష్టం, నష్టం! తలకు మించిన ఆర్థిక భారమే.



చెంచులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న గవర్నర్

## చెంచుల సమస్యలపై దృష్టి సారిస్తా

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

కర్నూలు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'జీవనోపాధి కోసం వ్యవసాయం చేయండి. నాగరిక ప్రపంచంలో అడుగుపెట్టండి. చిన్నారులను బడికి పంపండి. యువకులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయండి. రెవెన్యూ శాఖ మంత్రిగా ఒడిసాలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాను. మీ సమస్యలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తా' అని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చెప్పారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం శ్రీశైలం చేరుకున్న గవర్నర్ తొలుత భ్రమరాంబ మల్లికార్జునులను దర్శించుకున్నారు. శివాజీ స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన లక్ష కలశాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం 'చెంచులతో ముఖాముఖి' కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెంచుల సంస్కృతి, సంప్రదాయాలను, స్థిరత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. చెంచుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డీఆర్డీఏ తరపున రూ.1.39 కోట్ల విలువైన చెక్కును గిరిజన సమాఖ్యలకు అందజేశారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులను తిలకించారు.

### కర్నూలు మెడికల్ కాలేజీ వేడుకల్లో..

శ్రీశైలం నుంచి కర్నూలు చేరుకున్న గవర్నర్.. మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించి, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వైద్యులు నిరుపేదలకు నిస్వార్థంగా సేవ చేయాలని సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెంటినరీ సెలబ్రేషన్స్ సందర్భంగా రూ.12 లక్షల సభ్యత్వ నిధిని వైద్య విద్యార్థులు గవర్నర్‌కు అందించారు. అనంతరం దూపాడులోని గాయత్రి గోశాలను గవర్నర్ సందర్శించారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయవాడ వెళ్లారు.

## 'పౌరసత్వం' పై జగన్ పునరాలోచించాలి: ఒవైసీ

హైదరాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టానికి వైసీపీ మద్దతుపై ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం జగన్ పునరాలోచించుకోవాలని మజ్లిస్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. దేశంలో మతసామరస్యతకు విఘాతం కలిగించే విధంగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాన్ని తెస్తోందని నిరసిస్తూ మజ్లిస్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో బహిరంగ సభ జరిగింది. ఇందులో ఒవైసీ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని, దేశంలో మతసామరస్యతను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. లాఠీలు, తూటాలకు తాను జంకేది లేదన్నారు. ప్రాణత్యాగానికైనా సిద్ధమని పేర్కొన్నారు.






Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

epaper.andhrajyothy.com